ఆంధ్రసచిత్రవారపత్రిక

పత్రిక

పెళ్లిసంబంధాలూ-పెద్దలూ



13-7-62


మృదువైన చర్మానికి

అమృతాంజన్ వారి

చల్లని బాధా నివారిణి


అనోలియం

పసిపిల్లలకుకూడా వాడవచ్చు మంచి గుణమిస్తుంది




అనోలియం వెంటనే గుణమిచ్చు చల్లని సరిక్రొత్త దివ్యౌషధం. అది మీ చర్మమునకు మంట కల్గించదు. అయినా శక్తివంతమైన వస్తువులతో తయారవటంవల్ల మీకది నరముల నొప్పులు, జలుబు, తలనొప్పులనుండి వెంటనే విముక్తి చేకూరుస్తుంది. చమురుకారుతూ జిడ్డుగా వుంటుందేమోనన్న ఓగులులేక మీరు అనోలియంను నిర్భయంగా వాడవచ్చు.

అనోలియం పిల్లల జలుబులు, దగ్గులకుకూడా అనువైనది



రాత్రివేళల్లో పిల్లలు జలుబుతోను, దగ్గుతోను సతమతమై పోతారు. పడుకునేముందు రొమ్మున రవంత అనోలియం మర్దిస్తే చాలు; రక్త సంచయాన్ని తగ్గించి, రక్త ప్రవాహాన్ని క్రమపరిచేందుకు తోడ్పడుతోంది. పిల్లలు హాయిగా నిద్రపోతారు. తెల్లవారేసరికి ఆరోగ్యంగా, కలకలలాడుతూ కనబడతారు.

అమృతాంజన్ లిమిటెడ్

14/15 లజ్ చర్చి రోడ్డు, మద్రాసు-4

బొంబాయి-1, కలకత్తా-1, న్యూఢిల్లీ-1

(JWT AM/AN/1722 తె)

ఆంధ్రసచిత్ర వారపత్రికలో ప్రకటనలు
మీ వ్యాపారాభివృద్ధికి తోడ్పడుతాయి

ఉత్తరాలు

ముఖచిత్రం

కృష్ణకుమారి ముఖచిత్రం ఎన్నిసార్లు చూచినా తనివితీరడంలేదు. ప్రతివారం ఇలాంటివే వేయవలెనని కోరుతున్నాను.

గానిగ ఆర్. రాంబాబు బి. ఏ. (గుంతకల్లు)

* * *

22—6—62 వారపత్రిక ముఖచిత్రంలో భగవద్గీతకు ఎంత దుర్గతి (అగౌరవం) గా ఉందో చిత్రకారులు ఆలోచించినట్లు లేదు.

సిరిదాన్ (జావ్‌తాడా)

కార్టూన్లు

ఆంధ్రసచిత్ర వారపత్రిక (22—6—62)లో శ్రీ సుందర్‌గారు వేసిన కార్టూన్ చాల అసందర్భంగా ఉంది. "అప్పుడే నాల్గింటా వయిందా"ని అన్నంతమాత్రాన కాఫీ కప్పు (మరే కప్పు అయినా కానివ్వండి) బోల్తాకొట్టడం అసంభవము. ఏదో కాస్త కాఫీ ఒలికిపోయి దుస్తులమీద పడడం జరుగవచ్చుకాని ఒక్కమారుగా కప్పు బోల్తాకొట్టడం అనేది జరుగదు. శ్రీ సుందర్‌గారికి ఈ చిన్న పొరపాటు దొరలినందులకు విచారిస్తున్నాను.

మాముడూరు లక్ష్మీకాంతన్ (గుత్తి)

* * *

మేము పంపిన కార్టూన్స్ మీ పత్రికలో ప్రచురించుకోవాలంటే ఏమైన ఫీజు కట్టాలా ?

కె. వి. ఎస్. ఎన్. మూర్తి (చోడవరం)

అక్కరలేదు. ప్రచురిస్తే మేమే మీకు ఫీజు కడ్తాము.

దేహస్థితి

22—6—62 వారపత్రికలో మనముమన దేహస్థితి చదివాను. డా. గాలి బాలసుందరరావుగారు 31 వ పేజీ 2 వ కాలంలో జీవకణవిభజన రెండు రకములు (Amitosis & Mitosis) అని పేర్కొన్నారు. కాని కణ విభజన (Meiosis) (మియోసిస్) అనే మూడవ పద్ధతిద్వారా కూడా జరుగుతుందని అనుకుంటున్నాను. ఎటొచ్చీ ఈ మూడో రకం ఒక్క (Sex Cells) (సెక్స్ సెల్స్) యందు మాత్రమే జరుగును.

ఎస్. జి. నిర్మల (గుడివాడ)

విమర్శలు

22—6—62 తేదీ పత్రికలో కె. సదానంద శర్మగారి ఉత్తరం నాకు చాల ఆశ్చర్యాన్ని కలిగించింది. రచయితలే తమ కథలను పొగుడుకుంటూ మారుపేర్లతో పత్రికలో ఉత్తరాలు వ్రాస్తున్నారనడం సమంజసంగా లేదు. పాఠకుల అభిప్రాయాలకోసం నిర్ణయించబడ్డ ఉత్తరాలశీర్షికను ఆవిధంగా వ్యాఖ్యానపరచడం, పైగా రచయితలు స్వంతడబ్బా వాయించుకుంటున్నారనే అభిప్రాయాన్ని వ్యక్తం చేయడంలో శర్మగారు చాల తొందరపడ్డారు.

పి. ఎస్. రావు (అసన్‌సోల్)

(సి) నీతిచంద్రిక

పివిన్న్డయ్ (సి) నీతిచంద్రిక రచయితగారూ ! సుకుమార్ గారూ! ఒక మాట... ! తెనుగుదేశ సంప్రదాయము ప్రకారము ఏదైనా కథను "అనగా అనగా" అని మొదలెట్టి "కథ కంచికి, మన మింటికి" అని అంతంచేస్తారు. మరి మీరేమో "ఇనగా ఇనగా ఒక ఊర్కి" అని మొదలెట్టారు. అది నాకు క్రొత్తగాను, ఎబ్బెట్టుగాను ఉంది. అది ఏ సంప్రదాయమో లేక (సి) నీతిచంద్రికలోని (సు) మార్పులలో ఒకటో తెలియజేస్తారా !

మరోమాట మీరు సినిమాకు సంబంధించిన వేరొక శీర్షిక తయారుచేస్తున్నారని తెలిసింది. అది వినగా వినగా ఒక కథ కాదుకదా ? చిత్రలాభములో చాపమీద పొర్లుతున్న మహాశయుణ్ణి పిలచిన (కలో లేక నిజమో) విశ్వాస్‌గారు చివరికి విశ్వాసరహితులు అవుతారా లేక .... ఏమయ్యేది చెబుతారు కదూ !

పెనుమూడి మల్లిఖార్జునరావు (మచిలీపట్నం)

* * *

సుకుమార్‌గారి "చిత్రలాభము" చదువుతూంటే నవ్వు ఆగలేదు. సుకుమార్‌గారికి హాస్యప్రియ పాఠకులద్వారా ధన్యవాదాలు అందచేస్తున్నాను.

కాజ సత్యనారాయణమూర్తి (కాకినాడ)

* * *

(సి) నీతిచంద్రిక బావుంది. ధనవంతుడి కేకకు పొగగొట్టం ఎగిరిపోవటం, నౌకర్లు తమ బలాన్ని అంతా ఉపయోగించి 'ఫేన్ స్విచ్' వేయటం, విరిగిన స్విచ్ ముక్కల్ని మోసుకుంటూ పోవటం— మొదలైనవి ఎంత అతిశయోక్తులు! కొన్ని అతిశయోక్తులు హాస్యాస్పదంగా ఉంటాయి గాని ఇది చదువుతుంటేమాత్రం సరదాగానూ నవ్వుగానూ ఉంటోంది.

కుమారి ఆచంట కృష్ణవేణి (పేరవరం)

సరాగమాల

రోజురోజుకు "సరాగమాల" శీర్షిక ఉత్సాహవంతముగా ఉంటున్నది. రికార్డుల "ఇన్ఫర్మేషన్" రంగారావుగారు బాగాయిస్తున్నారు. ఒక సందేహము—

"కలసి ఉంటే కలదు సుఖం" చిత్రంలోని ఘంటసాల, సుశీల పాడిన "ముద్దబంతిపూలు పెట్టి" అన్న పాటలోని ప్రారంభభాగం ఎవరి కంఠధ్వనియో రంగారావుగారు తెలియజేస్తారని తలుస్తున్నాను.


వి. ఎస్. జగపతిరాజు (విజయవాడ)

* * *

"నిత్య వినోదం' అన్న పాట ఎల్లారి ఈశ్వరి, పి. బి. శ్రీనివాస్ పాడారని చెప్పారు. కాని పుస్తకంలో డి. ఎల్. రాజేశ్వరి పాడినట్లు ఉంది. అసలు ఎల్లారి ఈశ్వరి పేరు పుస్తకంలో ఎక్కడా లేదు. ఇది మీ పొరబాటా ? లేక పుస్తకం పొరబాటా తెలుపవలసినది.

వై. వి. ఎస్. ఆర్. ప్రసాద్ (యద్దనపూడి)

'ఆంధ్రసచిత్ర వారపత్రిక'లో ప్రచురణకు ఇండియన్ ఇంక్‌తో వేసిన కార్టూనులు మాత్రమే పంపాలి. సాధారణంగా 4" × 2", 4" × 4" చిత్రాలు పత్రికలో వేస్తూ ఉంటాయి.





ఆంధ్రసచిత్రవార పత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

*

శుక్రవారం : 13—7—62
సంపుటము : 54 సంచిక : 45
శుభ॥ సం॥ ఆషాఢ మాసం॥ శుద్ధ ఏకాదశి

స్థాపితము :
1908

*

ముఖ్య సంపాదకులు :
శివలెంక శంభుప్రసాద్

*

సంపాదకులు :
శివలెంక రాధాకృష్ణ

*

విడి ప్రతి : 25 న. పై
సంవత్సర చందా : 13-0-0 రు.

*

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టివీథి, మద్రాసు-1

★



"అమరశిల్పి జక్కన్న"లో
బి. సరోజాదేవి.

మనలోమాట

కొందరు పాఠకులు తమ ఉత్తరాలు అసలు పడటమే లేదని వ్రాస్తూ ఉంటారు. ఏదైనా ఒక శీర్షిక చాలా బాగుందని ఎన్నో ఉత్తరాలు వస్తే మచ్చుకి ఒకటి రెండు వేస్తాము. కాని సాధారణంగా ఉత్తరంలో కొంచెం కొత్తదనం ఉన్నదనిపించినప్పుడే ప్రచురణకు ఎన్నుకుంటాము. సహృదయంతో కూడిన విమర్శ, సున్నితమైన వ్యంగ్యం (అమాయకంగా కనిపించినా సరే!) ఇవి రెండు మేము పాఠకుల ఉత్తరాలలో ముఖ్యంగా కోరేవి. కేవలం పేరు పడేందుకు 'ఇది బాగుంది. రచయితకు మా అభినందనలు' అనే ఉత్తరాలు ఎక్కువగా వెయ్యటం మాకు ఇష్టం లేదు! ఏదైనా ఒక శీర్షికమీద ఇటువంటి ఉత్తరాలు మరీ ఎక్కువగా వస్తే మచ్చుకి కొన్ని వేస్తామని పైన చెప్పనే చెప్పాము...

లోకంపోకడ



"మన రాష్ట్రం కొత్త బడ్జెట్ చూసి చూడగానే మీకేమనిపించింది?"

"ఇలాంటి ప్రభుత్వం దాపురించిందేమా అని విచారం కలిగింది!"

"నాకూ అంతే సుమండీ!"

విషయానుక్రమణిక



శబ్దము చేయరాదు
రేపటి మహాత్ముడు
రంగా నిరశన వ్రతం చేస్తారు - వార్త
మిగ్ విమానాల వ్యవహారం
అమెరికా
బ్రిటన్
హడావిడి
వన మహోత్సవం
కులతత్వం
భాషా తత్వం
ధిల్లీ నాయకులలో హృదయపరివర్తనం కలుగుతుందని ఆశిస్తున్నాను
నిన్న
నేడు

పన్నుల పెంపకం: ప్రతిపక్షాల విమర్శ

ఈసారి బ్రహ్మానందరెడ్డిగారి బడ్జెట్ రాష్ట్ర మంతటా బ్రహ్మాండమైన దుమారం రేపింది. శాసనసభలో ప్రతిపక్షాల నిశిత విమర్శలతోపాటు, బయట ప్రజల నిరసనప్రదర్శనలు కూడా సాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత ఈ ఐదారేళ్ళలో బడ్జెట్‌పై ఇంతటి తీవ్ర ప్రతిఘటన రావడం ఇదే ప్రథమం. 1962—63 లో ప్రణాళిక పథకాలకుగాను 5 కోట్లు అదనపు పన్నుల ద్వారా రాబట్టాలని ఆర్థికమంత్రి సంకల్పించడమే ఈ గొడవంతటికీ కారణం.

అదికాక ఆర్థికమంత్రి విధించదలచిన కొత్త పన్నులలో భూమిశిస్తు పెంపకం ప్రధానమైనదవడం చేత, ప్రజలలో అధిక సంఖ్యాకులైన రైతులను కూడగట్టుకుని రాజకీయంగా బలపడుదామని ప్రతిపక్షాలవారు ఈ అవకాశాన్ని గట్టిగా వినియోగించుకుంటున్నారు. అందులో ఆశ్చర్యమేమీలేదు. అలా వినియోగించుకోకపోతే అవి ప్రతిపక్షాలేకావు. ఈ ప్రతిపక్షాల ఆందోళన ముమ్ముందు సాగించబోయే సత్యాగ్రహోద్యమాలు ఎంతవరకు సఫలీకృతమవుతాయి అంటే అది వేరే విషయం.

పన్నులు ప్రతిఘటిస్తూ, ప్రతిపక్షనాయకులు చేస్తున్న వాదన సారాంశం ఇలా ఉంది:


(1) అదనపు పన్నులు విధించడానికి ప్రభుత్వం ముందస్తుగా ప్రజామోదం పొందలేదుగాబట్టి, ఈ పన్నులు విధించే అధికారం ప్రభుత్వానికి లేదు; (2) ఇప్పుడైనా అట్టి ఆమోదం పొందడానికి, భూమిశిస్తుబిల్లును ప్రజాభిప్రాయానికి నివేదించాలి; (3) అథవా శిస్తు పెంపకం తప్పనిసరైతే ఐదు, పదెకరాల రైతులను మినహాయించాలి; (4) అసలు భూమిశిస్తనేది లేకుండా ఎత్తివేసి వ్యవసాయాదాయంపై పన్ను విధించేవిషయం పరిశీలించాలి.

ఈ వాదనలలో అట్టే అర్థం ఉన్నట్లు కన్పించదు. ఎందుకంటే కాంగ్రెస్‌పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే ఉన్న పన్నులు పెంచుతారని, కొత్త పన్నులు విధిస్తారని ఎన్నికలకుముందే అందరికీ తెలుసు. కాంగ్రెస్‌పార్టీ తన ఎన్నికల ప్రణాళికగా వరించిన తృతీయప్రణాళికలో ఈ ఐదేళ్లమీద కేంద్రం 1100 కోట్లు, రాష్ట్రాలు 600 కోట్లు పన్నులు విధించాలని ఉన్న అంశం ఎవరూ ఎరుగనిదికాదు. ఆ ప్రణాళిక ఆధారంగా ఎన్నికలలో పోటీ చేసిన కాంగ్రెస్ పక్షాన్ని ప్రజలు ఎన్నుకున్నారంటే ప్రణాళికకు కావలసిన కొత్తపన్నులు విధించే అధికారం కాంగ్రెస్ ప్రభుత్వాలకు ఇచ్చారనేకదా అర్థం. ఇప్పుడు శ్రీ బ్రహ్మానందరెడ్డి విధిస్తున్న పన్నులు కూడా అనుకోకుండా, అకస్మాత్తుగా వచ్చిపడినవి కావు. క్రితం మార్చి మూడోవారంలో తాత్కాలిక బడ్జెట్ అంచనాలు ప్రతిపాదిస్తూ, ఈఏడు మొదలుకొని మళ్ళీ నాలుగేళ్ళలో 45 కోట్లకు కొత్త పన్నులు వేస్తామని (తరువాత ఈ అంకె 53 కు పెంచారు) ముందరగానే హెచ్చరించి ఉన్నారు. వారు విధించబోయే పన్నుల స్వరూప స్వభావా లెటు వంటివోకూడా చూచాయగా తెలిసినదే. కనుక అకస్మాత్తుగా వచ్చిన ప్రతిపాదన లేమీ కావు. పోతే [illegible] ఈ బిల్లును ప్రజాభిప్రాయానికి నివేదించాలన్నది. ఇంతవరకూ ఇలాంటి పన్నుల బిల్లులను ప్రజాభిప్రాయానికి నివేదించిన సందర్భాలేవీ లేవు. పైగా కొత్తపన్నులను ఎవరూ సహించరు గనుక, ప్రజాభిప్రాయం ఎలా ఉండేది ముందే తెలుసుగనుక, ఏ ప్రభుత్వమైనా ఇలాంటి సాహసానికి ఒడిగట్టదు. ఇక మూడో విషయం. భూమిశిస్తు బిల్లునుండి ఐదు పదెకరాల రైతులను మినహాయించాలని. ఈ వాదాన్ని కాంగ్రెస్‌పార్టీలో కూడా పలువురు బలపరుస్తున్నారు. కాని, ఇది జరిగేపని కాదు. మన రాష్ట్రం రైతులలో ఎక్కువమంది మధ్యతరగతి, సన్నకారు రైతాంగమే. చాలామట్టుకు ఐదు, పది, పదిహేను ఎకరాల కమతాలే. ప్రభుత్వానికివచ్చే 12 కోట్లు భూమిశిస్తు ఆదాయంలో ఎక్కువగా ఈ బాపతు రైతులనుండి వస్తున్నట్టిదే. వీరిని మినహాయించినట్లయితే ప్రభుత్వానికి పన్ను పెంచారని పేరు మినహా, జరిగే ప్రయోజనమేమీ ఉండదు. వ్రతం చెడికూడా ఫలితం దక్కనట్లవుతుంది. ఇక భూమిశిస్తు బదులు వ్యవసాయాదాయంపై పన్ను విధించాలన్న సూచన ఉంది. దీనికి ఆర్థికమంత్రి జవాబు చెప్పనే చెప్పారు. వ్యవసాయ ఆదాయాన్ని మదింపుచేయడం కష్టమని, పైగా చిన్న చిన్న కమతాలు, నిరక్షరకుక్షులు అయిన రైతాంగం ఉన్న మనదేశంవంటి దేశాలలో ఇది సాధ్యంగాదని ఏనాడో అంతా అంగీకరించారు.

ఇక కొత్తపన్ను లేమీ లేకుండా ప్రణాళికలు అమలు జరుపుకోవాలంటే (1) ఉన్న సాధనసంపత్తికి తగ్గట్లుగా ప్రణాళిక కుదించుకోవాలి. (2) లేదా కేంద్రం ఇప్పు డిచ్చే మొత్తం మరింత పెంచాలి. కాని మనరాష్ట్రానికి 305 కోట్ల ప్రణాళికే చాలదని కనీసం 500 కోట్ల ప్రణాళికైనా ఉండాలని ఇన్నాళ్ళూ వాదించిన ప్రతిపక్షనాయకులు ప్రణాళిక కుదింపుకు ఒప్పుకుంటారా ఒప్పుకోరు. పోతే ఈ 305 కోట్ల ప్రణాళికలోనూ, కేంద్రం 200 కోట్లదాకా సహాయం చేస్తోంది. మనపట్ల ప్రత్యేకతచూపి ఈ మొత్తాన్ని ఇంకా పెంచడం అసంభవం. కాబట్టి, రాష్ట్రప్రభుత్వం ప్రణాళికలో తన వాటా 105 కోట్లు సేకరించాలంటే స్వశక్తిపై ఆధారపడకతప్పదు. పోనీ పన్నులు పెంచకుండా ఆదాయం రాబట్టటానికి ప్రత్యామ్నాయ మార్గాలేమైనా ప్రతిపక్షాలవారు నిర్దుష్టంగా సూచించారా అంటే అదేమీ లేదు. మద్యనిషేధం ఎత్తివేయాలని ఒకరు, కేంద్రానికి చెల్లించే వడ్డీలు తగ్గించమని మరొకరు, రాబడిపన్ను, ఎక్సైజు సుంకాలలో ఎక్కువవాటా సాధించాలని ఇంకొకరు—రకరకాలుగా చెప్పారు. ఇవి ఉత్తమమైన సూచనలేనని అంగీకరించినా అమలుజరిగేవికావు.

కాగా ప్రణాళికాద్రవ్యంకోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్తపన్నులు విధించాల్సిన అవసరం కొంతమట్టుకైనా ఉన్నదని అంగీకరించక తప్పదు. రాష్ట్రం ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో—అంటే కేవలం వ్యవసాయాధారంగా ఉన్నంతకాలము—ఏ పన్నువేసినా,

—64 వ పేజీ చూడండి



శ్రీ॥ శే॥ డాక్టర్ రాయ్

ఇద్దరు మహానాయకుల అస్తమయం

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి డా॥ బి. సి. రాయ్, బాబు పురుషోత్తమదాస్ టాండన్‌ల అస్తమయంతో నెహ్రూ, రాజన్ బాబువంటి ఒకరిద్దరు మినహా మహానాయకులకోవకు చెందిన వారందరూ వెళ్ళిపోయారనే అనుకోవలసివస్తోంది. ఇది నిజంగా సంతాపహేతువైన విషయం.

డా॥ రాయ్ ప్రముఖరాజకీయనాయకుడేకాక, వైద్యవృత్తిలో మహామేధావిగా ప్రసిద్ధికెక్కారు. స్వాతంత్ర్యసముపార్జనకోసం తమ సర్వస్వం వదులుకుని, జాతీయోద్యమంలో ప్రవేశించిన త్యాగశీలి. దేశ విభజనానంతరం బెంగాల్‌లో ఏర్పడిన సమస్యలను పరిష్కరించి, ఆ రాష్ట్రంలో కాంగ్రెసు ప్రభుత్వానికి ఎంతో కొంత సుస్థిరత్వం కలిగించినఖ్యాతిఆయనకే దక్కింది. ఆయన పరిపాలనా దక్షతకు, రాజనీతిజ్ఞతకు వేరే నిదర్శనలు అనవసరం. బెంగాల్‌లో డా॥ రాయ్ వాక్కు శిలాక్షరంగా చెల్లుబాటు అయింది. బెంగాల్‌కు ఆయన ఏకైక నాయకుడు. ఆయన ఇదివరకే మరణించి ఉంటే బెంగాల్ పరిస్థితులు ఈనాడు ఏలా ఉండేవో ఊహించటం కూడా కష్టమే! 'ఆధునిక వంగరాష్ట్రానికే కాక యావద్భారతానికి ఆయన మూలస్తంభం వంటివారు' అన్న ప్రధాని మాటలలో అతిశయోక్తి లేదు.



పదం పదము

లత

ఎడతెగని మానసిక క్షోభతో మింటికేసి చూస్తున్నాడు. నింగి తన నీలిరంగును పోగొట్టుకొని దూరంగా మెరిసే కొద్దిపాటి తారలతో నల్లగ కనిపిస్తుంది. ఆకాశం అంతగా నిర్మలంగా వుంటె రఘుపతిగారి మనస్సు నడిసముద్రములో దిక్కు దిక్కుమంటూ కొట్టుమిట్టాడుతున్న నావలాగ కల్లోలపడుతుంది.


ఆరోజు జరిగిన సంఘర్షణను పరిశీలించడం మొదలెట్టాడు.

పుత్రుడు శేఖరాన్ని ప్రశించాడు తను.

"ఇదంతా నిజమేనా"

57—వ పేజీ చూడండి

(సి) నీతి చంద్రిక ***



చిత్ర భేదము

సుకుమార్

మహాశయుడు మంచినీళ్ళు పుచ్చుకున్నాడు— ధనవంతుడు, కుమారరత్నం ఉప్పునీళ్ళయినా పుచ్చుకోలేదు.

"మంచితీర్థం పుచ్చుకోరూ?" అన్నాడు మహాశయుడు.

"నో, థాంక్స్" అన్నాడు కుమారరత్నం.

"థాంక్స్" అన్నాడు మహాశయుడు.

"తర్వాతేమయింది? అతనేమయాడు? నువ్వూ, అదెవరో ఆ విశ్వనాథం కలుసుకున్నారా? ఆ సినిమా మావూరు రాలేదా? ఆ మిగిలిన వస్తువును రత్నా ఏంచేస్తున్నాడు?" అని గుక్కతిప్పుకోకుండా అడిగాడు ధనవంత్ మహాశయుడు నవ్వి—"ఇవన్నీ మీరు వెండితెరమీదచూచి ఆనందించవలసినవే వెండితెరలు ఎక్కడా లేవుకాబట్టి, గుడ్డ తెరమీదయినా చూసితీరాల్సిందే. వెండితెరంటే జ్ఞాపకం వచ్చిందీ—వొద్దులెండి. మీరు నన్నేమన్నా డైరక్టరుగా తీసుకోవాలా, చావాలా?" అన్నాడు దిగులుగా.

"చెప్పవయ్యాచూదాం" అన్నాడు ధనవంతుడు.

"ఏమిటి చూసేది, సినిమా. ఐతే, ఇప్పుడు మీరు చిత్రలాభము విన్నారు. అట్లాగే చిత్రభేదం అనే మరొకభాగం చెబుతాను. సావధానంగా ఆలకింతురుగాక!" అని మహాశయుడు ఆరంభించాడు.

"తర్వాత నేనుపడ్డ అవస్థలన్నీ ఇన్నీ అన్నీ కాదు. సినిమాలో తప్పిపోయిన పుత్రునికోసం ఆ తల్లి నాఅంత కష్టపడి ఉండదు—విడిచిపెట్టేసిన తన భర్తకోసం ఆ భార్య నాఅంత అవస్థపడివుండదు. మాంత్రికుడెత్తుకుపోయిన రాజకుమారి, నా అంత దుర్భర పరిస్థితులు అనుభవించిఉండదు—సరేగానీండి— రిలీఫ్ కోసం చిన్న హాస్యం చెప్తాను వినండి. ఒకసారేం జరిగిదంటే, నేను ఒక షూటింగు చూడటానికి వెళ్ళాను. ఊరికే అక్కడెవరితోనో పనివుండి వెళ్ళేసరికి షూటింగ్ జరుగుతోంది. ఒక వయస్సు మళ్ళినాయన, ఏం జరిగిందో మరి క్లైమాక్సులో హెవీ డైలాగు చెప్తూ, ఏడుస్తున్నాడు. ఆ డైలాగులున్నాయండీ—వెరీ హెవీ! ఎంతమంది కూలీలను తీసుకొచ్చి మోయమన్నా మొయ్యలేరన్నమాట! అటువంటిది, ఆ ఒక్కడూ ఏం మోస్తాడు చెప్పండి. సరే, షాట్ ఐపోయింది. 'బ్రహ్మాండం, ప్రపంచం, లోకం, ఉలగం' అన్నారంతా. నాకో విట్టు తట్టింది. ఆ డైరెక్టరును పక్కకు పిలిచి, చెవిలో విట్టు చెప్పా. ఏమిటంటే—'అతను అంత బాగా ఏడిచాడుఅంటే కారణం, యాక్టింగ్‌కాదు—ఆ డైలాగులు మొయ్యలేక అంచేత, ఏడుపు రావాలంటే ఇకమీదట గ్లిజరిన్‌లు అనవసరం—అటువంటి బరువు డైలాగులే చాలు" అన్నాను. నిజానికి అతనికి నవ్వొచ్చింది. కాని నవ్వితేఎట్లా? నాజోకుకు నవ్వితే నామోషి అందుకని నవ్వకుండా 'ఏడిశావులే' అని గావును ఏదో ఏడిశాడు ఎట్లాఉందంటారు మన విట్టు?... నవ్వరేం...... సరే—మీకు జోకు అర్థం కాలేదు. లేకపోతే బాగు లేదంటారా? ఐతే కామెడీదెబ్బ తిన్నదన్నమాటే.... సరే, అసలు స్టోరీకివద్దాం. ఏం చెబుతున్నానూ— నా శాడ్‌సాంగ్ సిట్యుయేషన్సుకదూ! ఇహ అక్కడినుంచి పాండీబజారు ఎట్లానులెండి. పాండీబజారంటే మీకు తెలీదు గావును—కూరలమ్మేది కూరల బజారు, చేపలమ్మేది చేపలబజారులాగా పాండీలమ్మేది పాండీబజారుకాదు—అది దానిపేరు. అసలు సినిమాల్లోకి జేరాలని మద్రాసు వచ్చినవాళ్ళంతా ముందుగా ఈ బజార్లోని చెట్లక్రింద జేరతారు. నాకు చాలామంది చెప్పారు—అట్లా చేరకుండా ఎవరూ పెద్ద నటులు కాలేరుట! అటువంటి మహత్తరమైన సెంటిమెంటుగల బజారు! ఈ బజారెప్పుడూ కలకల్లాడుతూఉంటుందని, ఇక్కడ వర్తకం బాగా సాగుతోందని చాలామందికి నమ్మకం. అక్కడికొచ్చే జనంలోని చాలామంది, సినిమాల బాపతే—అయిందా, ఈ బజారులో చేరినవాళ్ళల్లో ఎవరైనా నటులైపోతే ఇహ బజారురాదు. ఎంచేతంటే, వాళ్ళకు టైముఉండదు. పైగా—అక్కడి కొచ్చేవాళ్ళను 'వీళ్ళకేంపనీ—పాండీబజార్లో దేకడమే' అని కూడా అంటారుట! పన్లకోసం వచ్చినవాళ్ళూ, పన్లులేనివాళ్ళూ, అసలు కొందరు పన్లుండీ—అంటే ఎవరైనా కలుసుకోవాలంటే, సాధారణంగా ఇక్కడే దొరకవచ్చును అనే నమ్మకంతో—మరికొందరు పన్లు పోయినవాళ్ళూ—ఇట్లా వస్తూవుంటారు. సరి—నేనూ అక్కడ జేరేవాడిని. జేరిన దగ్గర్నుంచి 'వాడిలా, వీడిలా' అని బాతాఖానీ. 'వాడండీ డైరక్టరూ' అని ఒకడంటే, 'వాడి మొహం' అని రెండోవాడు అనేవాడు. ఎవరిష్టం వాళ్ళదనుకోండి. అంతకు పూర్వం వేషాలకోసం నా చుట్టూ తిరిగినవాళ్ళంతా నేను కనిపిస్తే 'బుక్‌షాట్' తీసుకోమంటారు? కనీసం నాకో నమస్కారం పారేసినవాడు ఒక్కడు కనిపించలేదు. ఓసారి, ఒకడు గుడ్‌మార్నింగ్ కొట్టాడు. నేను గంపెడంత మొహం చేసుకుని తిరిగి సాల్యూట్‌చేసి, వాడికేసి చూశాను - చూస్తే, అది కాదు నాకు సాల్యూట్ చెయ్యటంకాదు— నుదురు గోక్కుంటున్నారు!......డబ్బులుంటే ఏ హోటల్లోనో తినేవాడిని. లేకపోతే ఎవరింటికో పోయేవాడిని. ఏదీ లేకపోతే ప్రశస్తమైన కార్పొరేషన్ వాటర్ పుచ్చుకొనేవాడిని. సాధారణంగా

55—వ పేజీ చూడండి



హరివంశము

సాందీపని పర్వం-65

"ఓరి! మాతలి! పూషుడు సూర్యుని కుమార్తెయైన సూర్యాదేవికోసము పోయినాడురా! మరి నీ యీ దారుకస్వామి ఎవరిని కామించి పోయినాడు? వినుడురా? వినుడు! మాతలికి పిచ్చి ఎత్తినది. వీడు నా పంపిన కార్యమును పాడుచేసుకొని వచ్చినాడు. ఇప్పుడు ఇట్టి ఉన్మాదముతో గూడిన మాటలు మాటలాడుచున్నాడు" అని ఇంద్రుడు అచ్చటి యందరిదిక్కు యనినాడు. నిజమునకు మాతలి యా మాటలు వినగా ఆయనకు నవ్వు వచ్చినది. ఎక్కడి పూషుడు! ఎక్కడి దారుకుడు. ఆయన వేదములలో దేవత. వీడో క్షత్రబంధువైన శ్రీకృష్ణునికి సారథి. సూతుడు. అవహేళనముతోడి వికటహాసములతో విఘ్నముకైన వాక్కులతో ఇంద్రుడు ఇన్నియు నన్నాడు. అని మాతలి నిట్లు మందలించినాడు: "నీవు ఏమి చెప్పుచుంటివి? నా చెప్పిన కార్యమేల సాధించుకొని రాలేకపోయితివిరా యని యడుగగా, నేమో కాకమ్మ కథలు చెప్పుచున్నావు. మరియు నా చెప్పుటలో నెవరిఎదుట ఎట్లు చెప్పుచున్నావోగూడ గమనించుటలేదు. నీ స్వామిభక్తి ఇట్టులున్నది........"

"మహారాజా! ఏమియన్నారు! ఎంతమాట యున్నారు. నేను చెప్పుచున్నవి కాకమ్మకథలా! వీరుగో, ఈ సారథులుగూడ లేనిచో నిజమునకు ఈ వృత్తాంతమట్లులే అనిపించెడిది. నా కన్నులను నేనే నమ్మలేనివాడ నయ్యెడివాడను. స్వామి! తమరు దారుకస్వామి నవహేళనము చేయుచున్నారు. పూషుడు సూర్యసుతకొరకు ఘనకార్యమును చేయగా, దారుకస్వామి, తనస్వామి యందలి మిక్కుటమైన ప్రేమచేత, గౌరవముచేత ఈ ఘనకార్యమును చేసినాడు. మరియు నిక్కడ నింకొకవిషయముగూడ నున్నది. పూషుడు సూర్యసుతను కోరినట్లు, దారుకస్వామి కీర్తిని కోరినాడు. అది ఎట్టి కీర్తి! విరోధివర్గముకందలి సారథులకు తనయందలి విద్యతో చమత్కారములను, ఒడుపులను చూపుట వలన కల్గు కీర్తి! స్వామి! లోకమున ఇట్టి శక్తియే యుండదు. ఉన్నను దానిని విరోధి జనముల కెవ్వరు ప్రదర్శింతురు? మరియు ప్రేమమూని ఎవ్వరు ప్రదర్శింతురు? ఒక్క దారుకస్వామియే అవని చేయగలడు. చేసినాడు."

అంతలో ఇంద్రుడు మరల కల్పించుకొని నాడు. "ఆ! చేసినాడు. మనము చేతకానివారమైనచో, ఎవరైనను ఎన్నియైనను చేయవచ్చును. ఒక్క దారుకుడే చేయవలయునేమి? మాతలి! నిన్ను నమ్మి నేను మోసపోయినానురా?......"

"అట్లయిన స్వామీ! నన్ను కొలువులోనుండి తొలగించవచ్చును. అదియు మీ చేతిలోని పని. సేవకులము నేను. యజమానులేమి మాటయన్నను పడవలయును!"

ఇంద్రుడును మాతలిదిక్కు విచిత్రముగా గాంచినాడు. విచిత్రముగా నవ్వినాడు.

"అంతయును కల్పితమన్నమాట! ఈ అంట నంతయు అట్లులే యున్నది. కానిమ్ము. కథను మధ్యలో ఆపితివి."

మాతలి నవ్వినాడు. "స్వామి! తమకును ఏమి జరిగినదో వినవలయునని యున్నది. మరియు నా సారథి యేల తగ్గిపోవలయు నన్న అభిమానమును ఉన్నది. మహారాజ! అభిమానములు కొన్నియెడలనే పనిచేయును. అన్నియెడలను కాదు. మరియు నిట్టి అద్భుతావహమగు విద్యాప్రదర్శన సందర్భమున నట్టివేమియు పనిచేయవు. మహారాజా ఇక్కడ ఒక్కవిషయమును గుర్తించవలయును. దారుకస్వామి ఈ విద్యాప్రదర్శనమువలన తమ సారథులము మేమును విద్యావంతులమైనాము......"

'కథయేమో చెప్పుమురా! యన్న నేమేమో చెప్పెదవు. దారుకుడి వాచాలత్వమునుగూడనేర్చినా!"

మాతలి నవ్వెను. అందరును నవ్విరి. మాతలి ఇట్లు చెప్పెను." మహారాజా! కన్నుమూసి తెరచు లోపల నంతయు జరిగిపోయినట్లైనది. అన్ని రథములు దారుకస్వామి రథమును చుట్టుముట్టినవిగదా! ఆయన వాని నెల్లదలించెను! ఎట్లు వానిని కికురించి పోగల్గెను.అదియే విచిత్రము. ఆయన మాతో మాటలాడుచునే విచిత్రమైన ధ్వనులు చేసెను. పది గుర్రములు ఒక్కపెట్టున హేషలతో నాట్యములు పోయినట్టులున్నవా ధ్వనులు. ఆయన రథమునకు పూన్చిన గుర్రముల కాళ్ళకు గజ్జెలున్నవో! రథమునకు చిరుగంటలున్నవో! ఆ గుర్రములు పరవశ్లపోయినవి. విచిత్ర నాట్యములు చేసినవి. కదను త్రొక్కినవి. రథమునకు కుదుపులేదు. వామాక్షీదేవి చప్పటులు చరచినది. "ఓరి! దారుక! అన్నతో చెప్పెదను. నన్ను అన్నిసారులు రథముపై త్రిప్పితివిగాని, ఇట్టి విద్యను ఎప్పుడును చూపలేదురా!" అన్నది. సుదాములవారు ఆమెవంక విచిత్రముగ చూచినారు. మహారాజ! విద్య యనగా అది. దానిని ప్రదర్శించుచో ఎవరికి వారు తమ్ము మరిచిపోవలెను. వామాక్షీదేవి అప్పుడు సుదాములవారుండినందున కల్గిన సిగ్గును మరిచిపోయినారు. మరి సుదాములవారు! ఆయనకు ఇవి పట్టినవా! విచిత్ర మేమనగా ఆమె ఆ మాటయనగా, ఆయనకును అది పట్టినట్లయినది. ఆయన ఆమెవంక చూడగా, ఆమె సిగ్గరియయిపోయినది. దారుకస్వామి గల్లున నవ్వినాడు. "తల్లీ! ఇప్పుడు ఒక విచిత్రము చేయుచున్నాను. స్వామితో నామీద కొండెములు చెప్పకుడీ!" అనినాడు. అన్నంతలో గుర్రములు కదిలినవి. రథము కదిలినది. ఎట్లు కదిలినది. వలయములుగా కదిలినది. ఒక వలయముకన్న నొక వలయము పెద్దది. ఒక వలయమునందలి వేగమునకన్న మరియొక వలయమునందలి వేగము ఎక్కువది. తక్కిన మన రథములు వెనుకకు, వెనుకకుగా కదలుటతప్ప, చేయునది యేమున్నది? అన్ని రథములును వలయమువెంట, వలయము వెనుకకు కదిలిపోయినవి. సారథు లేమి చేసినారందురు? వారినే అడుగవచ్చును. అచ్చట చేయుట కేమియును లేదు. దారుకుని ఆ రథము కదలికకు తూగుచు యున్న [illegible] [illegible] నీవేమి చేయుచున్నావని యందురా? నేను ఏమియు చేయులేదు. నేను నాలో లేను, ఎవ్వని గుర్రములును వాని యదుపులోలేవు. అన్ని జంతువులను ఆకర్షించు విద్య యది. మరియు దారుకస్వామికి గుర్రములను వాని మనస్సులను వశీకరించుకొను శక్తి అద్భుతముగ నున్నది. ఆయనకు మన యన్ని గుర్రముల పేరులును తెలియును. ఆయన వానిని పేరు పేరున పిలుచుచు కదలెను. వానితో విచిత్ర సంభాషణములు చేయుచు, తన రథమును కదిలించెను. ఆయన రథము కదిలినంతమేర యవి వెనుకకు కదులుటతప్ప మరి యేమియు చేయలేదు. అంతలో దారుకస్వామి నన్ను సంబోధించెను. నేను ఎచ్చటనుంటిని. స్వామి? ఆ వలయమునడుమ కేంద్రమువలె నా రథము నిల్చియున్నది. అప్పటిదనుక నన్ను నేను చూచుకొనలేదు. నా రథము ఏమైనదని అనుకొనలేదు. చుట్టునువున్న రథముల మధ్యదూరము విరళముకాగా, ఆయన రథమెటు పోదలచిన యటు పోవుటకు మార్గము ఏర్పడియున్నవి. ఆయన అన్నాడు: "ఓరి! మాతలి! నీవు రమ్మురా! మరియు నొక విచిత్రము చూపెదను" అని ఆయన తన రథమును మరల కదిలించినాడు. స్వామి అది ఏమి కదిలించుట! చేతిలోని పగ్గములను పక్షుల రెక్కలకువలె కదిలించినాడు. రథమునకు పూన్చినగుర్రములు పక్షులకువలె పైకి లేచినవా అనిపించినది. కనుమూసి తెరచులోపల ఆయన రథము అల్లంతదూరమేగినట్లయినది. అప్పుడే ఆ అద్భుతమును చూచినాము. స్వామి రథచక్రములు భూమిని అనుటలేదు. దేవతలపాదములకువలె భూమి కంతఎత్తున గాలిలో తేలుచున్నట్లులున్నవి. ఎవరో దేవతలు కన్నులకు కన్పించక ఆ రథమును తమ చేతులతో ఎత్తిపట్టి నడిపించుచున్నట్లులున్నది. అద్భుతమును నేను చూచితిని. ఈ అందమును చూచిరి. దారుకస్వామి మరల మాటాడలేదు. పగ్గములను విచిత్రహేలలుగా కదుపుచు రథమునకు సారధ్యము నెరపుచుండెను. గాలిలో ఆ రథము కదులుచుండగా కల్గు సంగీతములు వేదముయొక్క ఘోషవలె నుండెను. అది రథముకాదు. వేదము. అవి గుర్రములుకాదు. వేదమునందలి ఛందస్సులు. వానియొక్క సౌందర్యముతో నా రథము పూషుని నావవలెనై అంతరిక్ష గమనము చేయుచున్నటులున్నది. సూర్యసుతను పూషునితోగూడ తమ రథముపై కూర్చుండబెట్టుకొని అశ్వినులు సారథ్యము చేసినారట. మహారాజా! ఆ అశ్వినుల సారథ్యము విన్నదిగాని, కన్నదికాదు. ఇప్పుడీ సారథ్యము మేము కనినట్టిది. సముద్రములో నావలు నడచుట యున్నది. అంతరిక్షములో రథములు, నావలై నడుచుటను చూచినామా! స్వామి! దారుకస్వామి తన రథము నట్లు నడిపించినాడు. నేత్రముల యందు చూపు ఉన్నందులకు చూడవలసినది చూచినాను. ముఖమునందు వాక్కు ఉన్నందులకు మహారాజ! తమ కా అద్భుతమును విన్పించగల్గినాను."

ఇంద్రుడు 'అద్దా' అనినాడు.

"మాతలి! నీవేమైతివిరా? అని ప్రశ్నించినాడు.

"మహారాజా! అదియు విన్నవించెదను. ఇప్పుడు నేను నేర్చిన రెండవ పాఠమును విన్పించినాను. మరి మూడవ పాఠము గూడా ఒకటున్నది. ★

—హారీత శివశర్మ

సెట్టుమీద:

మహామంత్రి తిమ్మరుసు

కొండపల్లి శివార్లలోని రాళ్లప్రదేశం. అంతటా రాళ్లూ, గుట్టలూ, చెట్లూ ఉన్నాయి. గజపతి పుత్రుడు వీరభద్రగజపతి, సేనాని జయ వీరుడూ, సైనికులూ వచ్చారు. "మీరంతా గుట్టల చుట్టూ పొంచివుండండి. మా బూరా వినగానే వచ్చి పట్టెయ్యాలి. జాగ్రత్త—మన భటులంటే పులులనిపించాలి — వెళ్లండి!" అన్నాడు వీరభద్రగజపతి. భటులంతా వెళ్లి, రాళ్ల వెనకాల దాక్కున్నారు. వీరభద్రగజపతి, కృష్ణదేవరాయలవారు ఆ ప్రాంతానికి వస్తున్నారని విని బంధించాలని వచ్చాడు. రాయలు తన చేతిలో చిక్కిపోతున్నాడని, వీరభద్రగజపతి సంతోషం పట్టలేక పోతున్నాడు. "ఆ రాయలు వంటింట్లోకి కుందేలు వచ్చినట్లు వస్తున్నాడు, రానీ — ఈ దెబ్బతో హతం! రా, జయవీరా" అన్నా డతను సంతోషంగా; ఇద్దరూ ధీరులల్లే బయల్దేరబోతూ ఉండగా, అన్నపూర్ణ ప్రవేశించింది. అన్నపూర్ణ గజపతి కుమార్తె—వీరభద్రుడి చెల్లెలు. కృష్ణదేవరాయలంటే అన్నపూర్ణకు మహా మక్కువ. ఐతే రాయలవారిని ఆమె ఇంతవరకూ చూడనే లేదు — ఆయన పరాక్రమం వినటమే తప్ప! మగ వేషం వేసుకున్న అన్నపూర్ణ "ఆగండి" అని, వాళ్లిద్దర్నీ ఆపింది. "మీరు చెయ్యబోయే పని మన వంశానికే కాదు, మన దేశానికే తీరని కళంకం" అన్నదామె పౌరుషంగా. వీరభద్రుడు చెల్లెలును గుర్తుపట్టి—"ఓ—నువ్వా" అన్నాడు. అంతలోనే అతనికి కోపమూ వచ్చింది—

"నీ వెర్రి వాగుడు మాని అడ్డు తొ" అని గద్దించాడు.

"ఒంటరిగా వస్తున్న ఒక వీరుని ఇంతమంది కలసి పట్టచూడడం పౌరుషం కాదు. పిరికితనం, నీచం! అధర్మం!" అన్నది అన్నపూర్ణ ఉక్రోషంగా.

"నీ ధర్మబోధలు చాలించి, ముందు ఇక్కడి నుంచి నడు—" అన్నాడు వీరభద్రగజపతి. ఐతే అన్నపూర్ణ అంత సులభంగా పోయే మనిషికాదు— తలాయించింది — "వీల్లేదు — ఇంత దారుణం నేను సహించలేను" అన్నది.

"సహించలేకపోతే ఈడ్చి పారేస్తాను" అని మండిపడ్డాడు—వీరభద్రుడు చెల్లెలిమీద. వెధకబోయే తీగ కాలికితగిలినట్టు రాయలవారే అక్కడకు వచ్చాడు—విదూషకుడు పిన్నవతో సహా. వస్తూనే ఆయన—"ఆగు, పసివారిమీదనా పరాక్రమం" అని వారించాడు. రాయలవా రెట్లు ఉంటాడో వీరభద్ర గజపతికూడా ఎరగడు. "మధ్య నీ వెవ్వరు?" అని అడిగాడు—ఆయన్నే. వెంటనే పిన్నన కల్పించుకున్నాడు—"ఆఁ ఆఁ .... నేను చెప్తాను. వీరిది విజయనగరం. పెనుగొండ, ఉదయగిరి, కొండవీడు చూసుకుంటూ ఇలా వచ్చారు. వీరినంతా రాయలవా రంటార్లెండి" అని నెమ్మదిగా తేల్చాడు. ఈమాట వినగానే అన్నపూర్ణ అమితాశ్చర్యపోయింది. ఆ ముగ్ధలావణ్యమూర్తిని చూచి ఆనందంతో ఉక్కిరిబిక్కిరై పోయింది. జయవీరుడికి ముచ్చెమటలూ పోశాయి. వీరభద్రుడికి కంపర మెత్తింది—

"జయవీరా చూస్తావేం—బూరా ఊదు" అని హుంకరించాడు అతను. జయవీరుడు బూరా ఊదబోయాడు. ఊదబోతూవుంటే పిన్నన ఆ బూరాను లాక్కున్నాడు. "బూరా లాక్కున్నానని గాభరా పడకండి" అన్నాడు పైగా! అతనికి అంతలోనే మరో ఆలోచన పోయింది. "ఐనా వయస్యా—



గౌతమీ ప్రొడక్షన్స్‌వారి "మహామంత్రి తిమ్మరుసు"లో లింగమూర్తి

ఎంతమంది ఉన్నారో తెలుస్తుంది—బూరా ఊదవా" అని తాను ఊదబోయాడు. ఇంతలో అన్నపూర్ణ వారించింది—

"అయ్యయ్యో—ఇది వేళాకోళం కాదు. బూరా ఊదితే మీకే అపాయం" అన్నదామె.

"భయంలేదులే అబ్బాయ్—మా వయస్యుడు ఏకవీరుడు! ఏకవీరుడు!" అని చెప్పాడు పిన్నన ఆ జగదేకవీరునిగురించి. వీరభద్రగజపతికి నవ్వొచ్చింది. వికటాట్టహాసం చేస్తూ—"ఊదు! మా ప్రతాపం ఇప్పుడు తెలుస్తుంది. మేము లేనప్పుడు రహస్యంగా మా కోటలు పట్టటం కాదు" అన్నాడు ఉక్రోషంగా. కానీ చూదామని పిన్నన బూరా ఊదాడు — ఐతే గజపతి సైనికులు ముందుకు రాలేకపోయారు; అప్పటికప్పుడే వారి వెనకనుంచి పొంచివుండి రాయలవారి సైన్యం వారిని బంధించింది. వాళ్లను బంధించి, ముందుకొచ్చి వీరభద్ర గజపతిని కూడా బంధించింది రాయలవారి సైన్యం.

భారీఎత్తున, సర్వకళాసమన్వితంగా గౌతమీ వారు నిర్మిస్తున్న 'మహామంత్రి తిమ్మరుసు' చిత్రంలోని పై ఘట్టంలో రాయలవారిగా ఎన్. టి రామారావు, పిన్ననగా రేలంగి, అన్నపూర్ణగా దేవిక, వీరభద్రగజపతిగా ప్రభాకరరెడ్డి నటించారు.

— ప్రక్క పేజీ చూడండి



"సింహాచల క్షేత్రమాహాత్మ్యం" సెట్టుమీద రేలంగి, గిరిజ, కెమెరామన్ మధు, రచయిత రాజశ్రీ, దర్శకుడు బి. వి. ప్రసాద్. ఫొటో: రూప.

తెలుగు పత్రికలన్నింటిలోనూ ఆంధ్రసచిత్ర వారపత్రిక సర్క్యులేషన్ అత్యధికమైనది.



సరిపోల్చండి!

కొథారి మల్లు

శ్రేష్టమని మీకే తెలుస్తుంది

నేతలో, పనితనంలో, మన్నికలో…శ్రేష్టమైనది. ఔను. విశిష్టమైన కొథారి నూలుతో వాటికవే తిరిగే యాములమీద ఈ మల్లు నేయబడుతూంది కాబట్టి. లాల్చీలకు, లంగాలకు, జాకెట్లకు, దిండు గలేబులకు, అండర్‌వేరులకు, రోవతులకు ఇంకా ఇట్టి అనేక ఉపయోగాలకు చాలా ఆదర్శమైనది.

మీకు లాంగ్ క్లాత్ లు కావాలంటే, మంచిరకపు కొథారి నూలుతో నేయబడ్డ కొథారి లాంగ్ క్లాత్ లు మీకు నచ్చుతాయి. చాలాకాలం మన్నుతుంది.


అడగండి **కొథారి మల్లు M-7** మరియు లాంగ్‌క్లాత్ కూడా!

తయారీ, కొథారి టెక్స్‌టైల్స్ లిమిటెడ్

రిజిష్టర్డు ఆఫీసు, ఓరియంటల్ బిల్డింగ్స్, అర్మీనియన్ స్ట్రీటు, మద్రాసు-1.

మ్యానేజింగ్ ఏజెంట్సు, కొథారి & సన్స్

RVT/KT/1779


గుడ్డలిచ్చి ఇరవై రోజులాయి— ఇంకా అసలు కత్తిరించనే లేదన్నావ్— ఇలా చూస్తే—
SUNDAR
పండుగ రోజురోజుకీ దగ్గర పడ్తున్నదాయె—
SUNDA
మరి మీరేం, కంగారు పడకండి సార్..! పండక్కి గుడ్డలిస్తాను—
ఇహ తెల్లార్తే పండుగ— ఇంతకీ మా గుడ్డలకి మోక్షం కనుపించేటట్టే లేదు—
SUNDA
మరేం భయపడకండి సార్— మీరూ మీ పిల్లలూ ఏకంగా తలంట్లు కానిచ్చే సరికి వచ్చేయండి— అప్పటికి మీగుడ్డలు రెడీగా వుంటాయి— చకచకా తొడుక్కొని వెళ్లొచ్చు—
!?
SUNDAR

సుందర్


గృహిణులు
ఝలక్ ను మెచ్చుకుంటున్నారు
ఓహో, బట్టలు ఎంత మెరిసే తెలుపో ! నిజంగా, నీవు శ్రమపడుతున్నావు.
అహా, శ్రమకాదు నా అదృష్టం అనాలి, ప్రత్యేక విధానమున తయారైన
ఒక కొత్త సబ్బును వాడుచున్నాను
అంటే ఏమిటి ?
ఏమిటంటే, ఈ సబ్బు త్వరలో, సమృద్ధిగా నురుగునిస్తుంది.
అది చాలా బట్టలను ... ఎంతో మెరిసే తెల్లగా...
ఎంతో సులభంగా వుతుకుతుంది.
నిజం, ఈ కొత్త సబ్బు చాల బాగుగా శుభ్రపరుస్తుంది,
అలాగా నేను కనిపెట్టేను.
అది సరిగా సామాన్య బారు సబ్బులకంటె ఎక్కువగా
చాలా కాలము నిలవుంటుంది, అంతకంటె
ఇంకేమి కావాలి ?
నేనేను ఈ సబ్బును కొనాలి, దాని పేరు ఏమిటి ?
జ్ఞాపకముంచుకో అది ఝలక్, నీకుమరీ ఎక్కువ హామీ
ఏమిటంటే, దానిని బజార్లలో అమ్మకము చేయు
చున్నవారు: మార్గదర్శక సంస్థ, గోద్రెజ్
సబ్బులలో ఉత్తమ నామము.
ZALAK
Godrej
MADE IN INDIA
ఝలక్
Godrej
గోద్రెజ్
ఉత్పత్తి
ఝలక్ బట్టలను మెరిసే తెల్లగా అధిక కాంతిగా వుతుకుతుంది

సరాగమాల

వి ఎ కె రంగారావు

గుండమ్మకథ జి. ఇ. 35291

ఈ చిత్రంలోని అన్ని పాటలలో అన్నివిధాల ఎన్నికైనది, మన్నికయ్యేది "అలిగినవేళ చూడాలి గోకులకృష్ణుని అందాలు" అన్న పాట. దీనికి స్వరకల్పన ఘంటసాల దేశిరాగంలో చేశారు. ఏ పాటకైనా ప్రత్యేకతనూ, విశిష్టమైన ప్రభనూ ఇచ్చేవి మూడు. రచన, వరుస, పాడుట. ఈ మూడిటిలోనూ అత్యంత మనోహరంగా, మధురంగా, మృదులంగా వున్న దీపాట. "రుసరుసలాడే చూపులలోనే, ముసిముసి నవ్వుల చందాలు" అని హెచ్చరించే పింగళి రచన రాధామాధవ మధురబాంధవ్యాన్ని అర్థంచేసుకున్న వారికి అరచేతి స్వర్గం. అర్థంకాక చేసుకో ప్రయత్నిస్తున్నవారికి అనిర్వచనీయమైన ఆనందాన్వేషణ ఫలం. అర్థంకానివారికీ కూడా ఆ ఆనందానికి అవధులు లేవని తెలియజెప్పే అమరగీతం. సుశీల పాడటంలో వేడిమీగడ కమ్మదనం, ఘంటసాల వాద్యగోష్ఠిలో పాలవెన్నెల చల్లదనం. మధ్యన, చివరన వినిపించే నాదస్వర సంగతులు బహుకాల విరహానంతర ప్రియసందర్శనానందజనిత సంభ్రమాశ్చర్య వలయాలు. మోహాద్రిక్త ఆలోచనా తుష్ట స్పష్ట సంతోష నిలయాలు.

రెండవప్రక్కనున్నపాట మూడు హారన్ల మోతతో మొదలవుతుంది. హిందీ చిత్రాలలో మెరీన్‌డ్రైవ్‌లో హీరోయినువెంట హీరో పడుతుండగా ప్రక్కనే అతని స్నేహితులజంట ఆడుతూ వెనువెంట పాడుతూ వెంటాడుతున్న దృశ్యాలలో మనకు వినిపించే ట్యూన్‌ని తలపింపజేస్తుంది పై పాట వరస. అనుకరణ ఏమాత్రంలేదు. ఆఛాయల పోలిక అలాగ ఉన్నది. అంతే. మానవనైజంగురించి ప్రస్తావిస్తూ, కవి "పిడికిలిమించని హృదయములో కడలినిమించిన ఆశలు దాచెను" అన్నారు. ఆమాటలూ, ఎత్తుగడనే వున్న "మనిషి మారలేదు, అతని మమత తీరలేదు" అన్నవీ బాగున్నవి. పాట సాహిత్యం చక్కగావున్న సినిమాలో రాణింపుకు రాకపోవటానికి కారణం ఆ పాటకు సరైనస్థానం లేకపోవటమే.

*   *   *

కొన్ని వారాలక్రిందట పాఠకులను "రాధ నిటు దయమాలి విడిచి" పాటను గురించి ప్రశ్నించాము. వచ్చిన జవాబులబట్టి చాలమంది ఆ పాటను మరచిపోయారనే తెలుస్తున్నది. ఆపాట పాడినది ఆనాటి మేటి గాయిక కుమారి. వాహినీవారి "సుమంగళి"లో సముద్రాల రచన, నాగయ్యగారి సంగీతం. అందులో మూడు రాగాలు. మాండ్, బిహాగ్, పట్‌దీప్. ఇంత చక్కటిపాటను పాఠకులు, ప్రేక్షకులు, శ్రోతలు ఎంత త్వరగా మరచిపోయారో!

మాండ్‌రాగం చాల కర్ణపేయమైన రాగం. విచిత్రమైన సంగతులప్రయోగం లేకుండానే శ్రోతలను ఇట్టే ఆకర్షిస్తుంది. ఇప్పట్లో సినిమా సంగీతంలో ఈరాగం అంత తరచుగా వినిపించడం లేదుకాని, "సుమంగళి" కాలంలో చాల విరివిగా ఉపయుక్తమైన రాగాలలో ఇది ఒకటి. "దేవత"లో సూర్యకుమారి పాడిన "వెండికంబాలలో వేడి బువ్వుందోయి, పసిడి కంబాలలో పాలబువ్వుందోయి, తిందాము రావోయి జాబిల్లి" గుర్తున్నదా! అదీ ఈ మాండ్ రాగంలో చేయబడినపాటే. ఇంకా అంతకుముందు వచ్చిన తెలుగు "మీరా" చిత్రంలో నాయిక వేషధారిణి మిస్ చలం పాడిన "ఆలమందలలోన ఆడేటి కృష్ణమ్మ" అన్న పాటా ఈ రాగమే. కృష్ణుని రాకకోసం మీరా తపన, ఆతని సందర్శనభాగ్యంకోసం ఆమెపడే ఆవేదన మాండ్‌రాగంలో చక్కగ ప్రతిబింబించేటట్లు ఆ పాటలో ఇమిడ్చారు, సంగీతదర్శకులు బి. నరసింహారావు. ఆరోజుల్లో మాండ్ రాగానికి బహుళప్రచారం ఉండటానికి ఇంకొక కారణం బాల గంధర్వ తరుచు పాడుతుండే "మాలా గోపాలా ఆహి" అనే అదే రాగాన్నున్న అభంగ్ కావచ్చు. ఈపాట ఆనాటి ప్రేక్షకులకు ఎంతో నచ్చినది. లేకపోతే ఎందుకు బాల గంధర్వ ఏ స్త్రీ వేషం వేసుకుని రంగస్థలంపైకి వచ్చినా, ఈపాట పాడమని బలవంతం చేసి పాడించుకు మరీ వదలిపెట్టేవారు?

ఈ రాగం నృత్యగీతాలకుకూడా చాలా అనువుగా ఉంటుంది. నాలుగేళ్లక్రితం విజయనగర నాసిరీ నృత్యకళాశాలలో ఎవరో పాడగా సూర్యనారాయణమూర్తి భావ, తాళయుక్తంగా నాట్యమాడగా "నాహృదయపీఠాన నాట్యమాడే దేవ" అనే మాండ్ రాగ గీతం విన్నాను. నిజంగా హృదయమర్మరంపై ఆదిజంగం అడుగులువేస్తూ, ఆనందతాండవం చేస్తున్నట్లే అనిపించింది. ఈపాట వ్రాసినది ఎవరోకాని నాట్యశాస్త్రపారంగతులు కావ్యాలంకార గుణకోవిదులు అయివుంటారు. ఈ పాటను మళ్లీ బొబ్బిలిలో రెండునెలలక్రిందట "వినవాడె వేణువు వీనుల విందుగా" అనే పాటకు వరస కడుతూ సాలూరు కబీర్‌షాగారు వాయించి చూచాయగా వినిపించగా విన్నాను. మొదట విన్నప్పుడు కలిగిన దివ్యానుభూతి మరల మదిలో మసలింది. కారణం దీనికి ఆపాట సాహిత్యం కొంత, ఆ రాగమహిమ మిగిలినంత.

కర్ణాటరాగాలలో మాండుకి కాస్త దగ్గరగా వున్నట్లనిపించేది బిలహరి. కాని ఇందులో మాండ్‌లో వున్న విశిష్టత, ఆకర్షణాశక్తి నాకు కనిపించదు.

*   *   *

కొన్ని చిత్రాలలో పాటలన్నీ ఎంతో బాగుంటాయి. దురదృష్టవశాత్తు నిరాదరణకారణంతో చిత్రం దెబ్బతింటుంది. మరి ఆ చిత్రంలోని పాటలు ఎంత ప్రజారంజకంగా ఉన్నా సరే, రికార్డులుగా విడుదల కావు. ఉదాహరణకు ఇటీవలి చిత్రాలలో "రేణుకా దేవి మహాత్మ్యం", "ధర్మమేజయం" చెప్పుకోవచ్చు. మొదట పేర్కొన్న చిత్రానికి సంగీతదర్శకులు మల్లీశ్వరరావు ఎంత చక్కని సంగీతం కూర్చారని! చిత్రానికి ఆదినే ఉంది, శ్రీనివాస్‌పాడిన అపూర్వమైన తత్త్వం, "దేవుని మాయ తెలియగలేరు, తెలుసుకొనినా దాటగలేరు" అన్నది. దీనికి సంగీతరచన మరాఠీ అభంగ్ పద్ధతిలో జరిగింది. చిత్రంలో రెండవపాట శాస్త్రీయ జావళిపద్ధతిన్నున్న "నిను విధి నెలవంక ప్రభవించెరా, మన పురమేలు యువరాణి జనియించెరా" ఒకటేమిటి, శ్రీనివాస్ సుశీల పాడిన యుగళ భజన "ఓం నమఃశివాయ" సుశీల పాడిన "ఆనందాలు," రాజా జిక్కి పాడిన "అందాల లోనే ఆనందముంది" మొదలగు పాటలు వెలలేని మణిపూసలు.

ఇక "ధర్మమే జయం"లో అశ్వత్థామ, సాలూరు హనుమంతరావు హాయిగొలిపే వరసలను వినిపించారు. అశ్వత్థామ పియానోపాట "ఆనందమేలేదా" అన్నది హనుమంతరావు చేసిన సైకిలుపాట రసాత్మకమైన సంగీతసృష్టి విశేషాలు. ఇటువంటి చక్కని పాటలు రికార్డులుగా రాలేదేమని అడిగితే రికార్డింగ్ కంపెనీ అధిపతులు ఒక్కటే మాటంటారు. చిత్రాలు నడవలేదు, కాబట్టి రికార్డులు రాలేదు అని. దీనితో కొంతవరకు, ఒకవిధంగా ఆలోచించి చూస్తే అంతవరకూ లోపం నిర్మాతలదే అని చెప్పాలి. చిత్రం విడుదలకు నాలుగు వారాలముందే అన్ని "ట్రాక్స్" రికార్డింగ్ కంపెనీకి యిచ్చివేస్తే చిత్రం వెళ్ళలేదు కాబట్టి రికార్డులు రావనే అవకాశం ఆ అధినేతలకు ఉండదుగా!

సరే. పై చిత్రాల పాటలు రాకపోవడానికి కొంత కారణం కుంటిదో, గుడ్డిదో ఉంది. విజయవంతంగా నడిచిన చిత్రాలలో అన్ని పాటలు రికార్డులుగా తీసి చక్కని పాటలను ఒకటో రెండో వదిలివేస్తే దానిని ఏమని అనాలి! ఇటువంటి విచిత్ర ప్రవర్తనకు ఉదాహరణలు కొల్లలు.

"తెనాలి రామకృష్ణ"లో అన్నీ మంచి పాటలే. అన్నీ రికార్డులుగా వచ్చినవి ఒక్కటి తప్ప. అది. భానుమతిపాడిన శ్రీక్షేత్రపదం "నీవేగా రారాజువేగా" అన్నది. కారణం? చిత్రం విజయవంతమైనదే. గాయకి, ప్రసిద్ధ నటీమణి భానుమతి. మరింకేమి వంక చూపగలరు? దీనిగురించే రేడియోలో కన్నా

(62-వ పేజీ చూడండి)



ప్రపంచ ప్రముఖులు-6

రెండవ ప్రపంచయుద్ధానికి ముందు ఫ్రాంక్లిన్ డెలానో రూస్‌వెల్ట్ విధానాలు అమెరికా ఆర్థిక పరిస్థితి పూర్తిగా మారే అవకాశాలు కలుగజేశాయి. యుద్ధం ముగిసినతర్వాత ప్రపంచంలోకెల్లా సంపన్నవంతం అయిన దేశం అమెరికాయేనని తేలిపోయింది. ఆర్థికంగాగాని, మరేవిధంగాగాని అమెరికా సహాయం పొందని దేశాలు చాలా తక్కువ. ప్రచ్ఛన్నయుద్ధం తీవ్రమయిన తర్వాత పశ్చిమరాజ్యాల నాయకత్వం సహజంగా, అమెరికా వహించవలసి వచ్చింది. కాని విదేశవ్యవహారాలలో ఉదాసీనంగా ఉండటం అమెరికా చరిత్రలోనే ఒక ముఖ్య సంప్రదాయం కావటం, రూస్‌వెలెట్ 'న్యూ డీల్' విధానాలవల్ల సంఘంలో ఇంచుమించు అందరికీ న్యాయం జరిగే అవకాశాలు ఏర్పడినప్పటికీ 'సోషలిజం' తమ సమాజానికి అపాయకరమనే భయం చాలామందికి ఉండటం, కొన్ని వింతపరిణామాలకు దారితీసింది. **కమ్యూనిస్టులను 'అరికట్టేందుకు' ఏమిచేసినా ఫరవాలేదనే వైఖరి బలపడింది. (ఈ వైఖరిపట్ల తటస్థంగా ఉండటంకూడా ఒకవిధంగా 'పాపం' అనే వాదం** డల్లెస్ ప్రతిపాదించారు.) సాధారణంగా అయితే, అమలులోకివచ్చే అవకాశంఉన్న సంస్కరణలు ఈ విపరీతమయిన పరిస్థితులమూలంగా ఆగిపోతున్నాయేమో ననిపిస్తుంది.

రూస్‌వెల్ట్‌ని ఆదర్శప్రాయుడుగా ఎన్నుకున్న జాన్ ఫిట్జ్ జెరాల్డ్ కెన్నెడీ వ్యక్తిగా ఎంత ప్రజాభిమానం చూరగొనగలిగినా, ఆయన ప్రభుత్వం ప్రతిపాదించిన 'బిల్లు'లు చాలామట్టుకు ఓడిపోతున్నాయి. కెన్నెడీ డెమోక్రెటిక్‌పార్టీవారు సైతం ప్రతిపక్షంతో కలిసి ఓట్లు వేస్తున్నారు. పరిపాలనలో ప్రతి విషయంలోనూ కల్పించుకునే అధికారంగల అమెరికా శాసనసభలు ఆదేశ విదేశాంగవిధానాన్ని కూడా తమ అదుపులో ఉంచగలవు. అంటే, ప్రజాభిప్రాయంలో—లేక కనీసం వారి ప్రతినిధుల అభిప్రాయాలలో—పెద్ద మార్పు వచ్చినప్పుడే విధానాలు బాగా మారే అవకాశం కలుగుతుం దనవచ్చు. కెన్నెడీ ప్రజాభిప్రాయం ఎంతవరకూ మార్చగలడనేది ముఖ్యప్రశ్న. ఈయన వయస్సులో చిన్నవాడు కనుక అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పవచ్చు. (ఇటీవల అమెరికన్ స్టాక్ ఎక్స్ఛేంజిలో ఏర్పడిన కల్లోలానికి దేశం అధ్యక్షుడే కారణమని ఎందరో అంటున్నప్పటికీ, ప్రజలలో కెన్నెడీమీద మంచి అభిప్రాయం అంతగా తగ్గలేదని తెలుస్తోంది.)

దక్షిణ అమెరికా దేశాలపట్ల అమెరికా విధానం; నీగ్రోలకు సమానమైన హక్కులు, ఈలోపుగా ప్రపంచమంతా వాటివల్ల నశించకపోయినట్లయితే అణ్వస్త్రాల నిషేధంకోసం కృషి—ఇవి కెన్నెడీ ఎదుర్కొంటున్న పెద్ద సమస్యలు. ఇంతవరకూ జరిగిన [illegible]బట్టి ఆయన పట్టుదలకుమాత్రం లోపం [illegible]ని ఊహించవచ్చు. ★



జరిగిన కథ

ఐదు వాటాల లోగిలియిల్లుగలావిడ వరసమ్మగారు మనుమడు సూర్యానికి తల్లీ తండ్రీ తానే అయి పెంచింది. ఆ ఐదు వాటాల లోగిలిలో రకరకాల కుటుంబాలున్నాయి. రాజ్యలక్ష్మికి వరసమ్మగారంటే చనువూ, భక్తీ సూర్యమంటే పిచ్చీ, నిర్మలంటే స్నేహం. శాంబశివంగారికి గతం గాయం. సూర్యం నిర్మలకి పాఠాలు చెబుతూంటాడు. మేనమామ కూతురు మీనాక్షితో సూర్యానికి చనువు ఏర్పడుతుంది. సూర్యం, నిర్మలలనుగూర్చి లోగిలో గుసగుసలు బయలుదేరుతాయి. నూతిగట్టున కాలు జారిపడిన వరసమ్మగారికి నిర్మల ఉపచారం చేసి, ఆమె మెప్పుపొందుతుంది. వరసమ్మగారి ఇంట్లో మీనాక్షిని విడిచిరావటంలో తన అంతర్యం ఏమిటో జయరావు భార్యకు చెబుతాడు. లలితాంబ రాజ్యలక్ష్మి పీడ విరగడ చేసుకునేందుకు సావిత్రమ్మ, కృష్ణవేణమ్మలతో కలిసి ప్రయత్నం చేస్తుంది.

36

చీకట్లు తరుముకొస్తున్నట్లు పక్షులు గూళ్లకు చేరుకుంటున్నాయి. సంధ్యాకాంతులు పల్చని చీకట్లకు కరిగిపోతున్నాయి.

మీనాక్షి యిచ్చిన కాఫీ చప్పరిస్తూ సూర్యం రెండుక్షణాలామెను తదేకంగా చూసి, దూరాన కొండ అంచుకేసి దృష్టి మరల్చుకున్నాడు.

“ఈ రెండు రోజుల్లోనూ నువ్వెంత చిక్కిపోయావూ ?” అన్నాడు అప్రయత్నంగా మీనాక్షి లజ్జను దాచుకోలేకపోయింది.

“థాంక్స్” అన్నది. గోడకి హొయ్యారంగా ఆనుకుంటూ.

ఆమె బుగ్గలు కొంత పీక్కుపోయేయి. తల నిండా కుంపటి విసరగా బూడిద రేగి రాలిందేమో, కావి రంగులో ఉన్నవి. చింకిరిగా ముంగురులామె నుదుట చెమట కతుక్కొని సాయంకాలపు చిరుగాలికి రేగిపోవాలని ప్రయత్నిస్తున్నాయి. బడలిక ఆమె కళ్లలో లోతుగా కూచుంది.

సూర్యానికి రాజ్యలక్ష్మి వీపున ఎవరో చరిచినట్లు జ్ఞాపకం వచ్చింది.


“మీనాక్షీ !” అన్నాడు.

మీనాక్షి పరధ్యానంగా గోడ నానుకొని ఉన్నది. ఆకాశంలోని తొలి నక్షత్రాలను లెక్కిస్తున్నట్లు.

“ఊఁ” అన్నది గోముగా.

“రాజ ఇవాళంతా వచ్చినట్టు లేదే.”

—43 వ పేజీ చూడండి



స్నేహం

బాంధవ్యంకంటె స్నేహమే గొప్పదని చెప్పటం సత్యదూరంకాదు. ఈ వ్యాసం అనుభవమున్నవారికి చాలా నచ్చుతుంది. ఎస్. రంగారాణిగారి అభిప్రాయం ఏమాత్రం పొరబాటుకాదని చెబుతూ, నేనూ వారి అభిప్రాయంతో ఏకీభవిస్తున్నాను.

ఆర్. భాగ్యలక్ష్మి (మంచిర్యాల)

*　　*　　*

"బాంధవ్యంకంటే స్నేహానికే ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తాను" అన్న రచయిత్రి మాటతో పూర్తిగా ఏకీభవిస్తున్నాను.

భాగవతుల రాజ్యలక్ష్మి (నండూరు)

*　　*　　*

స్నేహంపట్ల నాకున్న మనోభావములతో నిండి ఉండుటవల్ల ఆ వ్యాసం నేనే వ్రాశాను అని అనుకునేలా ఉంది. నేనుకూడా బాంధవ్యంకంటే స్నేహానికే ఎక్కువ ప్రాముఖ్యం నిస్తాను. అందువల్లే మొన్న మా బంధువుల ఇంట్లో పెళ్ళిఉన్నా కూడా నా స్నేహితురాలి పెళ్ళికి వెళ్ళాను. అలాగ ఎందుకు వెళ్ళావని అడిగినవా ళ్ళందరికీ ఇదే సమాధానమిచ్చాను. ఎప్పుడూ నేను స్నేహితుల ఇళ్ళకు వెళుతుంటాను. వాళ్ళు వస్తుంటారు. అందుకని మా బంధువులకు నా పై చాలావరకు కోపం ఉందనే చెప్పవచ్చు. అయినా నేను నా స్నేహితులను వదలలేకుండా ఉన్నాను. వదులుకోలేను కూడా. కారణం స్నేహం అంటే ఎంతో విలువకలదని, కావాలనగానే అంగట్లో దొరికే వస్తువుకాదని, పూర్తిగా కాకపోయినా కొంతవరకైనా తెలిసికొన్నాను.

కుమారి రుక్మిణి (నల్లగొండ)

*　　*　　*

రంగారాణిగారు చెప్పినట్లు అందరు స్నేహితులూ ఒకే విధముగా ఉండరు. కేవలం అవసరాలు తీర్చుకునేందుకు, కపటస్నేహం చేసేవాళ్ళుకూడ ఉంటారు. "బాంధవ్యంకన్న స్నేహమే గొప్పదని చెప్పే రచయిత్రి అభిప్రాయంతో నే నేకీభవించగలను.

సూతక్కి విజయకుమారి (విజయవాడ)

*　　*　　*

నేను, ఒకమ్మాయి మూడు నెలలలో ఫ్రెండ్స్ అయినాము. ఒకరిభావాలు ఒకరు అర్థం చేసుకుని సన్నిహితంగా మెలిగాము. తరువాత కొంతకాలానికి ఇంకో అమ్మాయి చెప్పింది— నా ఫ్రెండ్‌ది వేరే కులమట. ఎవరితోనూ చెప్పవద్దన్నది అని. అంటే ఆ అమ్మాయి ఉద్దేశ్యం ఏమిటి? మే మిద్దరం ఫ్రెండ్స్ అని తెలిసి కూడా తాను (నా ఫ్రెండ్) చెప్పవద్దన్నా కూడా చెప్పిందన్నమాట. ఇది విని చాలా బాధపడ్డాను. నా ఫ్రెండ్ కులం వేరైనంతమాత్రాన ఇతరులతో కలసి మెలసి తిరగటానికి కూడా ఈ కులం అడ్డొస్తుందా అని.

కె. ఆర్. దేవి (కూచిపూడి)

*　　*　　*

ఈర్ష్యలు, ద్వేషాలు, స్నేహితుల్లోకంటే బంధువుల్లోనే ఎక్కువగా ఉంటాయనే అభిప్రాయముతో నే నేకీభవించుచున్నాను. బంధుత్వంకంటే స్నేహమే చిరకాలం నిలుస్తుంది.

బి. విమలా జనార్దన్ (వరంగల్)

*　　*　　*

ఎస్. రంగారాణిగారు రాసిన 'స్నేహం' వ్యాసం బావుంది. స్నేహంలో నాకు ఉన్న భావాలే రాణిగారికి ఉన్నాయి. నేను చుట్టరికానికన్నా స్నేహానికే ఎక్కువ విలువ ఇస్తాను.

ఎందుకంటే స్నేహంలో ఉన్న ఆత్మీయత చుట్టరికంలో ఉండదు. ఎంత అభిమానం చూపించినా చుట్టాలు మనని చూసి ఈర్ష్యపడుతూనే ఉంటారు. చుట్టాలకి ఒకళ్ళనిచూస్తే ఇంకోళ్ళకి పడదు. ఎప్పుడూ ఒకరిని ఒకరు ద్వేషించుకుంటూనే ఉంటారు.

కానీ స్నేహబంధం విడదీయరాని గొప్పబంధం. నేను స్నేహానికి ప్రాణాన్నయినా ఇస్తాను. కానీ చుట్టాలనిచూస్తే నాకు ఛీ చిరాకు. కాని వాళ్ళతో తప్పదు కనుక మాట్లాడుతూ ఉంటాం.

అలా అని స్నేహితుల్లో చెడ్డవాళ్ళు లేరనికాదు సుమండీ. అంత ఆత్మీయస్నేహితు లెవరో, చెడ్డ స్నేహితు లెవరో తెలిసికోగలం. అటువంటి స్నేహానికే ఈ వ్యాసం. రచయిత్రికి పత్రికద్వారా అభివందనములు పంపుతున్నాను.

స్నేహం చాలా గొప్పది.

శ్రీమతి లక్ష్మి రామకృష్ణ (కాకినాడ)

*　　*　　*

ఎస్. రంగారాణి ఎక్కువగా పెద్దవారిగురించే వ్రాసినారుకాని, పసివాళ్ల స్నేహం గురించి వ్రాయుటం మరచినారు.

చెడి కావలసినవారిదగ్గరకు వెళ్ళేదానికంటె స్నేహితుని ఇంటికి వెళ్ళితే ఆప్యాయత, ఆదరణ లభిస్తాయి.

ఎం. సుభద్రా బలరామదుర్గరాజు (చెరుకుమిల్లి)

*　　*　　*

రచయిత్రి బాంధవ్యముకన్న స్నేహానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చినందుకు ఆమెతో నేను ఏకీభవిస్తున్నాను. కొంతమంది అవసరార్థమై స్నేహితు లంటారు. అటువంటివారికి ఈ వ్యాసం బాగుగా ఉపయోగిస్తుంది.

ప్రసాదుల జయ (చంద్రావతిపురం)

వంటలు

మాలతి

కావలసిన వస్తువులు

గోధుమపిండి	-	1 ఆళాకు
నీరు		-పిండి కలపడానికి
పచ్చిమిరపకాయలు-		2-3
ఇంగువ	-	చిటికెడు
పప్పు	-	½ చెంచా
ఉప్పు	-	1 చెంచా
పసుపు	-	చిటికెడు
నూనె		- వేయించడానికితగినంత

పచ్చిమిరపకాయలు నూరుకుని, గోధుమపిండిలో నీరు ఈ కారం, మిగతావస్తువులు వేసి ముద్దగా కలుపుకోవాలి. ముద్ద సుమారు రెండుగంటలసేపు నానిన తరువాత బాగాపిసికి, పూరీలుగా వత్తుకోవాలి. వాటిని 'డైమండ్' ఆకారంలో కోసుకుని నూనెలో వేపుకుంటే ఈ పిండివంట తయారవుతుంది. ★

మనమూ - మనదేహస్థితీ

డా॥ గాలి బాలసుందరరావు

జఠరాశయము: దాని చలనము

ఒక అంగములో వ్యాధి యేర్పడడమంటే, దాని ధర్మములను అది నిర్వహించలేని పరిస్థితులు ఏర్పడడమన్నమాట. జఠరాశయములో ప్రధాన భాగములు (1) కండరములు, (2) గ్రంథులు. గ్రంథులు చిలికిన రసములు ఆహారంతో బాగా కలిసినప్పుడే అది రసాయనికవిక్రుతులవల్ల మారి డువోడినంలో జరగవలసిన జీర్ణక్రమమునకు తగినట్లుగా తయారవుతుంది. గ్రంథుల స్యందనమును గురించి గత వ్యాసంలో క్లుప్తంగా తెలుసుకున్నాము. ఇప్పుడు ఆస్యందనములు (Secretions) ఆహారంతో మిళితం కావడానికి కారణమైన జఠరాశయ చలనమును గురించి తెలుసుకుందాము.

జఠరాశయంలోవున్న కండరములు అనిచ్ఛాధీన కండరములు. అంటే వాటి సంకోచ వ్యాకోచములను, మనఇచ్ఛానుసారంగా నడిపించలేము.

జఠరాశయంయొక్క చలనము తరంగచలనము. ఒకచోట ఒక కండరభాగము సంకోచించడము, దానిక్రింద కండరము వ్యాకోచించడము, మళ్ళీ ఆ వ్యాకోచించిన కండరము సంకోచించడము, మళ్ళీ దానిక్రింది కండరము వ్యాకోచించడము, ఈవిధంగా జీర్ణకోశ నాళభాగములన్నింటిలోనూ తరంగచలనము జరుగుతూనే ఉంటుంది.

జఠరాశయంలో రెండువిధములయిన చలనములు ఉన్నవి. (1) బలవత్తరమైన తరంగచలనము. ఇది సుమారు అర నిముషమువేపు ఉంటుంది. ఆహారం జీర్ణమౌతున్నప్పుడు ఈ మాదిరిచలనము ఉంటుంది. జఠరాశయము ఖాళీగా ఉన్నప్పుడు నిముషానికి ఒకమారో రెండుమార్లో అది కదులుతూ ఉంటుంది. మొదటి చలనములలో జఠరాశయంలో ఉత్పత్తిఅయిన రసములూ, ఆహారమూ బాగా కలిసి, పైలోరస్‌వద్దవున్న స్పింక్టరుద్వారా కొద్దికొద్దిగా డువోడినంలోకి పోతూ ఉంటవి. ఉద్రేక సమయములలో ఈ చలనం కాస్త అధికమౌతుంది. భీతి ఏర్పడినప్పుడు జఠరాశయచలనము దుర్బలమూ, స్వల్పమూ అవుతుంది. దీని స్యందనములూ అదేవిధంగా ఉంటవి. మరీ చల్లని నీరు త్రాగినప్పుడు ఈ స్యందనములు తగ్గిపోతవి. కొవ్వుపదార్థములు తిన్నా, తరంగచలనమూ స్యందనమూ తగ్గుతవి. ప్రోటీనులు, వాటితో చేసిన 'చారు' కొన్ని రసాయనికములయిన 'ఇరిటెంటులు' (Irritants) ఈ చలన స్యందనములను అధికం చేస్తవి. (స్థానికంగా రక్తసంచారమును అధికం చేసే వస్తువులను ఇరిటెంటులు అంటారు) పాశ్చాత్యులు భోజనంలో ముందుగా మాంసమునుంచి తీసిన 'సూప్' తీసుకుంటారు. ఇందువల్ల జఠరరసోత్పత్తి అధికమై ఆకలి కలుగుతుంది. ముందుగానే గ్రుడ్లు తినడం, వెన్న తినడం మంచిదికాదు. కడుపు నిండిపోంగానే జఠరరసోత్పత్తి తగ్గిపోతుంది. మరీ పిక్కటిల్లిపోయేటట్లుగా తింటే జఠరాశయంలో తీవ్రమయిన తరంగచలనము ప్రారంభంకావడానికే కొంత సేపు పడుతుంది.

పైన వివరించిన పరిస్థితులమీద జఠరాశయ జీర్ణకాలము ఆధారపడుతుంది "ఎంతసేపు ఆహారం జఠరాశయంలో ఉంటుంది" అన్నది. అనేకులలో అనేక రకములుగా ఉంటుంది. కాని ఒకే వ్యక్తిలో ఆరోగ్యస్థితిలో ఒక నిర్దిష్టమైనకాలంలో జఠరాశయ జీర్ణకార్యము జరిగిపోతూ ఉంటుంది. ఒకటిన్నర గంటలనుంచి నాలుగున్నర గంటలవరకూ ఈకాలము భేదిస్తూ ఉండవచ్చును. కొవ్వులు పుష్కలంగాఉన్న, గట్టిపదార్థములు తిన్నప్పుడు జఠరాశయం ఖాళీ కావడానికి కనీసం 3 గంటలయినా పడుతుంది. కొవ్వులు లేకుండా ద్రవరూపంలో వున్న ఆహారము ఒకటిన్నర, లేక రెండు గంటల కాలంలో జఠరాశయంనుండి క్రిందికిపోతోంది. అందువల్ల ఘనపదార్థములతో కూడుకున్న ఆహారం తీసుకున్నప్పుడు భోజనానికీ మరొక భోజనానికీ నాలుగు గంటల వ్యత్యాసం ఉండడం మంచిది. ద్రవాహారంమీద ఆధారపడుతున్నప్పుడు ప్రతి రెండు గంటలకు ఒకమారు ఆహారం తీసుకోవలసి వస్తుంది. 'ఆకలి' అన్న అనుభూతి (Sensation) తీసుకున్న ఆహారం జీర్ణమై, కడుపు ఖాళీ అయినప్పుడు ఏర్పడుతుంది. కడుపులో మంట ఆకలి కాదు. నిజమయిన ఆకలి ఆహారం తీసుకోంగానే తగ్గి, ఒక తృప్తి ఏర్పడుతుంది. ఆ ఆహారం జీర్ణమై శరీరంలో శక్తి కలుగుతుంది. అప్పుడు కడుపు ఉబ్బడం, పుల్లత్రేన్పులు రావడం, వాంతివచ్చినట్లు ఉండడమో, వాంతి రావడమో జరగదు. గడియారాలను చూచి తినడంకంటె, కడుపునడిగి తినడం మంచిది. శిశువులలో ఎంతసేపటిలో కడుపు ఖాళీ అవుతుందో చెప్పలేము. ఆకలికాంగానే బిడ్డ ఏడుస్తుంది. ఆహారం ఇస్తే, తృప్తిగా, ఆప్యాయంగా చాలా సేపు తాగుతుంది. ఆకలి కానప్పుడు రెండు మూడుమార్లు చప్పరించి తోసేస్తుంది. త్రాగింది కక్కేస్తుంది. పరిశీలించగలవారు ఆ సంగతి గమనించి ఆహారం ఇస్తూ ఉండాలి.

పుండువంటి బాధాకరమైన పరిస్థితి ఏర్పడ్డప్పుడు చర్మంలోకలిగే బాధకూ, కడుపులో కలిగే బాధకూ భేదం ఉన్నది. సాగదీయవలసినప్పుడూ, ఒత్తిడి కలిగినప్పుడు కొన్ని రసాయనిక వస్తువులు 'ఇరిటేట్'చేసినప్పుడూ తప్ప, జఠరాశయమును కోసినా, అందులో పుండు ఏర్పడినా బాధ ఉండదు. కాని ఉదరములోపలిపైపున క్రమ్మివుండే "పెరిటోనియం" అనే పొర చాలా సున్నితమైనది. జఠరాశయములో పుండు, అంతకంతకులోతై, చిల్లిపడి పెరిటోనియంమీద పడినప్పుడు విపరీతమైన బాధ కలుగుతుంది. కడుపులో కాన్సరువంటి మాంసవృద్ధి ఏర్పడుతున్నా, రోగికి బాధ తెలియదు. కడుపులో పుండులేచినవారు ఇరిటేట్ చేయనివీ, తేలికగా జీర్ణంఅయ్యేవీ అయిన ఆహారమును తీసుకుంటే చిన్న చిన్న అల్సర్లు మానిపోతవి. ఆ విషయం తరవాత చర్చిస్తాను.

సాగదీయబడినప్పుడు, రసాయనిక ద్రవ్యములు ఇరిటేట్ చేసినప్పుడూ, జఠరాశయం మ్యూకస్ పొరలోవున్న నరాగ్రములు (Nerve-endings) నరానరి ఆ అనుభూతిని మెదడుకు అందజేస్తవి. బాధ కలిగేదాకా కడుపు సాగగానే, దానికి ఫలితంగా బాధాకరమైన దుస్సంకోచము (Spasm) ఏర్పడుతుంది. కడుపులో అల్సరుమీద ఏసిడ్ కూడుకున్న ఆహారం పోయినప్పుడు బాధ తెలుస్తుంది. కడుపు ఉబ్బినప్పుడు కడుపుగోడ సాగినందున బాధ కలుగుతుంది. ఆకలి, వికారం, బాధవంటి అనుభూతులన్నీ మెదడులో ఏర్పడతవి. కాని, ఈ అనుభూతులకు ఫలితంగా జఠరాశయపు చలనంలో రక్తసంచారంలో, స్యందనంలో తగిన మార్పులు వస్తవి. కడుపు ఖాళీ అయినంతమాత్రాన ఆకలి ఏర్పడదు. అందుకు జఠరాశయం ఆరోగ్యస్థితిలో ఉండాలి. మనను ఆహారాసక్తమై ఉండాలి. దుఃఖ సమయంలోనూ, జుగుప్సాకరములయిన పరిస్థితులలోనూ కడుపు ఖాళీగావున్నా ఆకలి తెలియదు. మనస్సుకూ, జఠరాశయానికీ అతి సన్నిహితమైన సంబంధం ఉన్నది. జఠరాశయరోగములు అర్థం చేసుకోవాలంటే ఈ విషయం మనస్సులో నాటించుకోవాలి. ★

వనితాలోకం

పెళ్లిసంబంధాలూ - పెద్దలూ

యల్. కె. రత్నమాల

ఈ వ్యాసాన్ని నేను వ్రాయటానికి కారణం 15—6—62 తేదీ ఆంధ్ర వారపత్రికలో వనితా లోకం శీర్షికక్రింద పద్మగారు వ్రాసిన 'కట్నాల వేలంపాట' అన్న వ్యాసం. అయితే—ఇందులో నేను కట్నాలికి సంబంధించింది రాయటంలేదు. మనుషుల్ని మిగిలిన విషయాల్లో అర్థంచేసుకోవటం గురించి వ్రాస్తాను.

"....చుట్టాలింటికి వెళ్లేం. ఏదో పెద్ద అభిమానం ఉందనుకునేరు—అబ్బే! అదేం లేదు......" అని మొదలెట్టారు వ్యాసం ఆమె. వాళ్ళు ఏవిధంగా ఇష్టంలేని వాళ్ల చుట్టాలింటికి వెళ్లేరు? వెళ్లి ఏదో అప్యాయత వున్నట్టుగా నటించేరు?—కేవలం తమ పనిమీద వెళ్లేరు— వాళ్లచుట్టాల మొగపిల్లవాడి సంబంధంకోసం! చివరికి అది జరగలేదు! అందుకని ఆ కసిఅంతా వెళ్లగ్రక్కేరు. (వారి చుట్టాల పావిడ ప్రవర్తన అలా ఉంచుదాం) ఒకవేళ వాళ్ల సంబంధం స్థిరపడితే ఈ పై వాక్యం మనసులోనే దాచుకొంటారు కాబోలు ఆమె—అంటే సంవత్సరాలతరబడి అభిమానం ఉన్నట్టు ప్రవర్తిస్తారన్నమాట! ఈ విషయంలో పద్మగారు వ్రాసిన వాక్యాన్నే వారి కొకసారి గుర్తు చేస్తాను. 'పూర్వం కన్న మనలో (ఆడవాళ్లలో) చదువు, విజ్ఞానం, సంస్కారం (కొంత) హెచ్చినా, మనం ఇంకా నేర్చుకోవలసినది చాలావున్నది.' నేనీవ్యాసం రాసేటప్పుడు నేనూ స్త్రీనేనన్నమాట మర్చిపోవటంలేదు—ఈ పెళ్లిసంబంధాల విషయంలో మా తమ్ముడికి వచ్చిన కొన్ని సంబంధాల్ని గురించి నేను వ్రాయవలసి ఉన్నది.

మా తమ్ముడు అప్పుడు వంటరిగాఉండి ఒక ఊళ్లో ఉద్యోగం చేసుకుంటున్నాడు. వాడి దగ్గరికి ఒక పెద్దమనిషి వచ్చి, తీసుకెళ్ళి వాళ్ళమ్మాయిని 'చూపించాడు'ట. వీడు తన కళ్లతో చూసి వచ్చేశాడట. ఏమిరా అంటే—'ఈ పత్రికల్లో వ్యాసాలూ, కథలూ వ్రాసే ఆధునికయువతుల అభిప్రాయాలేమిటో నేనింతవరకూ అర్థంచేసుకోలేకపోయాను— నువ్వేంచదువుకున్నావు?—పుస్తకం చదవగలవా? ఏదీ చదువు! రెండడుగులువెయ్యి. నీకు సంగీతం వచ్చా? వంటి ప్రశ్నలు వెయ్యకూడదట. ఆ అమ్మాయిని చూసేక నా కంత ఇంటరెస్ట్ లేకపోయింది. అందుకని ఉదాసీనంగా ఊరుకున్నాను' అంటాడు. పోనీ ఆయనామెచేత ఏమైనా మాట్లాడించనూకూడ లేదట. ఆ పెద్దమనిషి అంతకుముందే తన మిత్రులతో (వారిలో కొందరు మావాడికీ మిత్రులేనట) ఇది చాలా మంచి సమ్మంధమనీ, తప్పకుండా ఇదే స్థిరపరుస్తాననీ చెప్పేట్ట. తరువాత మావాడు ఈ సంబంధం వద్దని మర్యాదపూర్వకమైన పద్ధతిలోనే కబురంపాడు. దాని కాయనవి లక్ష ప్రశ్నలట—'ఏం..... కట్నం ఏమాత్రం కావాలిట?—లేకపోతే అమ్మాయి, బాగాలేదా?.......' వగైరాలు. మావా డంటాడు 'అమ్మాయి బాగాలేదంటే వాళ్లంతా బాధపడతారు. పైగా వాళ్ల ఇంటిల్లిపాదీ నన్ను తిడతారు—ఇది వాళ్ల విషయంలో. ఇక నా ఉద్దేశంలో—అల్లా చెప్పటం పెద్దమనిషితరహాకాదని, కొంతవరకూ మోటుగా, అసభ్యంగా ఉంటుందనీను.' ఇక కట్నం విషయంలో వాళ్లేంతిస్తారని మావాడు అడగనే లేదసలు. అటువంటప్పుడు మరి ఆ ప్రశ్న ఎందుకొచ్చిందో! సరే—ఇద్దైపోయినాక. తన మిత్రులతో ఆయన 'అబ్బే! అదేం మంచి సంబంధంకాదు. అసలు నా కంతగా ఇష్టంలేదు' అనీ, ఇంకా ఏవో కథలూ చెప్పాడట. (దాని కాయన మిత్రుల్లో ఒకాయన సరైన సమాధానమే ఇచ్చాడట లెండి.)

ఒక పెద్దమనిషి వుట్టెడు అబద్ధాలుచెప్పి, మా నాన్నగారిని తీసుకువెళ్ళి అమ్మాయిని చూపించాడట. తీరా చూస్తే ఆయనమాటల్లో పొరబాటునైనా ఒక్క అక్షరం కూడా సత్యం లేదట. ఈయన కొక సిద్ధాంతంవుంది కాబోలు—వెయ్యి అబద్ధాలు చెప్పైనాసరే ఒక పెళ్ళి చెయ్యి—అని.

మా తమ్ముడి దగ్గరికి మరొక పెద్దమనిషి వచ్చాడట. మావాడు ఆ సంబంధంవిషయంలో నాకు ఉత్తరం రాసేడు.

"మా నాన్నగారితో కలిసి వస్తానన్నాను. ఆయన నా దగ్గర కొచ్చిన అతిథి కాబట్టి, నేను ఏ పెద్ద మనిషికైనా చేసే మర్యాద చేశాను. కాని, ఆయన మరోలా భావించినట్టుంది. నే నా సంబంధంఅంటే పడి చస్తున్నాననుకొన్నాడేమో!-ఇక ఊదరకొట్టాడు- మాఅమ్మాయి దుర్గాబాయి దేశ్‌ముఖ్ అంతటి మనిషౌతుందని చెప్పారండీ జ్యోతిష్కులు! (తర్వాత జాతకంలేదు సరిగదా, జననతేదీ కూడా చెప్పలేదు) అసలు మా అమ్మాయి సింహలగ్నంలో పుట్టింది. సాధారణంగా సింహలగ్నంలో చాలా తక్కువమంది పుడతారు. (దేశంలోవున్న ప్రజలంతా ఒకే లగ్నంలో పుడితే, ఇంక మిగిలిన లగ్నాలన్నీ ఎందుకూ? వగైరా వగైరా. ఆయన ఉద్దేశం నన్ను మాటల్లోనే ఆకర్షించెయ్యాలని) తరువాత అనుభవపూర్వకంగా తెలిసింది— "వాళ్లకి మర్యాద సరిగాతెలియదనీ, అందుకే ఆయనలా అర్థం చేసుకున్నాడనీ. డబ్బుందనే గర్వం కూడా వుంది కొంచెం......."

ఒకాయన పెద్దలు మెచ్చనివిధంగా మావాడికి వాళ్ల బంధువు లమ్మాయంటే ఆకర్షణ కలగాలని ప్రయత్నించేడు. మావాడు మంచివాడుగా కనిపించినందుకు చాలా పెద్దసంబంధాలు అంటగట్టటానికి కొందరు ప్రయత్నించారుకూడా. ఈ వ్యక్తులు వాళ్ల ప్రవర్తన మార్చుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఇక పెళ్ళిచూపుల విషయంలో మావాడు చెప్పిన ఉద్దేశాలు నాకూ సమంజసంగానే కనిపించాయి.

"అంగవైకల్యంలేని యువకుడికి అంగవైకల్యంలేని యువతిని కోరుకోగల హక్కుంది. అంతేకాక చాలా అసహ్యంగా నడవకూడదనికూడా ఆమెని గురించి అనుకోవచ్చు. ఇది పెద్దలంతా వప్పుకుంటారు. అందుకని రెండడుగులు నడవమని అడగవచ్చు, కంఠంలో నత్తిగాని, మగగొంతుకగాని ఉందో లేక శ్రావ్యంగా వుందో తెలుసుకునేందుకు పాట పాడమనవచ్చు. అంతమాత్రంచేత లతామంగేష్కర్ లాగా పాడాలని అర్థంకాదు. (ఆఉద్దేశం ఉన్నవాళ్ళూ ఉండవచ్చుకాని, వాళ్ల సంగతివేరు) ఆమె ఏం చదువుకుందో, మాట్లాడే పద్ధతి ఎలావుందో తెలుసుకోగల హక్కు చూడటానికి వచ్చిన ఆ యువకుడికి వుంది. పోతే — చదువు నేటి నాగరకజీవితంలో చాలా అవసరం అని భావించే యువకులున్నారు. వాళ్ళు పుస్తకం చదవమనవచ్చు. ఏమంటే— ఈవిషయంలో ఏమన్నా అనుకుంటారని ఊరుకుని మోసపోయిన వ్యక్తుల్ని చూస్తున్నాం. ఇకపోతే ఆ వచ్చిన యువకుణ్ణి ఆమె ఎదురుగా ఆమె తండ్రిగాని, మరెవరైనా పెద్దలుగాని మామూలుగా సంభాషణలో దింపి అతడ్ని గురించి అంతా పరికించవచ్చు.

"ఈ రోజుల్లో వయస్సుని దాచిపెట్టి ఎవడికో నచ్చినవాడికి అమ్మాయిని కట్టేసి భారం తీర్చుకోవాలని చూసేవాళ్ళు తారసిల్లారు నాకు. అందులో అందరూ పెద్దమనుషుల్లాగే ఉంటారు. వాళ్లని ఒకసారి మాట్లాడగానే పసిగట్టడం అసంభవం. అందుకని పెళ్లిచూపులలో ప్రతి విషయం విపులంగా మాట్లాడుకోవటం (మర్యాద పూర్వకమైన పద్ధతిలోనే) తప్పుకాదు."

★

ఎఫ్. బి. ఐ. కథలు-4

హంతకుని ఆత్మహత్య

నార్మన్ అబట్

యుద్ధం ముగిసి అప్పుడే సంవత్సరంపైగా అయింది. ఆసార్జంట్ (ఫ్రాన్స్, జర్మనీలలో జరిగిన పోరాటంలో పాల్గొని క్షేమంగా తిరిగివచ్చాడు.

తిరిగి వచ్చాక అతడికి రెడ్‌బ్యాంక్ (ఎన్. జె.) దగ్గరలోఉన్న మాన్‌మౌతుఫోర్టులో ఉద్యోగం దొరికింది. అక్కడికి న్యూయార్క్‌నగరం అట్టే దూరం కాకపోవటంచేత వారం వారం సరదాగా వెళ్ళివస్తూ ఉండేవాడు.

ఇలా కొంతకాలం గడిచాక అతడికి ఆ అమ్మాయితో పరిచయం కలిగింది. ఇద్దరూ టెక్సాస్ రాష్ట్రానికి చెందినవారే. త్వరలోనే వాళ్ల పరిచయం ప్రేమగా మారింది. ఆ అమ్మాయి తన గతచరిత్ర అతడికి చెప్పింది.

అయినా అతడు తనకేమీ పట్టించుకోలేదన్నాడు. ఆమాటకొస్తే తనుమాత్రం ఏమంతబుద్ధిమంతుడు కనక?ఆమె తన భయం ఏమిటో బయటపెట్టింది. అతడు ఏదోవిధంగా ఆమెను రక్షించాలనుకున్నాడు. తనని పెళ్ళిచేసుకుంటే నిశ్చింతగా ఉండవచ్చని ఆమెకు ధైర్యం చెప్పాడు.

వాళ్ళు రెడ్‌బ్యాంక్‌లో పెళ్ళి చేసుకున్నారు. ఆ సమీపంలోఉన్న లిటిల్ సిల్వర్‌లో ఒక గది అద్దెకు తీసుకుని కాపురం పెట్టారు.

నెలరోజులు ఏ చీకూ చింతా లేకుండా గడిచి పోయాయి. 1946 సెప్టెంబరు 27 వ తేదీ ఉదయం ఎవరో తలుపు తడితే, ఇంటావిడ వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా కనపడ్డ వ్యక్తినిచూసి ఆవిడ బెదరిపోయింది. అతడు బాగా ఒడ్డూ పొడుగూ ఉన్నాడు. మొదట తాను ఎఫ్. బి. ఐ. అధికారిననీ, ఆ ఇంట్లో కాపురంఉన్న అమ్మాయిని అరెస్టుచేయ డానికి వచ్చాననీ చెప్పాడు. ఆ తరవాత .45 పిస్టల్‌తో ఆమెను బెదరించి, సరాసరి అద్దెకున్నవారి గది లోకి వెళ్ళాడు.

సార్జంటు, అతని భార్య ఇంకా నిద్రలేవలేదు. అతడు వాళ్ళనులేపి పిస్టల్ ఝళిపించాడు. ఆ అమ్మాయిని పిలిచి త్వరగా దుస్తులు వేసుకుని తనవెంట రమ్మన్నాడు. సార్జంటుకి ఇంకా నిద్రమత్తు వదలక మునుపే జరగవలసింది అంతా జరిగిపోయింది. ఆ వచ్చినవ్యక్తి ఆమెను తీసుకుని వెళ్ళిపోయాడు.

కాని సార్జంటు భార్యకుమాత్రం చామర్స్ లాంబాగ్ అపరిచితుడేమీ కాదు. ఆమె కిక్కురుమనకుండా అతడి వెంట వెళ్ళింది. అసలు వాళ్ళిద్దరూ ఒకరికోసం ఒకరు నిరీక్షిస్తున్నారా అనిపించింది. నిజానికి అతడి కోసం ఆమె నిరీక్షించింది కూడాను!





ఆమె చరిత్ర

ఆమె పేరు మేరీ. ఆపేరు ఎప్పుడు పెట్టుకున్నదో మన కవసరంలేదు; అసలు సంగతేమిటంటే ఆమెకు బోలెడు పేర్లు ఉండేవి. అయితే వాటితో ఇప్పుడు మనకు పనిలేదు.

1930 ప్రాంతాల మేరీ టెక్సాస్‌నుంచి

—42వ పేజీ చూడండి


క్లాస్ లో—
సత్యమూర్తి
సోదరప్రేమ
అనుకుంటున్నాసార్



వెండిమబ్బు

కన్నడ మాతృక—త్రివేణి
అనువాదం—శర్వాణి

జరిగిన కథ

'వెండిమబ్బు' యజమాని సదాశివరావు గారికి ఇందిర ఒక్కగానొక్క కూతురు. పై చదువుకు అమెరికా వెళ్లేందుకు రావు గారి సహాయం కోసం వచ్చిన మోహనుడికి, ఇందిరనిచ్చి పెళ్లి చేసి సొంత ఖర్చుమీద అక్కడికి పంపవచ్చునని రావు గారి భార్య లలితమ్మగారి అభిప్రాయం. రావు గారు సరేనంటారు. మోహనుడు అమెరికా వెళ్లివచ్చాక వివాహం జరగాలని నిశ్చయమవుతుంది. లలితమ్మగారు మనోవ్యాధితో మంచం ఎక్కుతారు. ఆమె గర్భవతి అని డాక్టరు చెబుతుంది. ఈ వార్త రావు గారికీ, ఇందిరకూ సంతోషం కలిగించినా, లలితమ్మగారు సిగ్గుతో కుంచించుకుపోతారు. లలితమ్మగారి ఆరోగ్యం కాపాడవలసిన బాధ్యత రావు గారు కూతురికి అప్పగిస్తారు.

(గత సంచిక తరువాయి)

ప్రేమప్రవాహమైన ఆ ఉత్తరాన్ని నాలుగైదుసార్లు చదివింది ఇందిర.

ఒక మధురమైన తరంగం ఆమె శరీరాన్ని తాకుతున్నట్లనిపించింది.

తానెంత అదృష్టవంతురాలు! మోహనుడి ప్రేమ, ఐశ్వర్యం, తల్లిదండ్రుల వాత్సల్యం, త్వరలో రాబోయే చెల్లి, లేక తమ్ముడు.

తనకన్నా అదృష్టవంతులు ఈ ప్రపంచంలో ఉంటారా?

ఇందిర ఉత్తరాన్ని బల్లమీద ఉంచి స్వప్నజగత్తులో విహరిస్తుండగా లలితమ్మగారు వచ్చి,

"ఏం రాశారు?" అన్నారు.

"కులాసాగా ఉన్నారట."

"అంతేనా?"

"ఊఁ........"

లలితమ్మగారు కూతురివైపు చూసి నవ్వుతూ వెళ్ళిపోయారు.

ఇందిర మళ్ళీ ఉత్తరాన్ని చదవసాగింది. అదో సుందరకావ్యంలా ఉంది ఇందిరకు.

ప్రేమికులకు ప్రపంచమంతా అందంగానే అగుపిస్తుందేమో?

ఉత్తరం చదువుతూంటె మధురభావాంతో నిండిపోయింది ఇందిర మనస్సు.

ఓహ్, అమ్మ ఎందుకింత కఠినంగా ప్రవర్తిస్తూంది? తనకు అంతులేని ఆనందాన్ని కలిగించే సంగతి మోహనుడికి తెలిపి, ఆ సంతోషంలో పాలు పంచుకుందామంటే ఒప్పుకోదేం? ఎప్పటికైనా తెలిసేదేగా, ఇప్పుడు తను రాస్తే ఏంపోయిందో?

అమ్మకు తెలియకుండా రాస్తే?

"ఉహూఁ, ఒద్దు బాబూ. అకస్మాత్తుగా అమ్మకు తెలిస్తే అనవసరంగా బాధపడుతుంది.

ఈ పరిస్థితులో అమ్మనెంతో జాగ్రత్తగా చూసుకోవాలని డాక్టరుగారు చెప్పేవెళ్ళారు.

ఇందిర ఆ ఆలోచన వదలుకుంది.

39-వ పేజీ చూడండి



హాస్యం తమాషా




మరొక చిటకా!
కాబోయే
కథకా!–
ఇదిగో–
మరొక చిటకా:
నేనూ ఒక
కథకుడినే !–
నేనూ ఒక
రచయితనే !–
కలమెత్తక
తలదించుక
కాగితాల
కరువెరుగక
ఏదో రచన
సాగిస్తా
ఏదో కథను
కల్పిస్తా–

నేనూ ఒక
రచయితనే !–
అధునాతన
రచయితను !–
చిన్న చిన్న
రచనలతో
అలా అలా
పైకొచ్చా–
పెద్ద రచన
కడకొచ్చా–
నే నవలలు,
నాటకాలు,
సీరియల్సు,
డిటెక్టివ్సు
తెగరాశా
తెగరాశా
వర్షంలా
కురిపించా!–
పాఠకు లవి
చదవలేక
చదివి హరా
యించుకోక
నన్ను భరా
యించలేక
వద్దు వద్దు
వద్దు బాబో !–
రాయవద్దు
మొర్రోమని
కుయ్యోమని
గోలపెట్టి
పోరారు !–
నా శక్తి
సామర్థ్యం
టెంపో–గి
ప్పా–భ పా
అర్థం కా
న సమర్థులు
పత్రిక సం
పాదకులు
నా రచనల
నాకే నే
తిప్పి తిప్పి
కొట్టారు !–
పోస్టేజీ
లేకున్నా
సెల్ఫ్ డస్
ఈకున్నా
నా రచనల
తిప్పారు !–
తిప్పి తిప్పి
పంపారు !–

ఎం. చిట్టిబాబు (మద్రాసు)




ప్రేమ కానుక
బొమ్మలకథ 5
సత్యమూర్తి
ఒరేయ్ ఆ అమ్మి చూడు ఎలా డేన్సు చేస్తోందో
దానికేంగానీ గురూ మా షామిలీతో కలిసి చూడొద్దూ తిరునాళ్ళంతా?
మళ్ళీ షామిలీ అంటా వేమిట్రా?
అదేరా ఆ అమ్మాయి తో కలిసి అని.
ఏడిసినట్లుందిగానీ... అరెరె ఆ అమ్మాయి హడావిడిగా ఎటో వెళ్తోంది చూడు
అరెరె ప్రక్కన మా బ్రదరిలా లేడే !!!
తప్పిపోయాడు లాగుందిరా అందుకనే వాడి కోసం అలా హడావిడిగా వెతుకుతూంది లాగుంది
ఒరేయ్ మనం ఆ కుర్రాణ్ణి వెతికి ఆ అమ్మాయికి అప్పచెబుదాం, చాలా సంతోషిస్తుంది
తరువాత మెల్లిగా పరిచయం చేసుకోవచ్చును



ఆంధ్రసచిత్ర వారపత్రిక

వారఫలాలు

దైవజ్ఞపాతూరి శ్రీరామమూర్తి

13-7-1962 శుక్రవారము మొదలు
19-7-1962 గురువారము వరకు

మేషం :

(అశ్వని, భరణి, కృత్తిక 1 పా.)

విగ్రహంతో వ్యవహారాలను చక్కపెట్టుకొనగల్గుతారు. అంచనావేసినప్పుడు ఫలితం గొప్పగా తోస్తుంది. అనేక సందర్భాలలో ముందుగా పెట్టుబడి పెట్టవలసి వస్తుంది. మీకు సహాయం చేయవలసినవారిలో మిమ్ములను గురించి తేలికగా మాట్లాడే వారు ఉంటారు. కోర్టుకచేరీలలో పనులు సక్రమంగా జరిగి మనస్సు తేలికపడుతుంది. వృత్తిలో విశ్రాంతి తక్కువ. బంధుమిత్రులు కొందరు తమ పనులనిమిత్తం మీమీద ఆధారపడతారు. వారాంతంలో కలహప్రసంగాలు, నిరుపయోగమైన ఖర్చులు తప్పవు. ఇతరులకు వ్రాసే ఉత్తరప్రత్యుత్తరాలలో మాట మీమీదకు రాకుండా చూచుకొనండి. 15, 16 తేదులలో శుభవార్తలు, కార్యసిద్ధి, స్వల్ప ఆదాయం.

* * *

వృషభం :

(కృత్తిక 2, 3, 4 పా., రోహిణి, మృగశిర 1, 2 పా.)

వినయంతో మాట్లాడుతూ మీమాటను చులకనచేసే మనుష్యులు తటస్థపడుతారు. ధన సంబంధమైన లావాదేవీలలో ఆందోళన, శ్రమ కనుపిస్తవి. కుటుంబంలో చిన్నచిన్న పనులు కూడ

> **గ్రహస్థితి**
>
> వృషభంలో అంగారకుడు, మిథునంలో బుధుడు, మిథున, కటకాలలో సూర్యుడు, కర్కాటకంలోరాహువు, సింహంలో శుక్రుడు, మకరంలో శని, కేతువులు, కుంభంలో గురువు, వృశ్చిక ధనుర్మకరకుంభాలలో చంద్రుడు.

మురుకుగా నెరవేరవు. ఆదాయం బాగానే ఉంటుంది అయితే మనస్సులో విపరీతమైన భయసందేహాలు కలుగుతూ ఉంటవి. పిల్లలవలన సంతోషము లభిస్తుంది. క్రొత్తవారితో కలసి వ్యాపారంవంటి పనులు ఆరంభించతగిన సమయంకాదు. సాధ్యమైనంతవరకు ధనము, వృత్తికి సంబంధించిన బాధ్యతలు ఇతరులమీద విడువతగిన సమయంకాదు. వారం రెండవభాగంలో శుభకార్యాలు నెరవేరుతవి. రావలసిన ధనం చేతికి వస్తుంది. 17, 18 తేదులలో ప్రయాణము, నీచులతో కలహాలు

* * *

మిథునం :

(మృగశిర 3, 4 పా., ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పా.)

వృత్తిలో మీ హోదా పెరుగుతుంది. ఎప్పటి పనులు అప్పుడు నెరవేర్చలేక చికాకుపడతారు. కొన్ని సమయాలలో తోటివారి మాటలవల్ల కోపోద్రేకాలు కలిగే అవకాశాలున్నవి. రాజకీయాలలో జయప్రదమైన కాలం. ధనవిషయంలో స్నేహితులను నమ్ముకుని ఆరంభించిన పనులకు మధ్యలో ఆటంకాలు వస్తవి. అయితే మొత్తంమీద ఏదోవిధంగా మాట దక్కించుకోగలుగుతారు. గత వారంకన్నా మీ ఆరోగ్యస్థితి బాగుంటుంది. వారం రెండవ భాగంలో క్రొత్తవారితో పరిచయం లభిస్తుంది. లోగడ జరిగిన పొరపాట్లను ప్రశాంతంగా సర్దుబాటు చేసుకోగలుగుతారు. సుఖ సంతోషాల నిమిత్తం ఖర్చులు పెరుగుతవి. 18, 19 తేదులలో వస్తునష్టం, మిత్రులవద్దనుంచి కష్టవార్తలు.

* * *

కర్కాటకం :

(పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్లేష)

బాహ్య విషయాలలో సుఖంగా కాలం జరుగుతుంది. వ్యాపార వ్యవహారాలలో మీ ఆలోచనలు ఒక క్రమంలో ఆచరణలోకి వస్తవి. ప్రయాణాలు చేస్తారు. అనుకోకుండా నౌకరులు మొదలయిన వారితో కలహాలు వస్తవి. వినోదకార్యక్రమాల క్రింద ధనవ్యయం అవుతుంది. మీ రహస్య కార్యక్రమాలను జాగ్రత్తగా నడుపుకొనగలుగుతారు. విలువగల వస్తువులు కొంటారు. ఆహార విహారాలలో జాగ్రత్తగా ఉండటం అవసరం. కష్టవార్తలు తెలియగల సమయం. వారం చివరలో జ్ఞాపకశక్తి లోపించటంవల్ల కార్యభారం పెరిగే అవకాశాలున్నవి. అధికారులవల్ల మాట రావచ్చు. 13, 14 తేదులలో సంఘంలో గౌరవం, ప్రిప్పట.

* * *

సింహం :

(మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)

మీ అధికారాన్ని సక్రమంగా వినియోగించుకోగలుగుతారు. మంచివారితో స్నేహ సంబంధాలు ఏర్పడుతవి. ఇతరులవద్దనుంచి రావలసిన ధనం సక్రమంగా అందుతుంది. మీ బుద్ధిబలంవల్ల తోటివారికి అసాధ్యంగా తోచిన వ్యవహారాలను జాగ్రత్తగా సాగించగలుగుతారు. వృత్తిలో చల్లని మాటలతో మోసం చేయటానికి ప్రయత్నించేవారుంటారు. అయితే ముందుగా తప్పుకోగలుగుతారు. వారంచివరలో దొంగతనంగా వస్తువులుపోయే అవకాశాలున్నవి. స్వతంత్రంగా మాట్లాడుకొనే సందర్భాలలో మాట

పట్టింపులు రాకుండా చూచుకొనండి. ప్రత్యేకంగా అనారోగ్యం చేయదు. కాని, దేహశ్రమ అధికంగా కనుపిస్తుంది. 15, 16 తేదులలో గౌరవ ప్రాప్తి, శుభ వ్యయం.

* * *

కన్య :

(ఉత్తర 2,3,4 పా, హస్త, చిత్త 1, 2 పా.)

రకరకాలవారితోను జాగ్రత్తగా నెగ్గుకుని రాగలుగుతారు. ప్రస్తుతం ఖర్చులుతోబాటుఆదాయం కూడా బాగుండటంవల్ల ఏ విధంగాను శ్రమ తోచదు. వ్యవహారరంగంలో సహాయంచేస్తామన్నవారు, మిమ్ములను త్రిప్పుతు ఉండటంవల్ల మనశ్శాంతి ఓర్పు తగ్గుతవి. వృత్తిలో ఎంతడబ్బు వినియోగించినా సరిపోయింది అనే మాట ఏర్పడదు. పిల్లలకు అనారోగ్యంచేసి నెమ్మదిస్తుంది. మీ కష్ట సుఖాలలో భాగం పంచుకొనే స్నేహితులు లభిస్తారు. లోగడ వప్పుకొన్న కంట్రాక్టులు మొదలయినవి, జాగ్రత్తగా నెరవేర్చగలుగుతారు. ధనరూపంలో విశేషంగా ఫలితం ఉంటుందని అనుకోవద్దు. 14, 15 తేదులలో బంధు విరోధం, సంచారము, ధుబాధా ఖర్చులు.

* * *

తుల :

(చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ, 1, 2, 3 పాదాలు)

"వెనుకప్రక్క కొండ ఉంటే గుండ్రాతికోసం వెతికినట్లు"గా ఉంటుంది. ఎవరితో మాట్లాడుదామన్నా అనవసరంగా హేళన, నిష్ఠురాలు భరించవలసి వస్తూ ఉంటుంది. వృత్తి వ్యాపారాలలోగాని, వ్యవహార రంగంలోగాని కొరత ఏమీ ఉండదు. దైవకార్యాలలో ప్రవేశించవలసిన సమయం. బంధుమిత్రులకు చెప్పిన మాటను పూర్తిగా నెరవేర్చుకొనేవరకూ ఆందోళనపడుతూ ఉంటారు. ఒకరిద్దరు స్నేహితులు మిమ్ములనుగురించి ఈర్ష్యతో ప్రసంగించవచ్చు. వృత్తి ఉద్యోగాలలో మీ బాధ్యతలను చురుకుగా నిర్వహిస్తారు. కాని పొరపాట్లురాగల సూచనలున్నవి. విలువగల వస్తువులు కొంటారు. కుటుంబంలోనివారికి అనారోగ్యం చేస్తుంది. 13, 14 తేదులలో ఆదాయభంగం,-కలహచింత.

* * *

వృశ్చికం :

(విశాఖ 4-వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ.)

అనుకున్నపనులు ఏదోవిధంగా సానుకూలం అయినవనే సంతృప్తి కనుపిస్తుంది. మనస్సుకు, దేహానికి విశ్రాంతి లభిస్తుంది. ఖర్చులు అంచనాకు దాటినా, సుఖసంతోషాలు బాగుంటవి. రాజకీయరంగంలో పేరుప్రతిష్ఠలు పెరుగుతవి. కొన్ని సమయాలలో దండుగఖర్చులు కనుపించినా తోటివారిని మెప్పించగలుగుతారు. దూరమందున్న, బంధువులవద్దనుంచి అనుకూలవార్తలు తెలుస్తవి. నిరాడంబరంగానే మీ శక్తిసామర్థ్యాలను వినియోగించి సంఘంలో మంచిపేరు పొందుతారు. స్థిరాస్తులు కొనటంవంటి కార్యక్రమాలు సులభంగా పూర్తి అవుతవి. వారాంతంలో మాటపట్టింపుల వల్ల మనశ్శాంతి లోపిస్తుంది. 16, 17 తేదులలో ధనలాభం, అధికారులవల్ల కార్యసిద్ధి, వృత్తిలో పోటీ.

* * *

ధనుస్సు :

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)

ధనవిషయంలో ఏర్పడిన ఇబ్బందులు తొలగిపోతవి. శత్రువుల ప్రయత్నాలు ప్రస్తుతం మిమ్ములను ఏవిధంగానూ బాధించవు. వృత్తిలో కొత్తవారి సంబంధంవల్ల, కార్యానుకూలత, గౌరవము పొందగలుగుతారు. ఉత్తరదిక్కునుంచి లాభవార్తలు తెలుస్తవి. ఈ సమయంలో సాహసంగా ప్రవర్తించటం మంచిదికాదు. సాధ్యమైనంతవరకు ఖర్చులను తగ్గించుకొనటం మంచిది. కుటుంబంలోనివారివల్ల ఆదరాభిమానాలు పొందలేకపోతారు. ప్రయాణ కార్యక్రమాలు సుఖంగా నెరవేరుతవి. మీ శక్తికిమించిన కార్యభారం పైనపడకుండా చూచుకొనండి. 13, 14 తేదులలో కార్యవిఘ్నం, ఖర్చులు.

* * *

మకరం :

(ఉత్తరాషాఢ 2, 3, 4 పా, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా)

ఈసమయంలో నిష్కర్షగా మాట్లాడటం అవసరం. మంచిమాటలతో మిమ్ములను నిరుపయోగమైన పనులలో దింపేవారు ఉంటారు. మీపై అధికారులు తగినంత సహాయం చేయలేకపోతారు. బంధువులవద్దనుంచి సంతోషవార్తలు తెలుస్తవి. వృత్తి ఉద్యోగాలలో మీ పనులు ఒకదానికొకటి సంబంధంలేకపోవటంవల్ల శ్రమ అధికమవుతుంది ఇతరులవద్దనుంచి రావలసిన ధనం రాకుండా కాలం గడిచిపోతూ ఉంటుంది. మీ ఆరోగ్యం సాధారణంగా ఉంటుంది. నరములయందు బాధ తోస్తుంది. స్వల్పవిషయాలలో కూడ ఆందోళన కలుగుతూ ఉంటుంది. చేతిలోఉన్న డబ్బును పెట్టుబడిక్రింద వినియోగించవలసివస్తుంది. 15, 16 తేదులలో అధికశ్రమ, కలహాభయము.

* * *

ఈ వారము ధరలు

బంగారుధర తేజీలోనే నిలకడగా యుంటుంది. 18, 19 తేదులలో మందీ రాగల అవకాశాలున్నవి. వెండిధర మామూలుగా ఉంటుంది. మాలుధర వారం రెండవభాగంలో మందీ వస్తుంది. కందులకు గిరాకీ వస్తుంది. వేరుశనగపప్పు ధర ముందు తగ్గి వారాంతంలో పెరుగుతుంది. నూవుల ధర గతవారంవలెనే ఉంటుంది. అయితే 17, 18 తేదులలో మందీ రాగలదు. మినుముల ధర తాత్కాలికంగా మందీ వస్తుంది.

కుంభం :

(ధనిష్ఠ 3, 4 పా, శతభిషం, పూ. భాద్ర 1, 2, 3 పా.)

విద్యార్థులకు చాలా ప్రోత్సాహకరమైన సమయం. వ్యాపార వ్యవహార రంగాలలోకూడా గౌరవము, ధనలాభము బాగుంటవి. మాటనేర్పుతో అందరిని సంతోషపరచగలుగుతారు. మధ్యవర్తులమూలంగా మీ చిక్కులు చాలాభాగం నివర్తి అయిపోతవి. దూరమందున్న స్నేహితులు మిమ్ములను ధనసహాయం కోరవచ్చు. వారం రెండవభాగంలో అకస్మాత్తుగా దుర్వార్తలు తెలుస్తవి. మీమనస్సుకు సంతృప్తికరంగా పనిచేయగలవారు లభిస్తారు. డబ్బుకు సంబంధించిన బాధ్యతల ఇతరుల చేతిలో పెట్టతగిన సమయంకాదు. పిల్లల ఆరోగ్యంగురించి జాగ్రత్తగా యుండండి. హాస్యప్రసంగాలు విపరీతం కాకుండా చూచుకొనండి. 17, 18 తేదులలో అనారోగ్యం, స్వల్పలాభం.

* * *

మీనం :

(పూ. భాద్ర 4 పా, ఉ. భాద్ర, రేవతి.)

ఈ సమయంలో మీ మాటను పదిమంది పాటిస్తారు. పరోకకారము, పుణ్యకార్యాలు నిరాటంకంగా చేయగలుగుతారు. పైకి ఆడంబరం కనుపించకపోయినా, మీహోదా, ఆదాయము ఏ విధంగానూ తగ్గవు. ఆరంభించిన పనులు వెంటనే పూర్తిచేయకపోతిమనే ఆందోళన కలుగుతుంది. మీ పనులలో త్రిప్పట, శ్రమ అధికం కావచ్చు. విలాస, వినోద విషయాలలో ఖర్చుమాత్రం పెరుగుతుంది. ఇతరుల తగాదాలలో మీరు జోక్యం కలిగించుకొనవలసిన అవసరం కలుగుతుంది. వారాంతంలో ధనవిషయంలో ఇబ్బంది కనుపిస్తుంది. శుభవార్తలు తెలుస్తవి. 18, 19 తేదులలో క్రొత్తవారి స్నేహం, వృత్తిలో శ్రమ. ★

అద్భుతము!



గృహములకు
– హోటళ్లకు

బ్రూక్ బాండ్
స్పెషల్ హోటల్ బ్లెండ్
డస్ట్ టీ

* ఎల్లప్పుడు తోటలోని తాజాతనముతో మీరు పొందగలరు.
* నిపుణులు బ్లెండు చేయుటవలన ఆహ్లాదకరమగు సువాసనను మీకు చేకూర్చును.
* లక్షలాది ప్రజలు దీనిని కోరుచున్నారు.

3 సైజులలో లభించును
500 గ్రాములు, **100** గ్రాములు, **50** గ్రాములు

JWT BB 387

హాయవాతా ప్రణయగాథ



మూలం: లాంగ్ ఫెలో

అనుసరణ: పి. గణపతిశాస్త్రి

జరిగిన కథ

జాబిల్లి చిన్నారి భార్య నోకోమిస్ ముద్దులమూతురు వెనోనా. పడమటి గాలి అనే తుంటరివాడు ఆమెను మోసగించి మటు మాయమవుతాడు, వెనోనా హాయవాతాను కని దిగులుతో మరణిస్తుంది. నోకోమిస్ మనుమణ్ణి చేరదీస్తుంది. హాయవాతా క్రమక్రమంగా పెరిగి పెద్దవాడయి ఎందరెందరో వీరులను ఓడిస్తాడు.

అంత పరాక్రమశాలి అయినా తన తల్లిదండ్రు లెవరో తెలియక హాయవాతా మనోవ్యాధికి లోనవుతాడు. నోకోమిస్ జరిగిన కథ అంతా పూసగుచ్చినట్లు చెబుతుంది. హాయవాతా పడమటి గాలితో యుద్ధం చేసి ఓడిస్తాడు పడమటి గాలి వెనోనాకు తాను చేసిన ద్రోహానికి పరితపించి తన రాజ్యాన్ని కొడుక్కి అప్పగిస్తాడు. హాయవాతా కొంతకాలం తండ్రిదగ్గరే ఉండి అటుతరవాత నికోమిస్ భవంతికి ప్రయాణమవుతాడు. దారిలో అతనికి ఇయాగూ కనిపించి మకొరియో సంగతి చెబుతాడు. వాడిదగ్గరఉన్న బాణాలు తెచ్చుకు నేందుకు హాయవాతా దకోటా దేశానికి హాయవాతా ఆ రాజ్యంలో ప్రవేశించగానే అక్కడొక సరస్సు, అందులో ఒక చక్కని కన్య కనిపిస్తాగు. ఆమె మకొరియో కుమార్తె మిన్నేహాహా. హాయవాతా తమ శత్రువర్గంలో వాడని తెలుసుకుని తన తండ్రి రాకముందే వెళ్లిపొమ్మని ఆమె చెబుతుంది. మిన్నేహాహా సౌందర్యం చూచి ముగ్ధుడైన హాయవాతా ఇష్టం లేకపోయినా, ఆమె చెప్పినట్లు పొదల్లో దాక్కుంటాడు. ఇంతలో అక్కడికి వచ్చిన తన తండ్రిని మిన్నేహాహా ఏమార్చి పంపివేస్తుంది. హాయవాత పొదరింటి నుండి బయటపడి మిన్నేహాహాకు తన మనసులో మాట చెబుతాడు. ఆమె తుర్రున సరస్సు ఒడ్డికి పారిపోతుంది. హాయవాతా మళ్ళీ పొదల చాటున దాక్కుంటాడు. ఉన్నట్టుండి హాయవాతాకు మిన్నేహాహా ఆర్తనాదం వినిపిస్తుంది. అతడు రివ్వున వెళ్ళి సరస్సులో దూకి మిన్నేహాహాని, లేడిని రక్షిస్తాడు. కూతురు కేకలు విని వచ్చిన మకొరియో హాయవాతా చేసిన మేలు తెలుసుకుని తన ఆతిథ్యం స్వీకరించమంటాడు. హాయవాతా సరేనంటాడు. కాని, తానెవరో ఎందుకు వచ్చాడో మాత్రం చెప్పడు.

హాయవాతా ఆ తరవాత రెండు రియో ఆతిథ్యం స్వీకరించాడు. మూడు రోజులపాటు మకా ఆ కాలం అంతా అతనికి ఎంతో హాయిగా గడచిపోయినట్లనిపించింది కాని ఒకే ఒక మనోవ్యథ అదేపనిగా పట్టుకుని పీడించింది. మిన్నేహాహా మళ్లీ ఎప్పుడు అతని కంటపడ లేదు! ఎప్పుడయినా ఒక్కసారి ఒంటరిగా కలుసుకోవాలని హాయవాతా ఎంతయినా ఉబలాటపడ్డాడు. కాని మకొరియో పొద్దస్తమానం ఇంటిపట్టునే ఉండడం మూలాన ఆ కోరిక ఫలించ లేదు. మరి లాభం లేదని నిశ్చయించుకొని వెళ్లిపోవాలని అనుకున్నాడు. సెలవు తీసుకునేముందు మకొరియోనడిగి బాణాలు కొన్నయినా పట్టుకుపోవాలని ఉబలాటపడ్డాడు. నాలుగోనాడు ఉదయమే లేచి, ప్రయాణ సన్నాహం పూర్తి చేసుకుని, మకొరియోదగ్గిరికి వెళ్ళి తిరిగి తొందరతొందరగా ఇంటికి వెళ్ళిపోవాలనీ, సెలవిప్పించమనీ అడిగాడు. అతడు కొంచెం సేపాలోచించి 'అప్పుడే అంత తొందరేమి

—37 వ పేజీ చూడండి



ఆకాశం విరిగి భూమిమీద పడినట్లు పెడేల్న పెద్ద చప్పుడైంది. పల్లంలోంచి పైకి పెల్లగించినట్లుగా భూమి ఒక్కసారి తల్లక్రిందులై పోయింది. పంచభూతాలూ ఒక్క క్షణం చోద్యం చూస్తూ తమతమ పనుల్ని మర్చిపోయాయేమో అనిపించింది. ఆ పెట్టెలో ఉన్నవాళ్లంతా ఒకరి మీద ఒకరు దొర్లిపడ్డారు. ఒక్క క్షణకాలం ఎవరి శరీరాలు వారికే పట్లుతప్పి ఊర్ధ్వ లోకంలోకి ప్రయాణ మవుతున్నట్లయింది ఉండలుచుట్టుకుపోతున్న దేహాలనుంచి స్వేచ్ఛ పొందిన విహంగాల్లాగ ఏ అవయవానికి ఆ అవయవం ఎక్కడికో ఎగిరిపోతున్నాయి. తర్వాత ఆ ప్రదేశమంతా ఒకటే గోల — ఏడుపులూ, బాధతో కూడిన మూలుగులూ, కేకలు — అన్నిటితో నిండి పోయింది.

*   *   *

భాస్కరం కళ్లుతెరిచేసరికి ఓ పగలూ, ఓ రాత్రీ గడచిపోయినాయి. చుట్టూ ఉన్న పరికరాలూ, తలవైపున ఉన్న టెంపరేచరు ఛార్టు, మందు సీసాలూ—ఇవన్నీ చూసి తనొక హాస్పిటల్‌లో ఉన్నట్లు గ్రహించాడు. అప్పటి కతనికి బాగా తెలివి వచ్చేసింది. తనక్కడ కెలా వచ్చాడు ? రైలు ప్రమాదం జరిగింది .... తర్వాత ఏమయింది ? ఎంతమంది ప్రాణాలు నష్టపోయారు? ఇంత ఘోరానికి కారణం ఏవిటి ? .... భాస్కరానికి ఆతృత ఆగటంలేదు. నెమ్మదిగా లేచి కూర్చున్నాడు. శరీరమంతా పచ్చిముద్దలాగ ఉంది, అక్కడక్కడ తగిలిన కవుకుదెబ్బలతో.

ఎదురుగా ఉన్న గుమ్మంలోంచి ఒక నర్సు నాలు గయిదు సంవత్సరాల పాపని నడిపించుకుంటూ వచ్చింది

"మీరు లేచారే ! కదలకుండా పడుకోండి. డాక్టరుగార్ని పిల్చుకువస్తాను" అంటూ తిరిగి వెళ్లబోయింది

"నర్స్ ! ఒక్క నిముషం అస లిక్కడి కెలా వచ్చాను ? రైలుప్రమాదం విశేషా లేమిటి ?



ప్రమాదానికి కారణం ఏమిటి ? ఇది ఏ ఊరు ?.... ఈ వివరాలు చెప్పండి దయచేసి. నాకేం ఫర్వా లేదు."

ఆతని ఆత్రుత చూసి చిన్నగా నవ్వుకుం దావిడ.

"మీ ఆత్రుతకి అర్థముందిలెండి డాక్టర్ ! ఏం ? ఆశ్చర్యపోతున్నారు ? మీరు డాక్టరని ఎలా తెల్సిందనా ? దానికేముందిలెండి ! ఇక్కడ మిమ్మల్ని జాయిన్ చేయించినప్పుడే మీ జేబులో ఉన్న కాగితాల్నిబట్టి తెల్సింది. అప్పటికి మీ వంటిమీద స్పృహలేదు. ప్రమాదం జరిగి 6,7 గంటలు గడి చాకగాని ఇక్కడకు వార్త రాలేదు. గాయపడ్డవా రందర్నీ ఇక్కడే జాయిన్ చేయించారు. ఎక్కువ ప్రాణనష్టంలేదు గాని—20, 25 మంది చని పోయారని అంటున్నారు. మొదటి రెండు పెట్టెలు బాగా దెబ్బతిన్నాయి .... అన్నట్టు .... ఈ పాప మీ పాపేకదూ ?"

భాస్కరానికి నవ్వొచ్చింది. తనవైపే తదేక దీక్షతో చూస్తున్న ఆ పాపకేసి చూశాడతను. సరైన పోషణలేక శుష్కించిన శరీరం, కాంతి లేని ముఖం .... అయినా కళ్లలో ఏదో ఆకర్షణ ఉంది .... ఎవరిపాపోగాని.

"ఈ పాప నా తాలూకని ఎందు కనుకున్నారు" అని నవ్వి "నా జేబులోని కాగితాలే చెప్పాయేమిటి అదికూడా ?" అన్నాడు.

నర్స్ కొంచెం చిన్నబుచ్చుకుని నవ్వి "మిమ్మల్ని ఇక్కడకు తీసుకువచ్చిన వలంటీర్లు బహుశా ఈపాప మీతాలూకు అయివుండవచ్చు అని చెప్పి వెళ్లారు. డాక్టరుగారి కీసంగతి బాగా తెలుసు — ఆయన్ని పిలుస్తా ఉండండి ...."

నర్స్ వెళ్లిపోయాక బద్ధకంగా వళ్ళు విరుచుకున్నాడు భాస్కరం. నీరసంగా ఉంది తప్పితే ఇంకేమీ బాధలు లేవనుకున్నాడు. రైలుప్రమాదాల్నిగురించి వినటమేగాని, ఆ ప్రమాదంలో తనూ ఓసారి యిరుక్కోవటం — అందులోనూ మొదటిసారి ఉద్యోగంలో ప్రవేశించటానికి వెళ్తుండగా — అదొక అశుభమా? అదృష్టమో, దురదృష్టమో తను బ్రతికాడు. చనిపోయి ఉంటే? తనకోసం ఏడ్చేవా రెవరు ? లలిత ఉంది .... కాని ఇంకా తన అర్ధాంగి కాలేదుగా ! కొన్నాళ్ళు తల్చుకొని తర్వాత మర్చిపోతుంది...

డాక్టరుగారు రావటంచూసి తన దృష్టి అటు మళ్లించుకున్నాడు.

"హల్లో ! మిమ్మల్ని కలుసుకున్నందుకు చాలా సంతోషం ! ఎలాఉంది మీకు ? ...." చాలా ఆప్యాయంగా అడిగా డాయన.

"థాంక్యూ సార్ ! ఒక్క నీరసం తప్పితే ఏ బాధలూ లేవు..."

"అవునులెండి. ఎక్కడా దెబ్బతగలకుండా తప్పించుకున్నారు గమ్మత్తుగా. నాకు కూడా ఇలాంటి ప్రమాదం రుచిచూడాలని ఉందండి... ఓసారి అనుభవంగా ఉంటుంది...ముందు ముందు మా మనవలకి ఓ కథగా చెప్పుకోటానికి .... మనకి తెలియకుండా వళ్లంతా గబగబా పరువుచుట్ట లాగా చుట్టుకుపోవటం, దభీమని ఓచోట పడ్డం, ఓ రెండ్రోజులు మరోప్రపంచంలో ఉండి తర్వాత తెలివిలోకి రావటం ...."

"ఏ కాలో, చెయ్యో విరిగితే ఇంచక్కా శాశ్వతంగా ఇంట్లో కూర్చోవటం . ..."

భాస్కరం అన్నదానికి డాక్టర్ గలగలా నవ్వేశాడు.

తర్వాత కొన్ని నిముషాలు ప్రమాదవిశేషాలు వివరించి చెప్పి డాక్టర్ హఠాత్తుగా....

"ఈ పాప మీ తాలూకు అయివుండవచ్చు అని చెప్పారు. మీరు కాదని అంటున్నారు. ఈ పాపని ఈ రెండ్రోజుల్లోనూ ఎందుకైనా మంచిదని అందరికీ చూపించాం. చనిపోయినవారితాలూకు పాప అవ్వచ్చు అనుకోవటం — అదీ కాదని నిర్ధారణగా తెలియటం అయిపోయింది. ఇంతవరకూ ఎవరూ ఈ పాపనిగురించి వాకబులు చెయ్యకపోవటం మరో ఆశ్చర్యం.

"అసలీపాప నా తాలూకని ఎందు కనుకున్నారు?"

"అది కేవలం ఊహ ! మీరు పడిఉన్న చోటనే ఈ పాప ఉంది. తెలివిలోనే ఉంది. మీమీద చెయ్యివేసుకుని ఏడుస్తూ కూర్చుంది. తర్వాత పాపని ప్రశ్నిస్తే మీరు తన బాబాయని చెప్పిందనుకోండి ...."

"ఆశ్చర్యంగా చూశాడు భాస్కరం పాపకేసి. పాప సిగ్గుతో తల వంచింది. చిన్నగా నవ్వుకున్నాడు భాస్కరం.

"పాపా ! నీపే రేమిటమ్మా ?" అని అడిగాడు. సిగ్గుతో మరీ తల వంచేసింది పాప.

"ఎంత సిగ్గో ! ఇలా దామ్మా .... ! రావాలి .... నేను బాబాయినికదూ !" నెమ్మదిగా భాస్కరం దగ్గరగా వచ్చి నుంచుంది పాప.

"ఆ ! అదీ .... ఇప్పుడు చెప్పు మరి—నీపేరేమిటి ?"

"పాప !" అంది నెమ్మదిగా నేలవైపు చూస్తూ ! తనమాటకి నవ్వుతున్న అందరివైపూ బెదురుతూ చూస్తున్న పాపని చూస్తూ,

"సర్లెండి భాస్కరం ! నెమ్మదిగా మీరు పాపని ప్రయత్నించండి. మీరు ఉద్యోగంలో ఎప్పుడు జాయినవ్వాలి ? మీ సామాను మీగు ఆన మాలుపట్టి తీసుకోవచ్చు. అన్నీ జాగ్రత్త చేశారు ...." అన్నాడు డాక్టర్.

"పెద్దసామాన్లేవీ లేవులెండి. ఓ పెట్టె, బెడ్డింగు, నా ఆర్డరుకాగితం జేబులోనే ఉండిపోవటం ఈవిధంగా లాభించింది. మీ ఆదరణ ఎన్నటికీ మర్చిపోలేను .... నన్నెప్పుడు వెళ్లమంటారు ?"

"రేపు వెళ్లవచ్చులెండి. ఇవాళ్టికి బ్రెడ్, పాలూ తీసుకోండి మీవాళ్ల కెవరికైనా కబురుచెయ్యాలా ?"

"అవసరం లేదులెండి. ఏమీ కంప్లయింట్స్ లేవుగా."

డాక్టర్ వెళ్లినతర్వాత ఆ గదిలో తనూ, పాపా మిగిలారు. పాప తనవైపు భయంతీరి చూస్తూంది, చూసి నవ్వుతోంది.

"మీ నాన్నపే రేమిటి పాపా ?"

"నాన్న .... !"

"నాన్న ఏం చేస్తాడు ?"

అర్థంకానట్టు చూసి, 'కోల్తాడు—" అని ఊరుకుంది క్రిందకు చూపు మళ్లించి భాస్కరం మనస్సు ఆ అనుకోని జవాబుకు ఆర్ద్రమైపోయింది తనడిగిన ప్రశ్న పాప కింకోకలా అర్థమైనప్పటికీ, మరోసత్యం గోచరించిం దా జవాబులో . . . .

"నాన్న కొట్టితే అమ్మ ఏం చేస్తుంది ?"

ఒక్కసారి ఉలిక్కిపడి చూసింది పాప. ఆ కళ్లలో భయం ఆవరించి ఉండటం చూశాడు

భాస్కరం. ఏమిటి దీని అర్థం? తల్లి, అంటే భయంపెంచుకున్న ఈ పసిహృదయం ఎంత బాధపెట్టబడి ఉండాలి? కన్నతల్లి ఏ బిడ్డకయినా తనపై భయం కల్గేటట్లు ప్రవర్తిస్తుందా? తిరిగి అదేప్రశ్న వేశాడు భాస్కరం. ఈసారి పాప ముల్లుగుచ్చిన లేతాకులాగ వణికిపోయింది. కళ్లంట గిర్రున నీళ్లు తిరిగాయి. వస్తూన్న ఏడుపు మింగుతూ.

"అమ్మకాదు .... పిన్ని .... పిన్నికూలా కొట్తుంది" అంది. అని మంచంమీద తల దోపుకుని ఏడుస్తున్న పాపతలని నిమురుతూ ఆలోచిస్తూ కూర్చున్నాడు భాస్కరం.

తనకీ తల్లిలేదు. తండ్రి తిరిగి పెళ్లి చేసుకోలేదు. పాపకీ తల్లి లేదు. కాని సవతితల్లి ఉంది. పిన్నిపే రెత్తగానే భయంతప్ప మరోభావం ఏమీ కనుపించలే దీ పాపలో. ఎంత హింస అనుభవించిందో ఈ లేతమనస్సు!.... ఇంతకీ ఈ పాప తండ్రి ఎవరు? ఏ ఊరు? ఈ రైల్లో పాప ఒక్కర్తే ఎలా ప్రయాణంచేస్తుంది? కూడా ఉన్న వాళ్లేమయ్యారు? రైలుప్రమాదం గురించి వినగానే ఆ తండ్రి ఆదుర్దాకలిగి ఇక్కడకు రాడా?

వీటికి సమాధానం తెలియదు. పాపని చూస్తే వాళ్ల తండ్రి మధ్యతరగతి కుటుంబీకుడనీ, ఉన్నత కులం వాడనీ తెలుస్తూంది. తనని చూసి 'బాబాయ్!' అని ఎందుకు చెప్పింది? తనలాంటి బాబాయి ఉన్నారా పాపకి?

"ఏం పాపా! బాబాయి ఎవరమ్మా?"

"నువ్వేగా .... " అంటూ నవ్వి తన వళ్లో తలపెట్టి నుంచుంది. ఏమిటీ అనుబంధం? చిత్రంగా ఉందే! ఏమిటి చెయ్యాలి పాపని?

ఎటూ ఆలోచన తెగక ఆ రోజంతా గడిచిపోయింది. కాలం గడచినకొద్దీ పాపకబుర్లు ఎక్కువయ్యాయి. తన కంఠం వదలటంలేదు. ఆ ఒక్కరోజులోనూ భాస్కరం గ్రహించిందొక్కటే! పాపకి మాతాపితరుల ప్రేమ ఏమిటో తెలియదు. ఆప్యాయంగా ఆదరించే చల్లని హస్తం ఆమెను తాకలేదు.

మర్నాడు కొంచెం ఓపిక కల్గింది భాస్కరానికి. ఈలోగా డాక్టర్ రెండు మూడు సార్లు వచ్చి వెళ్లినా పాపసంగతి ఏమీ పట్టించుకోలేదాయన. ఆ సాయంత్రం భాస్కరం ప్రయాణం అవుతూంటే డాక్టర్ వచ్చా రతని గదికి. ప్రయాణం సంగతులన్నీ అయ్యాక .....

"అయితే ఈ పాప తాలూకు ఎవరూరాలేదు. ఏంచేద్దాం?" అన్నా రాయన. భాస్కరం ఒక్క క్షణం ఆగి.

"పేపర్లలో ఫోటో వేయించి ప్రకటిస్తే కొంతపని జరుగుతుందేమో చూడాలి .... ఈలోగా పాప నాతో ఉంటుందిలెండి."

ఆశ్చర్యంగా చూశాడు డాక్టరు. "మీరు ఒంటరిగాళ్లే కదా! అక్కడ .... ఆ పల్లెటూర్లో .... ఎలా చూస్తారీ పిల్లని? .... ఏ శరణాలయంలోనో ఉంచేస్తే పోయేదానికి .... "

"వద్దండి! శరణాలయంప్రసక్తి వద్దు. అదంటే నాకున్న అభిప్రాయం వేరు. ఈ పాప అంత దిక్కులేనిది కాదు. పైగా పాప నా దగ్గర

పిన్ని నికాదు

బాగా అలవాటయింది. నాకూ కాలక్షేపంగా ఉంటుంది. పాపతాలూకు ఎవరైనా వస్తే నా దగ్గరకు పంపండి."

పాపను తీసుకుని రైలెక్కాడు భాస్కరం. మర్నాడే ఉద్యోగంలో ప్రవేశించాడు. ఆ ఊరు బాగా పల్లెటూరు కాదు. హాస్పిటల్‌లోనే అతనికి క్వార్టర్స్ ఉన్నాయి. ఇద్దరు కాంపౌండర్లు, ఇద్దరు నర్సులు, ఇద్దరు బోయ్‌లు, తోటమాలీ .... వీళ్లంతా తనకింద పనిచేసేవాళ్లు. తనకోసం ఓ వంటమనిషిని పెట్టుకున్నాడు. పాపనిగురించి తనేమీ బాధపడ నక్కర్లేకపోయింది.

పాపవిషయంలో అతని అనుమానం పూర్తిగా నిజమయింది. రైలుప్రమాదం జరిగి రోజులు గడుస్తున్నా, పాప ఫోటోతోసహా పేపర్లలో ప్రకటనలు వేయించినా, ఎవరూ పాపకోసం వెతకటంలేదు. పాప తండ్రితోటే ప్రయాణంచేసినట్లు చెప్తోంది. అయితే ఆయన ప్రమాదంలో చనిపోయాడా? చనిపోయినవారి తాలూకు బంధువు

సుప్రసిద్ధ అమెరికన్ రచయిత మార్క్‌ట్వెయిన్ చిన్నతనంలో చదివిన స్కూలుటీచర్ ఒకసారి (అయన పెద్దవాడయిన తర్వాత) ఇలా అందిట:"శామ్‌కు (క్లెమెన్స్ ట్వెయిన్ అసలు పేరు) వచ్చిన కథలన్నీ నాకూ వచ్చు. అతను వాటిని కాగితం మీద రాసేశాడంతే," అని.

ఎల్. హనుమంతరావు (ఆదోని)

లంతా వచ్చి శవాల్ని గుర్తుపట్టి వెళ్లారుగదా! వాళ్లలో పాపని గుర్తుపట్టినవారే లేరట! అంటే పాపతండ్రి చనిపోయినవారిలో లేడు అన్నది నిశ్చయం. అయితే బ్రతికినతర్వాత ఆయనకి పాపకోసం వెతకాలన్న విచారం లేదా? పాపని తీసుకువెళ్లాలని ఆయనకు లేదా? పాపని వదుల్చుకోవటమే అతగాడి ఉద్దేశ్యమా?

భాస్కరం ఒక నిర్ణయానికి వచ్చాడు. తన ఊహకి పాప చెప్పిన తాడూ బొంగరంలేని మాటలే కొంత ఆధారం. పాపని ఏ అనాథశరణాలయంలోనో చేర్పించటానికి తండ్రి రైల్లో ఏ మహా పట్టణానికో తీసుకుపోతుండగా ప్రమాదం జరిగింది. విధివశాత్తు పాప తనదగ్గరకు చేరింది. ఏవిధంగానైతేనేమి, వారి ఆశయం నెరవేరింది కనుక ఇక పాపకోసం ప్రయత్నించి అతగాడు రాడు. అయితే ఈ పాప బాధ్యత తనే వహించాలా? తనకేమి అవసరం? తనైనా చిన్నవాడు. ఇంకా జీవిత మాధుర్యాలనేమీ రుచిచూడలేదు. ఈ రకమైన బాధ్యత తన జీవితానికి అనవసరపు బరువే! కాని,

అమాయకమైన పాప కళ్లు—ఆదరణ, ఆప్యాయత ఎరుగకుండా పెరిగిన ఆ చిన్నారి ముఖం ఆ ముద్దు పలుకులు—పాప అంటే ఏదో అభిమానం ప్రేమ కల్గించాయి. శరణాలయానికి అప్పగించటంతో తను కూడ పాపతండ్రి ఆశయాన్ని బలపర్చినట్లవుతుంది తప్ప తన మానవత్వాన్ని బయటపెట్టదు. ఆ తలపుని ఎన్నడో త్రుంచివేశా డతను.

ఓరోజున ఓ ముసలాయనా, ఓ ముసలావిడా వచ్చారు భాస్కరం ఇంటికి. వాళ్లు అతనికి ఏమీ కారు, కాని వాళ్లకన్నా బంధువు లెవ్వరూ లేరు. వాళ్లని చూడగానే భాస్కరానికో సంకల్పం కల్గింది. పాపని వాళ్ల పెంపకంలో ఉంచితే? వాళ్లకి యింట్లో చిన్నపిల్ల లెవ్వరూ లేరు. ఉన్న ఒక్క కొడుకు భాక్రానాంగల్‌లో ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. కూతురు మొగుణ్ణి పోగొట్టుకుని పెద్ద ఆస్తితో పుట్టింటికి చేరింది. పాపవిషయం చెప్పగానే ముసలాయనా, ముసలావిడాకూడా వెంటనే అంగీకరించారు—తమకీ, తమ విధవకూతురికీ కాలక్షేపంగా ఉంటుందని. కాని అసలు తంటా వాళ్లు వెళ్లిపోయేరోజునగాని తెలియలేదు.

"పాపా! తాతయ్యతో వాళ్ల ఊరు వెళ్తావా?" అని అడిగాడు భాస్కరం పాపని.

"నువ్వో? మరి నువ్వూ వత్తావా?" అంది ఆశతో చూస్తూ.

"ఇక్కడ ఆస్పిటలుకి వస్తారే .... వాళ్లంతా నన్ను రానివ్వరమ్మా! ముందు నువ్వెళ్లు. తర్వాత వీళ్ళెవరూ చూడకుండా నేనూ వచ్చేస్తాను."

"నేనూ అప్పుడే వత్తాను." నిర్ధారణగా అంది పాప. ఇంక శతవిధాల ప్రయత్నించినా పాప వినలేదు. బలవంతంగా పంపివేస్తే ఏమౌతుందో తను ఊహించగలడు. ఆఖరుసారిగా ప్రయత్నిస్తూ భాస్కరం ....

"చూడమ్మా పాపా! తాతయ్యతో వెళ్తే బోల్డు బొమ్మలు, బిస్కట్లు, చాకలెట్లు .... అన్నీ ఉంటాయి. పైగా అక్కడ మరో కావిడ ఉంది. ఎంత మంచావిడో! నికు బోల్డు కథలు చెప్తుంది. ఎవరో తెల్సా?"

'ఎవరు?' అన్నట్లు చూసింది పాప. అప్రయత్నంగానే .... "పిన్ని!" అన్నాడు భాస్కరం వత్తి పలుకుతూ. అనగానే పాప ఆనందంతో చప్పట్లుకొడ్తుం దనుకున్న భాస్కరానికి పాప ముఖం చూడగానే శరీరం భయంతో ఝల్లుమంది. "పాపా! పాపా!" అని గబగబ కుదిపేశాడు కంగారుగా. పాప తేరుకుని వెక్కివెక్కి ఏడ్చింది.

అప్పట్నించి ముసలి దంపతుల్ని చూడగానే భయంభయంగా తప్పించుకు తిరిగేది పాప వాళ్లు వెళ్లిపోయేవరకూను. తన ఉద్దేశ్యం తలక్రిందులవడంతో భాస్కరానికి ఆరాటం పట్టుకుంది. ఈపాప ఎల్లకాలం తనతోనే ఉండిపోయే పరిస్థితు లేర్పడినట్లు మొదటిసారి అతను గ్రహించాడు. ఈ పాప తనకి విడదీయరాని సమస్య అయిపోయింది. ఎందు కీపాపని చూస్తే ఇంత జాలి, వాత్సల్యం కలుగుతున్నాయి? కన్నతండ్రికే లేని

మమత తనకెందు కావహించింది ? రేపు 'లలిత' తన జీవితభాగస్వామినిగా తనలో ప్రవేశిస్తే ఏమని సమాధానం చెప్పాలి ?

లలితవిషయం స్మరణకు రాగానే భాస్కరం మనస్సు మరోలోకంలోకి పోయింది. లలిత కోసం ఎన్నాళ్ళీ తపస్సు ? అనుకున్న ప్రకారం తన చదువు పూర్తయి ఉద్యోగంలో ప్రవేశించాడు. లలితకూడ పరీక్షలు అయిపోయాయి. లలిత తండ్రి 'కృష్ణారావు' గారు పెళ్ళి ముహూర్తానికి కంగారుపడుతూ తనకు ఉత్తరాలు వ్రాస్తున్నాడనీ, ఎప్పుడో వెంటనే వీలు చూసుకుని వెళ్ళి ముహూర్తం పెట్టిస్తానని ముసలాయన చెప్పాడు తనతో చివరకు తన లలిత తనవద్దకు చేరేరోజులు సమీపించాయి. ఆమెవద్దనుంచి ఉత్తరం వచ్చి చాలారోజులైంది. రైలుప్రమాదం జరిగినట్లు తెలిసి లలిత అనుభవించిన వేదన, కంగారు ముస లావిడ తనతో చెప్తుంటే తన గుండెలలో నిండిన ప్రేమవాహిని పొంగి పొర్లిపోయింది. తన దగ్గర్నించి కులాసాగా ఉన్నట్లు ఉత్తరం వచ్చాక మామూ లుగా లేచి తిరిగిందట.

ఇంతవరకు పాపనిగురించి లలితకి ఏమీ వ్రాయలేదు. ఇప్పటి పరిస్థితుల్లో పాపవిషయం లలితతో సంప్రదించక తప్పలేదు. ఏదోవిధంగా పాప తనవద్దనుంచి వెళ్ళిపోతుందనీ, ఎక్కడకో, ఎవరివద్దకో, పంపివేద్దామనీ ఉద్దేశ్యంతో తనింత వరకు ఉపేక్షించాడు. కాని రేపోమాపో తన బాధ్య తతో పాటు, ఈ పాప బాధ్యతకూడ తీసుకోవల సిన తన లలితకి ఇప్పుడైనా ఉన్నది ఉన్నట్లు వివరించి చెప్పి, చివరినిర్ణయం ఆమెకే వదిలి వేద్దామనుకున్నాడు భాస్కరం.

ఆవిధంగానే లలితకి పెద్ద ఉత్తరం వ్రాశాడు. తీరా ఉత్తరం పోస్టుచేసి వచ్చాక తన కనేక సందే హాలు, అనుమానాలు ఆవరించాయి. 'తనమీద లలిత ఏమీ అనుమానించదుకదా ?' అనుకున్నాడు. అటువంటి ఆలోచన రాగానే అతని హృదయం భయంభయంగా గుబగుబలాడింది. ఇంతవరకూ నిర్మలంగా, నిష్కల్మషంగా ఉన్న తమ ఇద్దరి హృదయాలలోనూ ఈ అనుమానభూతం అఘాతం నిర్మించదుకదా అని వాపోయాడు.

కాని లలితదగ్గర్నించి వచ్చిన జవాబుతో అతని అనుమానాలన్నీ పటాపంచలవటమే కాకుండా అతనిలో నూతనోత్సాహం ప్రవేశిం చింది. పదేపదే ఆ ఉత్తరం చదువుకున్నాడు. చది వినకొద్దీ అతని గుండె తేలికపడింది. అందులోనూ 'తమ్ముడితో కలిసి వచ్చే ఆదివారం పాపని చూడ టానికి వస్తున్నా' నని కూడా వ్రాసింది. ఈ ఉద్యోగంలో చేరేముందు కొన్ని రోజులక్రితం చూసిన లలిత—ఇన్నాళ్ళకు తనని చూడ్డానికి వస్తోంది. ఎన్నాళ్ళయిందో కదా !' అనుకున్నాడు భాస్కరం.

ఆరోజు లలిత వస్తానన్నరోజు. ఆ స్టేషనుకి బండి రాత్రి 10 గంటలకు వస్తుంది. స్టేషనుకి ఊరికి మూడు నాలుగు మైళ్ల దూరం. తను స్టేషన్‌కి వెళ్లాలి. అప్పుడే సాయంత్రం 5 గంటలు దాటింది. ఆరోజంతా ఎంతో హుషా రుగా గడిచింది భాస్కరానికి. పాపతో ఎన్నో కబుర్లు చెప్పాడు. లలితనిగురించి పాప కేమని చెప్పాలి ? అప్పటివరకూ ఏమీ చెప్పలేదు పాపకి. 'వచ్చే వ్యక్తి పాప కెటువంటి బంధువో తెలియాలి కదా !' అనుకున్నాడు భాస్కరం.

*　　　*　　　*

"పాపా ! ఇవాళ మనింటికి ఒకరు వస్తు న్నారు. నీకు మంచిమంచి బొమ్మలు, బిళ్లలు .... మరి .... రిబ్బన్లు .... అన్నీ తెస్తారు ...."

"ఎవలూ ? నీకూ తెత్తాలా బొమ్మలు ....?"

పాపకేదో సమాధానం చెప్పేలోగా "డాక్టరుగా రోయ్ ! త్వరగా రండి బాబయ్యో!" అంటూ ఏడుస్తూ పిలిచేపిలుపు విని వీధిలోకి పరు గెత్తాడు భాస్కరం.

ఆ వచ్చినవాళ్ళు హాస్పటల్‌కి వెనకవైపున ఉన్న గూడెంలో ఉండే మాలవాళ్ళు. నాలుగయిదు సంవత్సరాల పిల్లని భుజంమీద వేసుకుని తీసుకు వచ్చారు. పక్కగా కొందరు స్త్రీలు పెద్దగా శోకాలు తీస్తున్నారు. భాస్కరాన్ని చూస్తూనే ఆపిల్లని అతని పాదాలదగ్గర పడేసి, "బాబయ్యా! దాని పాణం కావండి. మీ చేతులో పడేశాం" అంటూ వచ్చిన పెద్దలు వినయంగా నిలబడ్డారు. స్టేషన్‌కి వెళ్లేదారిలో పంటకాలవ ఉంది. మామూలు రహదారికోసం కాలవమీద వంతెన ఎలాగూ ఉంది. కాని గూడెంలోవాళ్ళు స్టేషన్‌దగ్గర ఉన్న పొలా లకి వెళ్ళటానికి దగ్గరదారిలో కాలవకి తాటి పట్టీలు వేశారు. ఆ తాటిపట్టీలు దాటుతూ ఈ పిల్ల కాలవలో పడిపోయింది. వెంటనే చూసి పక్కన పనులుచేసుకుంటున్నవాళ్ళు బయటకుతీసి, భాస్కరం దగ్గరకు తీసుకువచ్చారు. నీళ్ళు బాగా త్రాగివేసిందే, గాని ప్రాణభయంలేదు .... వెంటనే హాస్పటల్‌వైపు పరిగెట్టాడు భాస్కరం వాళ్ళని కూడా రమ్మని ....

వడ్రంగి పిట్ట ఒక పెద్ద తాటి చెట్టు మీద వాలి ఒకసారి ముక్కుతో కొట్టింది. అదే సమ యానికి ఆ చెట్టుమీద పిడుగుపడి అమాంతంగా కూలిపోయింది. "ఔరా, నా కింతబలముందా?" అని ఆశ్చర్యపోయింది వడ్రంగి పిట్ట.

జి. అంకయ్య (నిడుబ్రోలు)

తిరిగి యింటికి వచ్చేసరికి రాత్రి తొమ్మిది గంటలు దాటింది. పాప భోజనం చేసేసి తోట మాలితో కబుర్లు చెప్తోంది. భాస్కరం గబగబ తనగదిలోకి వెళ్లిపోయి, అన్నం వడ్డించమని ఒక్క కేక పెట్టి—నీళ్ళకి తయారయి బాత్‌రూం లోకి వెళ్లిపోయాడు. గబగబ నీళ్ళు పోసుకొని, బట్టలు వేసుకుని, భోజనాలగదికి బయలు దేరుతూండగా తనవైపు వస్తున్న పాపని చూసి,

"పాపా ! అన్నం తిన్నావా ? నిద్రపోకు—నువ్వూ స్టేషన్‌కి వద్దువుగాని. త్వరగా మంచి గౌను తొడుక్కో. అప్పుడే చాలా టైమయింది .... త్వరగా తెములు పాపా ! ఇప్పు... పిన్ని వస్తుంది రైల్లో .... "

అని హడావిడిగా అనధోరణిలో తాను వెళ్ళి పోయాడు భాస్కరం వంటింట్లోకి.

అంతవరకూ అతని కంగారు చూసి కంగారు పడిపోయిన పాప, ఆ ఆఖరుమాటతో హఠా త్తుగా కొయ్యబారిపోయింది. పెద్దపులిని తల్చు కున్న లేడిపిల్లలాగ వణికిపోయింది.

భాస్కరం భోజనం హడావిడిగా ముగించి, తన గదిలోకి పరుగెత్తి, త్వరత్వరగా డ్రెస్ వేసుకుని బయటకు వచ్చాడు. వంటఇంట్లో గిన్నెలు సర్దు తున్న శబ్దంతప్ప ఏ అలికిడీ లేదు. ఏదో కొత్తగా అనిపించింది భాస్కరానికి. "పాపా !" అని కేక పెట్టాడు. అన్ని గదులూ వెతికాడు. చివరకు వీధిలోకి వచ్చి చూశాడు. కాని ఎక్కడా లేదు పాప. "పాపా ! పాపా !" అని కేకలుపెట్టాడు. ఎవ్వరూ పలకలేదు. తన కేకలకి పరుగెట్టుకు వచ్చిన తోటమాలిని అడిగాడు పాపని గురించి. మాలికూడా చూడలేదు పాపని. ఇద్దరూ కలిసి మళ్ళీ యిల్లు, దొడ్డి, హాస్పటల్‌వైపు .... అంతా వెతికారు.

'పాప ఏమైనట్లు ?' భాస్కరానికి భయం ఆవహించింది. ఆ క్షణంలో తాను ఆఖరిసారిగా అన్న మాట గుర్తుకి వచ్చింది. "ఇప్పుడు పిన్ని వస్తోంది రైల్లో...." తన లలిత పాప కేవిధమైన పిన్ని అవుతుందో చెప్పకపోవటంవల్ల ఎంత అవర్థం కల్గింది ? ఒక్కసారి బయటకు పరిగెట్టాడు. వెనక వస్తున్న మాలిని మరోవైపుకి పరుగెత్తిం చాడు. భాస్కరం కంగారు మనస్సు ఓరకమైన అనుమానాన్ని రేకెత్తించింది. అతను కాలవవైపు పరుగెత్తాడు. 'స్టేషన్‌వైపు రోడ్డుమీద ఎవరో చిన్నపాప వెళ్తుంటే చూశానని' ఓ బండివాడు చెప్పగా అటు పరుగెత్తాడు.

మెదడులో అనేక అనుమానాలు మొలుస్తు న్నాయి. రైలు వచ్చి వెళ్లిపోతున్నట్లు కూత వినబడిం దతనికి. లలితని స్వయంగా రిసీవ్ చేసుకోలేకపోయానని ఒక్కసారి లీలగా అను కున్నాడు. ఈసమయంలో పాప ఏమైంది ? ఎక్కడకు వెళ్తుంది ? ఎందుకు తనని వదిలి వెళ్లి పోతోంది ? అనే మథన ఎక్కువైపోతోంది. 'పాపా! పాపా ! వెనక్కిరా' అని అతని హృదయాంత రాళాల్లో ఆక్రోశం వెల్లువలై వెలువడింది. 'పాపా !' అని నాలుగైదుసార్లు కేకలు వేశాడు. మినుకుమినుకుమంటున్న నక్షత్రాలు తప్పితే ఆ రోడ్డుమీద మరే వెలుగూ లేదు. వంతెన — కాలవ ముందుగా ఉన్నాయి. కాలవ .... అయ్యో! కాలవ...! కాలుజారి .... లేకపోతే దారితప్పి .... పాప కాలవలో పడిపోదుకదా ? తనదగ్గరకు సాయంత్రం తీసుకు రాబడిన ఆ హరిజన బాలికముఖం అతని కళ్ల ముందు ఆడింది. అతను వణికిపోయాడు, భయంతో. 'పాపా !' అని గట్టిగా కేకవేస్తూ ఆవేశంతో పరుగెత్తాడు. కొంతదూరం వళ్ళు తెలియకుండా పరుగెత్తిన భాస్కరానికి మరికొంత దూరంలో మినుకుమినుకు మనే ఓ గుడ్డిదీపం కన

పిన్నినికాదు

బడింది. మరింత వేగంతో, ఒళ్లొన్ని కూడదీసుకుని పరుగెత్తాడు.

అక్కడొక బండి ఆగింది. బండిప్రక్కగా రోడ్డుమీద ఎవరో ఉన్నట్లు వారి ఆకారాలనిబట్టి గ్రహించి అలా నడిచాడు భాస్కరం.

"ఆ దీపం ఇలా తీసుకురా !"

ఆ కంఠం తనకు సుపరిచితమే! గబగబ దగ్గరకువెళ్లి "లలితా !" అన్నాడు ఆయాసంతో ప్రక్కన ఉన్న లలితతమ్ముణ్ణి గుర్తించాడు.

"భాస్కర్ !" అంది లలిత ఆయోమయంగా.

బండివాడు తెచ్చిన దీపం వెలుగుతో అక్కడ పరిస్థితి అర్థమైంది భాస్కరానికి. "పాపా ! .... పాపా ! కళ్లుతెరు .... " పిచ్చిపిచ్చిగా కేకలుపెట్టూ లలిత వడిలో పడిఉన్న పాపని కుదిపేశాడు ఒక్కసారిగా.

"భాస్కర్ ! నా అనుమానం నిజమైంది చూశావా, దూరంనుంచి 'పాపా !' అనే కేకలు వినబడ్డాయి మాకు. ఇక్కడ పడిపోయి ఉందిపాప. ఏదో అజ్ఞాతంగా అనిపించింది 'మన పాపేనా!' అని .... "

పాపని పరీక్షించి చూశాడు భాస్కరం.

"పాపా ! చూడమ్మా .... ఇలా చూడు" అంటూ పాప అరిచేతుల్ని రాస్తూ కూర్చున్నాడు. కొంతసేపటికి పాప నెమ్మదిగా కళ్లుతెరచి ఎదురుగా ఉన్న భాస్కరాన్ని చూసింది. ఆ మసక చీకట్లో కూడా పాపకళ్లలోని భయాన్ని గుర్తించాడు భాస్కరం. పాప కళ్లలోంచి కారిన వెచ్చని కన్నీళ్ల ఆనవాళ్లు స్పష్టంగా కనబడుతున్నాయి.

"ఇదుగోనమ్మా పాపా! ఎందుకు భయపడ్డావ్ ? పిన్ని అంటే మీ పిన్ని కాదమ్మా .... ! ఇలా చూడు. చాలా మంచి దీ పిన్ని. నీకు బొమ్మలు చాకలెట్లు తీసుకొచ్చింది....."

అనునయంగా అంటున్న ఆ మాటలకు కూడ పాప వణికిపోవటం గమనించింది లలిత....

"కాదమ్మా పాపా! నేను పిన్నిని కాదు. అమ్మనే! నా బంగారుతల్లీ .... ఇలా చూడమ్మా .... అమ్మకేసి చూడవ్ ? .... "

నెమ్మదిగా కళ్లు విప్పింది పాప. చల్లని ఆ హస్త స్పర్శలో, మెత్తని ఆ వడిలో, వాత్సల్యపూరితాలైన ఆ పలుకులలో ఏ మాధుర్యం రుచిచూసిందో .... "అమ్మా !" అని ఏడుస్తూ లలిత మెడని రెండు చేతులతోనూ వాటేసుకుంది.

భాస్కరం కళ్లు తుడుచుకున్నాడు పక్కకు తిరిగి.

"నీకు అన్యాయం తలపెట్టాను పాపా ! నిన్ను వదుల్చుకోటానికే ఇన్నాళ్లు ప్రయత్నించాను. స్వంతబిడ్డలాగ చూచుకోడానికి నా బుద్ధి ఆలోచనే చెయ్యలేదు. ఇక నిన్ను మానుంచి ఎవ్వరూ విడదీయలేరు .... " అనుకుంటూ లలితని చేరవేశాడు నెమ్మదిగా......

★

హయవాతా అద్భుతగాథ

31-వ పేజీ తరువాయి

వచ్చింది? ఇంకొక రెండురోజులుండి వెళ్లవచ్చునులే!" అన్నాడు.

'కాదు కొంచెం తొందరపని ఉంది! వెళ్ళాలి! మళ్ళీ ఎప్పుడయినా వస్తాను. ఇప్పటికి సెలవిప్పించండి.' అన్నాడు. అంతలోనే మిన్నెహాహా అక్కడికి వచ్చింది. ఆమె అడుగుల సవ్వడివినగానే హాయావాతాగుండె గుబగుబలాడింది. 'పోనీ ఇప్పటికయినా కంటపడింది! అదే పదివేలు!' అనుకున్నాడు. ఆ పైన మకారియో అందుకున్నాడు:

'సరే! నువ్వు అంత తొందరపని ఉన్నదంటే మరి నేనేమి చెప్పగలను! ఎప్పుడయినా తీరిక చేసుకుని తిరిగి ఇంకొకసారి ఇక్కడికి రా! మరిచిపోకేం! అయితే ఒక మాట! తలవని తలంపుగా దైవంలావచ్చి మా అమ్మాయి ప్రాణం రక్షించావు! దీనికి నీకెంతో ఋణపడ్డానని అనుకుంటున్నాను. వెళ్ళేముందు నీకేదయినా గొప్ప బహుమతీ ఇద్దామని నిర్ణయించుకున్నాను. నాదగ్గిర ఉన్న అమూల్యమయిన వస్తువు ఏదయినాసరే, నువ్వు కోరుకోవచ్చును! నిస్సందేహంగా అది నీకిస్తాను. కోరుకో!'

ఆ వాగ్దానం విని హాయవాతా పట్టరాని సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయినాడు! మొట్టమొదట మిన్నెహాహాని తనికిచ్చి వివాహం చేయవలసినదని అడుగుదామని అనుకున్నాడు. కాని అంతలోనే అతనికి శత్రువుల సంగతి జ్ఞాపకం వచ్చింది. వాళ్ళందిరిని జయించాలంటే మకారియో బాణాలు, వాటి రహస్యాలు కావాలి. అదీగాక మకారియో అమూల్యవస్తువన్నాడుగాని అమ్మాయినయినా సరే, అని బాహాటంగా వాగ్దానం చెయ్యలేదు. తీరా అడిగితే అలిగితి తెలియని తనవంటి పరదేశికి కుమార్తెనివ్వడానికంగీకరిస్తాడా? మిన్నెహాహానిచ్చి వివాహం చెయ్యడానికి వీల్లేదన్న తరవాత బాణాలడగడంకన్న ముందుగానే అవి అడిగితేనే మంచిదేమో!

అలాగ మరికొంతసేపు మథనపడినతరువాత తనకి ఉక్కుముక్కల్లాంటి కొన్ని బాణాలు, అవి తయారుచేసే రహస్యాలు కావాలని అడిగాడు. మకారియో ఆ కోరిక విని కొంచెం ఉలిక్కిపడ్డాడు:

మొదటిసారిగా కాశ్మీర్ వెళ్ళిన రామనాథంగారు మంచుని చూసి చాలా సంతోషించారు. విజయవాడలో "మా ఆవిడికి కొంచెం పంపించాలి," అన్నారు మిత్రునితో.

"అంతవరకూ ఉంటుందంటారా?" అని అడిగాడు మిత్రుడు.

"ఏమిటండి, మంచు కూడా దొంగిలించే వారుంటారంటారా?" రామనాథంగారు నవ్వుకున్నారు.

బి. స్వర్ణకుమారి (నెల్లూరు)

'నాయనా! ఈ బాణాలతో ఎలాంటి శత్రువులనయినా ఇట్టే జయించివెయ్యవచ్చును! అదీగాక వీటి తయారీరహస్యాలు తెలిశాయంటే ఇలాంటివి ఇంకా ఎన్నెన్ని వేలయినా తయారుచెయ్యవచ్చును! వాటితో నీవు శత్రుసైనికుల నందరిని అవలీలగా జయించివెయ్యవచ్చును! నీవంటి సామాన్య యోధుడికి ఈరహస్యాలు తెలియజెయ్యడం న్యాయం కాదు! ఇంకో బహుమతి ఏదయినా కోరుకో!'

అదే సమయంలో మిన్నెహాహా హాయవాతా వైపు రెప్పవాల్చకుండా చూసింది. అతని కిక ఏమనడానికి పాలుపోలేదు. 'పోనీ మిన్నెహాహా నిచ్చి వివాహం జరిపించవలసిందని అడుగుదామా!' అని అనుకున్నాడు. కాని శత్రుసంహారం ప్రప్రథమ కర్తవ్యమని నిశ్చయించుకున్నాడు:

'అయ్యా! మీదగ్గర ఉన్న చిత్రవిచిత్రమయిన బాణాలు, వాటి తయారీ రహస్యాలు అన్నీ నాకిప్పించాలి. నేనవి మీ శత్రువులకెవ్వరికీ తెలియనీయను. నేటినుంచే ఉపయోగిస్తుకుంటాను. ప్రతిరోజూ పదిజంతువుల్ని వేటాడి మీ కుటుంబం పోషించుకుంటాను. నాకింతకంటె వేరే కోరుకోవలసినదేది లేదు. ఆపైన మీచిత్తం! మొట్టమొదట మీరే ఇస్తానన్నారుగాని నే నడగలేదుకదా! మరి ఆమాట తప్పిన గౌరవమేదో మీరే దక్కించుకోండి!'

మకారియో కిక వేరేదారి కనబడలేదు. కొంచెంసేపాలోచించి మరి గత్యంతరంలేక హాయవాతా అడిగినన్ని బాణాలు, అవి తయారుచేసే రహస్యాలు ప్రసాదించినట్టు చెప్పాడు. అయితే ఇంకా కొన్ని మెళకువలు చెప్పవలసి ఉన్నదనీ మరునాటిదాకా ప్రయాణం వాయిదా వెయ్యమనీ సలహా ఇచ్చాడు.

హాయవాతా మకారియో ఔదార్యాని కెంతో సంతోషించాడు. అనేకవిధాల తన కృతజ్ఞత తెలియజేసుకున్నాడు. ఆనాటి సాయంత్రందాకా ఉండి మకారియోదగ్గర బాణాల ప్రయోగాలలో, తయారీలలో ఎన్నెన్నో కొత్తమెళుకువలు నేర్చుకున్నాడు.

తాను లోలోపల తలపెట్టిన పని నెరవేరినదని ఎంతయినా మురిసిపోయాడు. మరికొంతసేపలాగ గడిచిపోయిన తరవాత 'అయ్యో! మిన్నెహాహాని అడిగి ఉండవలిసినది. వీలులేదన్న తరవాత బాణాలసంగతి ఎత్తిఉండవలిసినది.' అని మళ్ళీ మథనపడ్డాడు.

ఆ వేళ రాత్రి భోజనాలవేళ మిన్నెహాహా అతని వైపయినా చూడలేదు! పిండివంటలు, మిగిలిన వంటకాలు అంటీ అంటనట్టు వడ్డించింది. ఎప్పుడైనా హాయవాతా వైపు ముఖం తిప్పినా బాగా కొరకొరలాడుతూ చూసింది. అప్పుడప్పుడా అందగత్తె చెక్కిళ్ళమీద ఒకటి రెండు కన్నీటిచుక్కలు దిగజారుతున్నట్టు హాయవాతా కనిపెట్టాడు. ఆమె కొనగోటితో అవి తుడిచివేసుకుంటున్నట్టుకూడా పసికట్టాడు. కాని చేయగలిగిన దేదిలేక ఉసూరుమని నిట్టూర్చి జరిగినదాని కెంతో పశ్చాత్తాపపడ్డాడు. అయితే పైపైకి అది కనపడనీయక మకొగియోతో కులాసాగా కబుర్లు చెబుతూ తన భోజనం ముగించుకున్నాడు.

ఆ రాత్రి పుచ్చపువ్వులా వెన్నెల కాసింది. ఉద్యానంలో పూలతీగల చిగుళ్ళమీద మెరుస్తున్న ఆ వెన్నెల కేసి చూస్తూంటే హాయవాతా కెంతసేపటికీ నిద్రపట్టలేదు. కొంచెం కన్నుమూతపడగానే మిన్నెహాహా అతని కెదురుగా ప్రత్యక్షమయింది! కళ్లు తెరిచి చూచాడు. ఆమె కనబడలేదు! 'కొంచెం కలతనిద్రలో కలవచ్చింది కాబోలు!' అని తమాయించుకున్నాడు. మరి కొంత సేపటికతని గదితలుపు లెవరో నెమ్మదిగా తట్టినట్టు వినబడింది! తటాలున లేచి తలుపు గడియతీశాడు. మెరుపులా మిన్నెహాహా ప్రత్యక్ష

హాయవాతా
అద్భుతగాథ

మయింది! హాయవాతా నిలువునా నిర్ఘాంతపడ్డాడు. అంతలోనే మిన్నెహాహా రుసరుసలాడుతూఅందుకుంది:

'నీ నిద్ర కంతరాయం కలిగించినట్లున్నానే!'

'లేదు! లేదు! మిన్నెహాహా! ఇదేమిటి? ఇంతటి అపరాత్రివేళ ఇలాగ వచ్చావు?'

'నీవు వట్టి కృతఘ్నుడివి! ఆ మాట చెప్పడానికే నేనిక్కడికి వచ్చాను. అంతకంటె వేరే రాచకార్యమేమి లేదు లేదులే!'

టీచరు: "ఏరా! ఈ క్లాసుకి నువ్వే పాఠం చెబుతున్నావా ఏమిటి?"

రాము: "లేదండి!"

టీచరు: "మరైతే నీకా పిచ్చవాగుడు ఎందుకు?"

వెంకటేశ్వరరావు (గుంటూరు)

'అదేమిటి మిన్నెహాహా! అలాగ మాట్లాడుతున్నావు! ఎంతో సాహసించి నిన్ను సంరక్షించానుగదా! ఇంతలోనే నేను చేసిన తప్పేమిటి?'

'నువ్వు రక్షించే దేమిటి? నేనా మాత్రం పది బారలు వేసి లేడిపిల్లతోబాటు కోనేటి ఒడ్డుమీదికి రాలేననుకొన్నావా?'

'మరి ఎందుకలాగ కేకలు పెట్టావు?'

'నేనే మొట్టమొదట ఆ లేడి పిల్లని బుజంమీది కెక్కించుకుని ఆ కోనేటిలో ఉరికాను! ఆ సమయంలో ఆపక్కనే ఉన్న నువ్వు నన్ను తప్పక రక్షిస్తావని తెలుసును! అలాగ రక్షించినతరవాత నీమీద మా నాయనగారికి జాలి కలుగుతుందనికూడా నాకు తెలుసును! అందుచేతనే నీమాట కాదవలేక ఆయన అడిగిన బాణాలన్నీ ఇచ్చారు. అవి తయారుచేసే రహస్యాలన్నీ చెప్పారు! లేకపోతే నువ్వు ఆయన దరిమానానికి కూడా వెళ్ళగలవా? ఆ పొదరింటిలో దాక్కున్నప్పుడు అబద్ధాలాడి నీప్రాణాలు రక్షించలేదా? అయినా అన్నీ మరిచిపోయావు 'ఏ వస్తువడిగినా ఇస్తా'నని మా నాయనగారంటే బాణాలిమ్మని అడిగావు! అంతేగాని పోనీ మాటవరసకయినా నన్నిమ్మని అడగాలని కూడా నీకు తోచలేదు! నువ్వింతటి కృతఘ్నుడవని అనుకోలేదు!'

మిన్నెహాహా చేతులతో ముఖం కప్పుకుని వలవలా ఏడ్చింది. హాయవాతా ఆ విచిత్రకథ విని తాను వింటున్నది నిజమేనా అని ఎంతో ఆశ్చర్యపడ్డాడు. ఆమె చేతులు రెండు పట్టుకుని 'మిన్నెహాహా! నువ్వు ఇంత గొప్ప ఉపకారం చేశావని నాకు తెలియదుసుమా! నిన్నిమ్మని మీ నాయనగారిని అడగాలనే అనుకున్నాను. కాని నావంటి సామాన్యుడికిచ్చి పెళ్లి చెయ్యరేమో అని చాలా అధైర్యపడ్డాను. పోనీ బాణాలయినా దక్కితే అదే పదివేలనుకొని ఆ సంగతి ప్రస్తావించాను. పోనిలే! మించిపోయిందేమిటి? మళ్లీ ఇంకొకసారి ఇక్కడికివచ్చి అడుగుతానులే! ఇకజన్మలో నిన్ను మరిచి పోగలనా?' అని అనేకవిధాల బతిమాలుకున్నాడు. మిన్నెహాహా తటాలున అతని చేతుల పట్టు విదిలించుకుని 'నీవంటి కృతఘ్నుడి ఇచ్చకాలు నమ్మేటంతటి వెర్రిబాగులదాన్ని కాదులే! పోపో! మరి నా కంటబడకు!' అని కసిరికొట్టి గిరుక్కున వెనక్కితిరిగి వెళ్ళిపోయింది!

ఇంకా ఉంది

వెండిమబ్బు

25-వ పేజీ తరువాయి

"ఇందిరా, ఇందిరా...ఆ..." అన్న లలితమ్మగారి పిలుపుతో లోపలకు వెళ్ళిపోయింది.

పడకమీద దిండునానుకుని కూర్చున్నారు లలితమ్మగారు.

ఆమె చాలా నీరసపడిపోయినట్లు, పాలిపోయినట్లు కనిపించింది ఇందిరకళ్ళకు.

తల్లికి ఏమి తక్కువ?

లలితమ్మగారిసేవకు మొత్తం "వెండిమబ్బు" సిద్ధంగా నిల్చుంది.

ఇక శుశ్రూష—దేవలోకంనుండి అమృతం తెమ్మన్నా రావుగారు సిద్ధమే. పాలు, పెరుగు, నెయ్యి సమృద్ధిగాఉన్నా ఒక్క మిల్లెడు నెయ్యికూడ జీర్ణించుకునే శక్తిలేదు ఆమెకు.

సకలసౌకర్యాలను సమకూర్చిన దేవుడు ఆమెకు ఆరోగ్యాన్నిమట్టుకు కరుణించలేదు. జరీచీరల, బంగారునగల భారానికి క్రుంగిపోయేది ఆమె. తల్లో పెట్టుకున్న పూలుకూడా ఆమెకు బరువే.

దేవుడు ఆమెకు కావలసినంత డబ్బు ఇచ్చాడు—ఆమె మందులకూ, డాక్టరులకూ. బీదతనమైనా భరించవచ్చుగాని ఆరోగ్యముండాలి అని బాధపడుతూండేవారామె.

ఒకవిషయంలో దేవుడు కరుణించాడు.

ఇందిర తల్లిలా దుర్బలురాలుకాదు.

తండ్రిలా దృఢశరీరంకలిగి ఆరోగ్యంగాఉండేది ఇందిర. ఆరోగ్యంవిషయంలో ఆమెకు ఆమే సాటి.

ఈమాత్రం కరుణించినందుకు ఆ భగవంతుడిని ఎంతో భక్తితో స్మరించేవారామె.

తన ఈ బిడ్డకూడ ఆరోగ్యంవిషయంలో తననుకాకుండా రావుగారిని పోలివుంటేచాలు అని దేవుడితో మొరపెట్టుకొనేవారామె రోజూ.

విధి తనను ఆహుతితీసుకున్నాసరే ఇందిరలా ఆరోగ్యంగాఉండే బిడ్డ కలిగితే చాలు అని అనస్తమానం తింగపడుతూండేది.

అలసటతో పడుకున్న తల్లినిచూసి ఇందిర హృదయం జాలితో నిండిపోయింది.

"పళ్ళరసం ఇవ్వనామ్మా?" అంది.

"ఒద్దు."

"అమ్మా, ఇంట్లో నీకు ఉపచారం చాలటం లేదు. 'నర్సింగ్ హోమ్'లో ఉంటే ఎలా?"

"ఊహు, నేను ఈ ఇల్లువదలి కదలను. చస్తే ఇక్కడే చస్తాను!"—అని లలితమ్మగారు ఖచ్చితంగా చెప్పేశారు.

ఇందిర తల్లినిశ్చయం మార్చటానికి యత్నించి విఫలురాలయింది. రావుగారికికూడా ఇందిర అభిప్రాయం నచ్చింది.

ఎప్పుడూలేనిది ఈవిషయానికి ఒప్పుకోకుండా మొండిపట్టుపట్టారు లలితమ్మగారు.

లలితమ్మగారిని పరీక్షించడానికి వచ్చిన డాక్టరుగారుకూడా, "ఆస్పత్రిలో ఉంచితే మంచిది" అనే సూచించారు.

కాని లలితమ్మగారు ఎవరిమాటా వినదల్చుకోలేదు.

ఆఖరుకు రావుగారు, 'సరే దైవేచ్ఛ ఎలాఉంటే అలా జరుగుతుంది' అని ఊరుకున్నారు.

అందరిచేత శుశ్రూషలందుకుని, మందులు సేవిస్తూకూడా లలితమ్మగారు ఆరోగ్యానికి దూరమవుతూవచ్చారు.

తండ్రీకూతుళ్ళకు దిక్కుతోచలేదు.

ఈ దుఃఖమయవాతావరణంలో ఇందిరకున్న ఒక్క ఆశాకిరణమూ మోహనుడి ఉత్తరం.

తల్లి అనారోగ్యాన్ని, అలసటనూ కాస్సేపు మరిపించగలిగేశక్తి ఒక్క మోహనుడి ఉత్తరానికి మాత్రమే ఉంది.

మోహనుడి ఉత్తరానికి జవాబు వ్రాయటం ఆమె పనుల్లో అతి ముఖ్యమైనది.

*　　*　　●

అతి దుర్బలురాలైన లలితమ్మగారు గర్భంలోని శిశువుకు చాలారోజులు ఆశ్రయం ఇవ్వలేకపోయారు. ఏడవనెలలోనే పురుడొచ్చింది.

"మగబిడ్డ" అన్నవార్త గదిబయటకు రాగానే తృప్తి, సంతోషాలతో నిట్టూర్చారు రావుగారు.

"ఏమిట్రా నీ ప్రశ్నలూ నువ్వూనూ! నా చిన్నతనంలో నేనూ మా నాన్నని ఇన్ని ప్రశ్నలు అడిగి ఉంటే ఏమయ్యేది?" తండ్రి కొడుకు మీద విసుక్కున్నాడు.

"ఏమయ్యేదీ! ఇప్పుడు నే నడిగిన వాటిలో కొన్నిటికైనా సమాధానం చెప్పగలిగేవాడివి" కుమారరత్నం శపీమని సమాధానం చెప్పాడు.

పి. వేణుగోపాల్ (పిఠాపురం)

తక్షణమే ఇందిర మిఠాయి పంచటానికి మొదలెట్టింది.

పుట్టయ్య మిఠాయి అందుకుని సంతోషంతో తింటూ, "అమ్మాయ్, నువ్వెప్పుడు మిఠాయి పంచటం?" అన్నాడు.

"ఇప్పుడే తీసుకో" అంది ఇందిర.

"ఇదికాదు. నీ పిల్లాడి జన్మోత్సవం మిఠాయి"

మరెపుడయినాఅయితే ఇందిరకు కోపం వచ్చేదే. ఈ సంతోషసమయంలో అలా చేయలేకపోయింది. నవ్వుతూనే

"ఇంకా కొన్నిరోజులు వేచిఉండాలి" అంది.

"కాని ఎక్కువరోజులు వేచిఉండేటట్టు చెయ్యకమ్మాయ్" అన్నాడు పుట్టయ్య.

"మీ క్కావలసింది మిఠాయా, నశ్యమా?"

"నోటి తీపికి మిఠాయి, ముక్కుతీపికి నశ్యం', పుట్టయ్య మాటకు మాట అందించాడు.

"అబ్బా! నీతో వేగలేం" అంది ఇందిర.

అత్యంతవైభవంగా బారసాల జరపాలనుకున్న రావుగారు లలితమ్మగారి అశక్తతమూలంగా ఆ ప్రయత్నాన్ని మానుకున్నారు.

లలితమ్మగారు మంచానికి అంటుకుపోయారు. తన సరదాలకోసం ఆమెను బాధపెట్టడం ఆయనకు ఉచితంగా తోచలా.

కాఫీతోటల కూలీలకు, బంధువర్గానికి పెద్దగా విందుచేశారు. సంతోషసమారంభంలో కూలీలకు ఒకవారం జీతం ఉచితంగా ఇచ్చారు.

కూలీలు ఆ డబ్బుతో త్రాగి తందనాలాడి 'వెండిమబ్బు' గడగడలాడేలా అల్లరిచేశారు.

"వీళ్ళకు డబ్బుగా ఇచ్చేందుకుబదులు వీళ్ళ పిల్లలకు గుడ్డలు కొనిపెడితే బాగుండేది" అని విచారించారు రావుగారు.

ఇందిరకుకూడా కల్లు అంటే తిరస్కారంఉంది. కాని ఈసమయంలో అందర్నీ క్షమించగలిగింది ఆమె. తమ్ముని ఆగమనంతో ఆమె ఆనంద పరవశురాలయింది.

ఏడవనెలలో పుట్టిన గిరిరాజా చాలా పీలగా ఉన్నాడు. వెచ్చటి గుడ్డలతో అతన్నిచుట్టి పడుకోబెట్టి ఆహారం ఇవ్వటం అతిప్రయాసంగా ఉండేది.

"రెండునెలలు ముందే వచ్చాడుగనక ఈ రెండు నెలలూ అతిజాగ్రత్తగా చూడాలి అతడిని" అని డాక్టర్‌కూడా చెప్పారు.

రోజుకు రెండుమార్లు డాక్టర్ వచ్చేవారు. ప్రత్యేకంగా ఒక నర్సు అక్కడే ఉండేది. ఇందిర సంగతి చెప్పనే అక్కర్లా. ఇలా లలితమ్మ, గిరిరాజాలకు ఉపచారం ఏలోపమూ లేకుండా సంతతమూ జరుగుతోంది.

గిరిరాజా పుట్టిన మర్నాడు ఇందిర తల్లిపక్క దగ్గర నిల్చుని మృదువుగా, "ఇప్పుడైనా ఆయనకు ఉత్తరం వ్రాయనా అమ్మా?" అంది.

వాడినమొహంలో చిరునవ్వు చిందింది. ఆమె కూతురిమొహమే తదేకంగా చూస్తూ, "ఊ" అన్నారు.

ఇందిర ఇహ అక్కడ నిల్చోలేదు. తన గదికి పారిపోయింది. కాగితం, కలం తీసుకుని ఇలా రాసింది.

'మోహన్ !

నాకో చిన్నారి తమ్ముడు, మీకు బావమరిది పుట్టాడు. అచ్చం నాలాగే ఉన్నాడు. నాకెంత సంతోషంగా ఉందంటే—ఇక ఏమీ రాయటానికి తోచటంలా! వస్తాను. సెలవ్.

మీ ఇందిర'

ఇందిర ఆత్రంగా కవరు పుట్టయ్యచేతికిచ్చి "ఇప్పుడే పోస్టు చేసేయ్" అంది.

"ఇపుడేనా? ఇలాగా?"

"ఊ, ఊ, ఇపుడే"

ఆమె ఆత్రాన్నిచూసి పుట్టయ్యకు నవ్వొచ్చింది. కవరు ఇందిరకు చూపి, "అడ్రసే రాయలేదు........ నీ మోహనుడు అమెరికా అధ్యక్షు డనుకున్నావా?" అన్నాడు.

ఇందిర అతడి చేతుల్లోనుండి కవరు లాక్కుని అడ్రసు రాసిచ్చింది.

"ఇపుడే పోస్టు చేసేయ్. మరవకు" అని మళ్ళీ గట్టిగా చెప్పింది.

"నేను ఎప్పుడువేసినా ఆ టైముకేకదమ్మా పౌ గన్ తీసుకునివెళ్ళేది."

ఆ ప్రశ్నయ్యమాట వినిపించుకోకుండా ఇందిర అప్పుడే లోపలకు వెళ్ళిపోయింది.

తల్లిదగ్గరకువెళ్ళి,

"అమ్మా, ఆయనకు ఉత్తరం వ్రాశాను. ఆయన చాలా సంతోషిస్తారు" అంది.

లలితమ్మగారు మాట్లాడలేదు.

కూతురికి ఏదో చెప్పాలని ప్రయత్నించి, చెప్పలేక కళ్ళనీళ్ళు పెట్టుకుని మొహం త్రిప్పుకొన్నారామె

తమ్ముడు వచ్చాక ఇందిరకు తీరికంటూలేదు. గిరిరాజా పోషణకోసం నర్సును పెట్టుకున్నా ఇందిరే తమ్ముడి పోషణభారం వహించేది.

తమ్ముడికి టైముకు సరిగ్గా పాలుపట్టడం, నీళ్ళుపోయడం, గుడ్డలు మార్చడం ఈ పనులన్నీ ఇందిరే ఎంతో సంతోషంతో, ఉత్సాహంతో చేసేది.

రాత్రిళ్ళుకూడా రెండు మూడుమార్లు లేచివచ్చి తమ్ముడు ఉయ్యాల్లో సుఖంగా నిద్రపోతూండడం చూసి వెళ్ళేది.

తమ్ముడికి నర్సు పౌడర్‌వేస్తే, ఇందిరకు నచ్చేది కాదు

"నర్సుకు పౌడర్ వేయటంరాదు. బూడిద పూసినట్టు పౌడర్ మెత్తుతుంది" అని తనే మృదువుగా పౌడర్ రాసేది.

పనిమనిషిని బిడ్డకు నీళ్ళుపొయ్యనిచ్చేదికాదు. చాలా వేడిగా నీళ్ళుపోస్తే?

పాలు త్రాగించటానికి మనుష్యులున్నా, ఇందిర వాళ్ళనెవర్నీ నమ్మేదికాదు.

బిడ్డను ఎవరికి అప్పచెప్పటానికి ఇష్టపడేదికాదామె—తల్లికి మినహా. తమ్ముడి విషయంలో పనివాళ్ళ నెవర్నీ నమ్మేదికాదామె. పాలబుడ్డి కూడా తనే స్వయంగా కడిగి శుభ్రపర్చేది.

పనివాళ్ళు శుభ్రంగా కడక్కుండా అశ్రద్ధచేస్తే!

పాలబుడ్డి శుభ్రంగా కడగకుండా వాడితే పిల్లలకు 'లివర్' వస్తుందని ఎక్కడో విన్నది ఇందిర.

అక్కయ్యపోషణలో పిల్లగాపుట్టిన గిరిరాజా రోజురోజుకూ ఒళ్ళుచేసి బొద్దుగా పెరుగుతున్నాడు.

కాని, లలితమ్మగారి ఆరోగ్యంమాత్రం బాగుపడటంలేదు. గిరి శుక్లపక్షచంద్రునిలా వృద్ధి పొందుతూఉంటే ఆమె కృష్ణపక్షం చంద్రునిలా క్షీణింపజొచ్చారు.

రావుగారూ ప్రయత్నానికి వెనకాడలేదు. కాని, లలితమ్మగారుమాత్రం తేరుకోలేదు. లలితమ్మగారికి ఇంత అస్వస్థతగా ఉన్నపుడు మోహనుడి ఉత్తరం వచ్చింది.

ఉత్తరాన్ని తల్లిచేతికిచ్చింది ఇందిర. ఆమె చదవడానికి ప్రయత్నించింది. కాని, మసక మసగ్గా కనిపించాయి అక్షరాలు.

"నువ్వే చదువుతల్లీ. నాకు సరిగ్గా కనిపించటంలేదు" అన్నారామె.

ఇందిర చదివింది.

"ఇందిరా!

నీ ఉత్తరం అందింది. నాకో బావమరిది పుట్టటం నిజంగా చాలా సంతోషకరమైన విషయం. మీ తల్లిగారు కులాసాగా ఉన్నారని ఆశిస్తాను.

మోహన్"

లలితమ్మగారికి ఉత్తరం తృప్తినివ్వలా. ఎందుకో రసవిహీనంగా, చప్పగా ఉన్నట్టనిపించింది.

"ఇంతేనా వ్రాసింది?"—కూతుర్ని అడిగారామె.

"ఊఁ"

"ఇంకేమీ రాయలేదా?"

"లేదు."

నిరాశతో లలితమ్మగారు మాట్లాడకుండా అటు తిరిగి పడుకున్నారు.

ఇందిర మోహనుడికి ఉత్తరం వ్రాయటానికి కూర్చుంది.

వెండి మబ్బు

"ఒక గడియారం టైముకీ, మరో గడియారం టైముకీ బొత్తిగా పొంతన కుదరకుండా ఉందేమిటండీ!" వీధిలో ఉన్న నాలుగు గడియారాలు చూసిన కామయ్యగారు తమ వెంట వచ్చిన పెద్దమనిషితో అన్నారు.

"నిజమే ననుకోండి. కాని అన్ని గడియారాలు ఒకే టైము చూపిస్తే, అన్ని ఎందుకు ఒక్కటి చాలదుటండీ!" పెద్ద మనిషి తాపీగా సమాధానం చెప్పాను.

ఆర్. రమాదేవి (పార్వతీపురం)

తల్లి ఆరోగ్యాన్నిగురించి తన మనస్సులోని కలవరాలన్నంతటినీ తెలియబర్చింది. ప్రతిగా సానుభూతి నాశించిందామె హృదయం

తల్లిముందు, తండ్రిముందు ఇందిర ఎంతో ధైర్యంగాఉన్నా, ఈసారి తల్లి బ్రతుకుతుందనే నమ్మకం లేదామెకు.

అందరికీ ధైర్యంచెప్పి, తన అబద్ధాలమాటలు తనే నమ్మటానికి ప్రయత్నించి విఫలురాలయింది ఇందిర.

ఈ ఆత్మవంచన ఇంకెన్నిరోజులు?

తల్లి ఆరోగ్యం రోజురోజుకూ దిగజారుతున్న సంగతి స్పష్టంగా కనిపిస్తూనేఉంది

గిరిరాజా, ఇందిరలకన్నా రావుగారు ఎక్కువ అసహాయులూ, అనాథులైపోయారు. ఆయన ముఖంలోని వెలుగు మాసిపోయింది. ఈ స్థితిలో తండ్రి మొహాన్ని చూస్తూంటే ఇందిర కడుపు తరుక్కుపోతోంది.

ఒకరోజు సాయంకాలం లలితమ్మగారికి అప్పుడే నిద్రపట్టింది. అది చూసి, తండ్రి కూతుళ్ళిద్దరూ బయటకు వచ్చారు.

"ఇందిరా అలా బాల్కనీలోకి పోదాం రా"

మౌనంగా తండ్రి ననుసరించింది ఇందిర.

ఒకర్నొకరు చూచుకోకుండా కూర్చున్నారిద్దరూ. ఆఖరికి రావుగారే,

"ఇప్పుడెలా ఉందంటావు ఇందిరా మీ అమ్మకు?" అన్నారు.

ఇందిర ఎటో చూస్తూ, "ఇప్పుడు కొంచెం నయం" అంది.

"ఈ మాట అబద్ధమని మనిద్దరకూ తెలుసు"

ఇందిర మాట్లాడలేదు.

"నీ పెళ్ళికోసం తహతహలాడిపోతోంది లలిత. ఎప్పుడూ ఆ బెంగతోనే కుమిలిపోతోంది."

"అయితే ఏం చేద్దామంటారు?"

"మోహనుడిని పిలిపించి పెళ్ళి చేస్తే....."

"నాన్నా!"

"అవునమ్మా. నిన్నటినుంచి ఈ సంగతే చెబ్దామనుకుంటున్నా. ఫ్లేనులో అతన్ని రప్పించి పెళ్ళి జరిపించి మర్నాడే పంపిస్తాను. లలిత ఆఖరుకోరిక నెరవేర్చకుండా ఉండలేను. ఎంత డబ్బైనా వెనుదీయను."

"కాని, నాన్నా పెళ్ళిజరిగితే లేచి కూర్చునే ఓపిక కూడా అమ్మకులేదు. అలా అని అమ్మ ఊరుకోనూ ఊరుకోరు. ఎలాగో ఒకలా లేచి తిరిగి పెళ్ళి గడబిడలో మళ్ళీ ఆయాసం ఎక్కువ చేసుకుంటుంది. అమ్మకు తగ్గదని ఎందుకనుకోవాలి నాన్నా? అమ్మ ఎందుకని బ్రతకదు? ఆమెకోరిక పూర్తిచేస్తే ఇక ఏచింతాలేదని నిశ్చింతురాలై ప్రాణం వదిలేయచ్చు. నా పెళ్ళిచూడాలనే ప్రబలమైన ఇచ్ఛే ఆమెను బ్రతికించవచ్చు. పెళ్ళి చేసేస్తే నిద్రమత్తులో తూలేవాడికి పక్కవరిచినట్టవదా నాన్నా?"

"కాని ...... కాని ...... ఆ కోరిక తీరకుండానే లలిత వెళ్ళిపోతే నేనెలా భరించను ఇందిరా?"

"అశుభాన్ని చింతించవద్దు నాన్నా. కొంచెం వయస్సయ్యాక కానుపు వచ్చినందువల్ల దుర్బలంగా ఉంది. కోలుకున్నా కోలుకోవచ్చుగదా నాన్నా? ఒకవేళ నువ్వు మోహనుడిని పిలిపించావే అనుకో, అక్కడి పరిస్థితి ఎలాఉందో ఏమిటో? తొందరపడకు నాన్నా. ఆలోచించు. అమ్మకోరిక తీర్చాలని నాకూ ఉంది. కావాలంటే ఒకమాట అమ్మనుకూడా అడుగు. "ఏం చెపుతుందో చూద్దాం—" అంది ఇందిర.

"సరే. నేనే అడుగుతా. లలిత సరేనంటే నీకు అభ్యంతరం ఏమీలేదుకదా?"

"లేదు"

మోహనుడిని కలుసుకుంటాననే భావనతో ఆమె హృదయం ఉప్పొంగిపోయినా, సగంలో అతడిని పిలిపించుకోవాల్సివచ్చిన పరిస్థితి ఆమెను వ్యథపర్చింది.

"మోహన్, ఎలాంటి పరిస్థితిలో నిన్ను కలుసుకోవాల్సివచ్చింది"— అని మూలిగింది ఆమె మనస్సు.

రాత్రి ఎనిమిదిగంటల ప్రాంతంలో రావుగారు లలితమ్మగారి గదిలోకి వెళ్ళినపుడు గిరిరాజా దోమ

తలవాటుగా పోయినా పడుకుని నిద్రపోతున్నాడు. రావుగారు దోమతెర కొద్దిగా తొలగించి బిడ్డను కాస్సేపుచూసి భార్యవైపు చూశారు. లలితమ్మగారు తదేకంగా భర్తనే చూస్తూ ఉన్నారు.

రావుగారు చిరునవ్వు నవ్వి, "గిరి బొద్దుగా పెరుగుతున్నాడు. నెలపిల్లాడు అప్పుడే ఎలా ఉన్నాడో చూడు" అన్నారు.

లలితమ్మగారు గర్వంతో, "వాడికోసం తక్కువ కష్టపడ్డానా నేను? నా సర్వస్వాన్ని ఇచ్చాను. ఇహ ప్రాణం ఇవ్వటం ఒకటే మిగిలింది" అన్నారు.

రావుగారు మంచం చివర కూర్చుని ఆమె దుర్బల హస్తాన్ని తమ చేతిలోకి తీసుకుంటూ గద్గదస్వరంతో "అలా అనకు లలితా. నే నీ దుఃఖాన్ని భరించలేను" అన్నారు.

"ఆ 'రోజు' ఎదుర్కోవటానికి సిద్ధంగా ఉండండి. అది ఇంకెంతోదూరం కూడా లేదు."

"నేను నిన్ను బ్రతికించుకుంటాను లలితా — ఎలాగైనాసరే."

లలితమ్మగారు భర్తవైపు చూసి, చిలిపిగా నవ్వారు.

"మీ కెంత పిచ్చి! నన్ను బ్రతికించుకోవడమా? "వెండిమబ్బు"నే విడిచిపుచ్చినా మీరు నన్ను బ్రతికించుకోలేరు. నేను లేకపోతేమాత్రమేం? ఇందిర ఉంది. గిరి ఉన్నాడు.... ."

"వాళ్లెవరున్నా నువ్వున్నట్లు ఉంటుందా నాకు లలితా?"

"ఉండదు. కాని అదో పెద్దలోపం కాదు. పిల్లలు జాగ్రత్త అని నేను చెప్పనే అక్కర్లేదుకదా."

"లలితా, నేనెలా ఉండను లలితా?"

"చెప్పనా?"

"ఊఁ"

కాంతిహీనమైన ఆమె కళ్ళు చిలిపితనపు కాంతితో మెరిశాయి.

"ఇంకోపెళ్ళి చేసుకోండి."

"ఒక్కటి చాలా?"

"రెండు పెళ్ళిళ్ళు చేసుకుంటే ప్రభుత్వం శిక్షిస్తుంది."

"నువ్వు నన్నువదలి వెళ్ళిపోవటంకన్నా వేరే కఠినమైన శిక్ష ఏముంది నాకు?"

"ఏంచేయను? నాకుమాత్రం ఇప్పుడు మిమ్మల్నందరినీ విడిచిపోవాలనుందా? లేక లేక పుట్టిన అబ్బాయి, కూతురు, దేవుడులాంటి మీరు, వెండి మబ్బు, మెరపుతార—అన్నీవదిలి నేనుమాత్రం ఎలా వెళ్ళను? కాని విధి ముందు మన ఆటలు ఏంసాగవు"

"ఇంత అందమైన జీవితాన్ని వదలి మృత్యుముఖంలోపడటం నాకూ కష్టమే... ఉ . ..పునిస్త్రీ చావు.. ......ఎంతమందికి ఆ అదృష్టం లభిస్తుంది? నా కాపురం పచ్చగా ఉన్నపుడే పసుపు కుంకుములతో చావటం అదృష్టమే. కాని నా కోరిక అల్లాగే ఉండిపోయింది."

"ఇందిరపెళ్లేనా?"

లలితమ్మగారు అవునని తల ఊపారు.

"లలితా, నీ కళ్ళముందే ఇందిరపెళ్ళి జరిపిస్తాను. సరేనా?"

"ఎలా, ఎలా........" అంటూ లలితమ్మగారు ఉద్వేగంతో లేచి కూర్చోబోయారు.

"లేవకు......పడుకొనే మాట్లాడు......"అంటూ రావుగారు సగం పైకిలేచి ఆమెను మెల్లిగా పడుకోబెట్టారు.

భావోద్వేగంతో పాలిపోయిన ఆమె ముఖంమీద స్వేదబిందువులు మెరిశాయి.

"కొంచెం విశ్రాంతి తీసుకో. నెమ్మదిగా చెపుతాను. ఇందిరపెళ్ళి చూడాలని ఆశిస్తున్నావా?"

"అవును. అందుకే నేనింకా బ్రతికిఉన్నాను."

"అయితే నే నిందిరకు పెళ్ళిచేయను" రావుగారు నిశ్చితంగా చెప్పారు.

"ఏం?"

"ఇందిరకు పెళ్ళి చేసేస్తే నువ్వు ఇంక బ్రతకక్కర్లేదనుకుంటావేమో!"

నాకు స్వచ్ఛంద మరణశక్తి ఉందనుకుంటున్నారా" లలితమ్మగారు నవ్వడానికి ప్రయత్నించారు.

"లలితా, మోహనుడు వచ్చేవరకూ ప్రాణం నిలుపుకోలేవా?"—రావుగారు దీనంగా ప్రశ్నించారు.

"అంతా నా చేతిలోనే ఉన్నట్టు మాట్లాడుతున్నారే?"

"మనస్సుకు మించింది ఏముంది?"

"మృత్యువు"

"నువ్వు బ్రతుకుతావనే నమ్మకు లలితా. చావు సంగతే ఆలోచించకు. ఇందిర, గిరి ఇద్దరికి పెళ్ళి చేసి తరువాత మనిద్దరం ఒకేసారి చనిపోదాం"

లలితమ్మగారు "గిరిపెళ్ళి!" అంటూ నవ్వారు.

"ఇందిరవివాహం అతివైభవంగా జరిపించాలనుకుంటున్నాను. అబ్బాయికి ఏ వస్తువూ లేదనకుండా అన్నీ తెప్పించి ఇస్తాను. వింటున్నావా... ."

లలితమ్మగారు కళ్ళు మూసుకుని కూతురి పెళ్ళి వివరాన్ని భర్తనోటివెంట వింటున్నారు.

"ఇందిరా, మోహన్........" అస్పష్టంగా ఉచ్చరించిందామె.

రావుగారు చాలాసేపు మాట్లాడుతూనే ఉన్నారు. భార్యవైపు చూసేసరికి ఆమె జోలపాటవిని నిద్రించే పసిపాపలాగా ఆయన తియ్యటిమాటలు వింటూ నిద్రించింది. ఎండిన పెదిమలమీద చిరునవ్వు చిందుతూఉంది.

మర్నాడు ఉదయం గంట ఎనిమిదయినా లలితమ్మగారు లేవలేదు.

నిద్రపోతోంది. ఎందుకులేపటం—అని అందరూ ఊరుకున్నారు.

తొమ్మిదయినా ఆమె లేవకపోయేసరికి రావుగారిగుండె దడదడలాడింది. ఇక నిలువలేక వెళ్ళి మంచందగ్గర నిల్చుని మృదువుగా "లలితా!" అన్నారు.

ఆమె నుదుటిమీద చెయ్యివేసినపుడే లలిత ఇహ లేదని తెలిసింది. ఆయన తన చైతన్యాన్నంతా కోల్పోయి కూలబడ్డారు.

(సశేషం)

వచ్చేవారం ప్రారంభం!

'చిత్రవ్యక్తులు'

రచన:

సుకుమార్

20-7-'62 ఆంధ్రసచిత్ర వారపత్రికలో ఒక సరికొత్త సినిమా శీర్షిక ప్రారంభిస్తున్నాము. '(సి)నీలిచంద్రిక' రచయిత సుకుమార్ ఈ శీర్షిక క్రింద చిన్న వ్యాసాలద్వారా కొందరు (చలన)చిత్ర వ్యక్తులను పాఠకులకు పరిచయం చేస్తారు. ఈవ్యాసాలతో పాటు 'రూప' ఫోటోలు కూడా కొన్ని ప్రచురిస్తాము.

సినిమా అభిమానులకు ఈ వ్యాసాలు తప్పకుండా నచ్చుతాయని మా నమ్మకం!

హంతకుని ఆత్మహత్య

23-వ పేజీ తరువాయి

వాషింగ్టన్ (డి. సి.)వచ్చింది. అప్పటి కామెకు పదహారేళ్ళు ఉంటాయి. దేశం ఆర్థికమాంద్యానికి గురియైన కాలమది. మేరీ 'సునాయాసంగా డబ్బు సంపాదన' ప్రారంభించింది. అంతకంటే బ్రతుకు తెరువు దొరకకనో, ఇతరుల బలవంతంవల్లనో, ఏమైతేనేం ఆమెకు ఆ వృత్తే శరణ్యం అయింది.

దాదాపు అప్పుడే ఓ పాతికేళ్ళ యువకుడు వాషింగ్టన్‌లో ఏపనిదొరకక తంటాలు పడుతున్నాడు. వ్యభిచారగృహాలకు అమ్మాయిలను సరఫరాచేసి, డబ్బు సంపాదించడం మొదలుపెట్టాడు. అతడే చామర్స్ లాంబాగ్.

లాంబాగ్ చేస్తున్నపనికి, మేరీ వృత్తికి సంబంధం ఉంది కాబట్టి వాళ్ళిద్దరూ ఎప్పుడో ఒకప్పుడు పరిచయం కాకతప్పదు. అదే జరిగింది. 'ప్రేమ' అనే మాటకున్న విస్తృతార్థంలో వాళ్ళు ప్రేమించుకున్నారు కూడాను! అయితే ఆ ప్రేమకు వారి వారి పరిస్థితులవల్ల పరిమితులు ఉండనే ఉండేవి.

ఇలా కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి. విడివిడిగా ఉన్నప్పుడుగాని, కలసిఉన్నప్పుడుగాని ఈ కాలంలో వాళ్ళ జీవయాత్ర ఎలా సాగిందో తెలుసుకునేందుకు ఆధారా లేమీలేవు. పెళ్ళిమాత్రం కాలేదు. ఇద్దరూ తమతమ వృత్తులు కొనసాగించుకున్నారనే అనుకోవలసి వస్తుంది.

బహుశా ఆకాలంలో వీళ్ళు నాలుగు రాళ్ళు చేసుకున్నా చేసుకుని ఉండవచ్చు. అప్పట్లో పరిస్థితులు అందుకు అనుకూలంగా ఉండేవని పోలీసు రికార్డులు తెల్పుతున్నాయి. ప్రభుత్వ సంస్థలలో వేలాది కార్మికులకు కొత్తగా పనులు దొరికాయి. వీరిలో చాలామంది భార్యాపిల్లల్ని వదలి ఒంటరిగా వాషింగ్టన్ వచ్చినవారే. వేలకొద్దీ స్త్రీలుకూడా ఒంటరిగా వచ్చి వాషింగ్టన్‌లో కాలక్షేపం చేస్తూ ఉండేవారు.

చామర్స్‌లాంబాగ్, అతడి ప్రియురాలు మేరీ 1938 ప్రారంభంలో పోలీసుల రికార్డులలోకి ఎక్కారు. లాంబాగ్‌కు ఇప్పుడు ముప్ఫైఏళ్ళపైన ఉన్నాయి. పెద్ద ఎత్తున వ్యాపారం సాగిస్తున్నాడు. పడుపువృత్తికోసమని వయసులోఉన్న అమ్మాయిలను పొరుగు రాష్ట్రాలకు పంపుతున్నాడని ఎఫ్. బి. ఐ. అధికారులు అతడిమీద నేరారోపణ చేశారు. 'మాన్ ఆక్ట్' క్రింద అరెస్టుచేసి న్యాయస్థానానికి పంపారు.

మేరీ సాక్ష్యం

కేసు విచారణ ప్రారంభమైంది. నేరారోపకుల ప్రధానసాక్షిగా మేరీ కోర్టుకు వచ్చింది! బహుశా అంతకుముందు లాంబాగ్, మేరీల మధ్య ప్రణయ కలహం వచ్చిఉంటుంది. ఏమైతేనేమి ఆమె సాక్ష్యం అతడి నేరాన్ని ధృవపరచింది. కాని లాంబాగ్‌కు కోర్టువారు జైలుశిక్ష విధించేసరికి, ఆమె గగ్గోలు ఎత్తిపోయి, తాను అబద్ధాలు చెప్పానని మొరపెట్టుకుంది—ఫలితం తప్పుడుసాక్ష్యం చెప్పినందుకు మేరీకికూడా శిక్షపడింది. కాని కోర్టువారు త్వరలోనే శిక్ష రద్దుచేసి, ఆమెను విడిచిపెట్టారు.

మేరీ మొదట చెప్పిన సాక్ష్యాన్ని ఉపసంహరించుకున్నా లాంబాగ్‌కు విధించబడిన శిక్షమాత్రం మారలేదు. అతడికి పదేళ్ళు కారాగారశిక్ష వేసి, అక్కడ సవ్యంగా ప్రవర్తిస్తే కొంతకాలం తగ్గించే అవకాశం కల్పించారు. జైలుకువెళ్ళేముందు లాంబాగ్ మేరీని కలుసుకున్నాడు. తనకేమీ కోపంలేదని ఆమెతో చెప్పాడు. శిక్ష పూర్తికాగానే ఆమెదగ్గరకే వస్తానన్నాడు. ఎనిమిదేళ్ళు ఇట్టే గడిచిపోయాయి. 1946 సెప్టెంబరు 22 వ తేదీన లాంబాగ్ విడుదలయ్యాడు. ఐదురోజుల తరవాత లిటిల్‌సిల్వర్ (ఎన్. జె.)లో మేరీ, ఆమె భర్త ఉన్నగదికి వచ్చాడు.

* * *

లాంబాగ్ లిటిల్ సిల్వర్‌నుండి మేరీని అపహరించుకునిపోయిన కొన్ని వారాల తరువాత న్యూజర్సీ రాష్ట్రం పోలీసులకు ఈ వివరాలన్నీ తెలిశాయి. విటిలో చాలావరకూ మేరీ తన భర్తకు చెప్పినవే. మిగతా విషయాలు ఎఫ్. బి. ఐ. రికార్డులనుంచి, కోర్టు రికార్డులనుంచి తెలిశాయి.

మేరీ, లాంబాగ్‌లకోసం పోలీసులు దేశమంతటా గాలించారు. వాళ్ల ఫోటోలు, వేలిముద్రలు, ఇతర వివరాలు పత్రికలలో వేశారు. రేడియోలో వర్ణించి చెప్పారు. లాంబాగ్ ఒక కారు దొంగిలించి లిటిల్ సిల్వర్‌కు వెళ్ళాడని, అక్కడ మేరీని అపహరించి పరారయ్యాడనీ తెలిసింది. ఆకారు వివరాలుకూడా పోలీసులకు అందాయి.

నవంబరు మొదటివారంలో—నేరం జరిగిన ఆరువారాలకు—పోలీసుల అన్వేషణ ముగిసింది. రెడ్‌బ్యాంక్‌కి అరవైమైళ్ళదూరంలోఉన్న అడవిలో ఒక కారు దిక్కూ దివాణం లేకుండా పడిఉన్నదని వేటకు వెళ్ళివచ్చినవారు పోలీసులకు చెప్పారు.

వెంటనే పోలీసులు అక్కడికివెళ్ళి అది లాంబాగ్ దొంగిలించినకారేనని గుర్తుపట్టారు. పోలీసుదళం అధికారుల సహాయంకోరి, విమానంమీద అరణ్యగర్భంలోకి వెళ్ళారు. అక్కడ కారుకి కొద్దంత దూరంలో రెండు శవాలు కనిపించాయి.

లాంబాగ్, అతడు అపహరించుకునివచ్చినఅమ్మాయి అక్కడే ఒక దుంగమీద కూర్చుని చాలాసేపు కబుర్లు చెప్పుకున్నారని పోలీసులు ఊహించారు. (అక్కడ కనిపించిన సిగరెట్‌ముక్కలే ఈ ఊహకు ఆధారం) తరువాత ఇద్దరూ దుంగ నానుకుని నేలమీద ప్రక్కప్రక్కగా కూర్చుని ఉన్నప్పుడు లాంబాగ్ తన కోటు మేరీమీద కూడా కప్పిఉంటాడు. అప్పుడే అతడు ఆమెతలకు పిస్టల్ గురిచేసి కాల్చి ఉండవచ్చు. తరవాత ఆ పిస్టల్‌తోనే తన తలమీద ప్రేల్చుకుని ఆత్మహత్య చేసుకుని ఉంటాడు.

చామర్స్‌లాంబాగ్, సార్జంట్ భార్యను అపహరించి హత్య చేశాడనీ, ఆతరవాత ఆత్మహత్య చేసుకున్నాడనీ, కొరోనర్ కోర్టు జ్యూరీ తీర్పు చెప్పింది. నిజానికి ఇంకోవిధంగా తీర్పు చెప్పే అవకాశం కూడా లేదేమో! ★

విడీ విడని చిక్కులు

17-వ పేజీ తరువాయి

మీనాక్షి ఉలిక్కిపడి యేదో సమాధానం చెప్పబోయి బుస్సున చూసింది సూర్యాన్ని. అతగాడి చేతి ఖాళీ కప్పు నందుకుని వివవిస కిందికి వెళ్లిపోయింది.

సూర్యం అంతలో మీనాకి వెళ్లిపోవడాన్ని అర్థం చేసుకోలేక బేలపడిపోయేడు.

మీనాక్షి క్రిందికి వినవిన వెళ్లిపోయి కప్పు కడుగుదా మనుకుంది కాని, వుక్రోషంతోనూ, యీర్ష్యతోనూ ఆమెకి దాన్ని నేలకేసి కొడదా మనిపించింది.

ఆమెలోని ఉత్తమ సంస్కారం, ఆమె నంత పని చెయ్యనివ్వలేదు.

అంతలో రాజ్యలక్ష్మి వచ్చింది. ఒళ్ళు మండిపోయింది మీనాక్షికి.

"అదిగో, ఆ మేడ మీదున్నాడు. నీ కోసరం కలవరిస్తున్నాడు. వెళ్లు రాజూ !"—అన్నది. ఆమె కంఠంలోని వ్యంగ్యం రాజ్యలక్ష్మికి అర్థం అయిందో లేదో తెలీదు కాని" ఉహూఁ, వెళ్లనక్కా !" అన్నది అమాయకంగా సిగ్గుపడుతూ.

మీనాక్షికి ఆదోలా అనిపించింది. "రా ! కాఫీ తాగుదాం" అన్నది జాలిపడి.

"నిర్మలక్కయ్య తాగిందా !" అన్నది. బితుకు బితుకు మంటూనే అడిగింది రాజ్యలక్ష్మి.

మీనాక్షికి మనసు నొచ్చుకుంది.

అయితే ఆపిల్ల చదువుకున్నది. పరిస్థితులను తరిచి చూడనిదే యితరులను నొప్పించలేదు.

"ఇదో యిస్తానం" ది సాధ్యమయినంత సరళమైన కంఠంతో.

చిన్నప్పటినుండీ, బడీ, కాలేజీ చదువూ, సినీమాలూ యివే అవడం నుంచి సంసారిక మర్యాదలు తనకు తెలియవు. వాటిని చిన్నదైనా, రాజ్యలక్ష్మి నేర్పుతున్నది కదా ? మీనాక్షి ఆర్ద్ర భావంతో రాజ్యలక్ష్మి తల నిమిరింది.

బేలమొహం పెట్టి "నువ్వు మంచిదానివక్కా" అంది రాజ్యలక్ష్మి.

"ఎందుకనో ?" అడిగింది మీనాక్షి కాఫీ కప్పులో పోసి తదేకంగా దానికేసి చూసి, దాన్ని రాజ్యలక్ష్మికేసి నెట్టి.

"మరి నువ్వు లేకపోతే యిప్పుడెంత యిబ్బందయ్యేది ?"

సిగ్గు నభినయిస్తూ కాఫీ తాగింది రాజ్యలక్ష్మి.

"అయితే లక్ష్మి నీకు పెళ్లి చేసేస్తారుట ?" మీనాక్షి కుతూహలంతో వేసిన ప్రశ్నకి కర్రదెబ్బ తిన్న లేడిపిల్లలా బాధతో ఉలిక్కిపడది రాజ్యలక్ష్మి "వుహూఁ" అని తలకాయ త్రిప్పింది.

"నువ్వు చేసుకోనని చెప్పేశావా ?"

తానాపిల్లకి కలిగించేనన్న బాధని గుర్తించింది గాని మీనాక్షి దానికి ఉపశమనం యెలా కలిగించాలో తెలుసుకోలేక పోయింది.

"లేదక్కా" అంది బేలమొహం పెట్టి రాజ్యలక్ష్మి.

అంతలో "ఏమే రాజూ !" అని నరసమ్మగారి పీరసమైన పిలుపు రావడంతో రాజ్యలక్ష్మి లేచి గబగబ అవతలికి వచ్చింది.

"ఇదేం పాపమే ! యింత అర్చుకుపోయావూ? ఎముకలు, దుమ్ములూ .... శల్యమై పోయావేమే" .... నీరసమైన చేతో రాజ్యలక్ష్మి తల నిమిరింది ఆమె.

"మీ వొంట్లో బాగుందికదూ" అన్నది రాజ్యలక్ష్మి మంచంపట్టెమీద అనుకుని నేలమీద కూచుంటూ ?

అంతలో నిర్మల వచ్చింది.

రాజ్యలక్ష్మి మొహంలో అందుకే యెదురు చూస్తున్నదా అన్నట్లు సంతోషం వెలిగింది.

"చూడు నువ్విక్కడ కూచుని కబుర్లు చెబుతున్నావు .... అవతల పిన్నిగారు కన్నూ గుడ్డూ యెర్రజేసి కాళికావతారం యెత్తేస్తున్నారం" ది నిర్మల చిలిపిగా చూస్తూ.

సర్కస్ మానేజర్ గదిలోకి హడావిడిగా వచ్చాడు రంగనాథం "చిరుతపులి ఒకటి తప్పించుకుపోయింది సార్. కనిపించడం కూడా లేదు." అన్నాడు.

"వెతికి, అక్కడే తుపాకితో కాల్చి పారేయ్!" అన్నాడు మానేజర్ గారు. 'సరే' నని వెళ్లిపోయి రంగనాథం తిరిగి వచ్చాడు.

"అక్కడే అంటే, ఎక్కడండి? గుండెలో నించా, తలలో నించా?" అని అడిగాడు అనుమానంగా.

ఆర్. దేవికా (కర్నూలు)

"అయ్యో ! నాకు చావూ, దానికి సహనమూ ఒకసారే వస్తాయి" అని నిస్పృహ పడ్డది నర్సమ్మగారు లలితాంబ నుద్దేశించి.

రాజ్యలక్ష్మి "ఆనక వస్తా" నని గబగబ వెళ్లిపోయింది.

నిర్మల నరసమ్మగారి కాళ్లమీదికి రగ్గు మ జాగ్రత్తగా కప్పుతూ "మధ్యాహ్నం నిద్దర పట్టిందా ?" అన్నది.

"బంగారంలాంటి పిల్ల"—. నరసమ్మగారు స్వగతంలా అనుకున్నది. ఆమె తలంపు రాజ్యలక్ష్మి మీదే ఉన్నదని గ్రహించి నిర్మల నాలుగు క్షణా లక్కడే కూచుంది.

మీనాక్షి కాఫీ కప్పుతో వచ్చి "యేమండీ .... యివాళ పారాలు తెమిలినట్లు లేదు. ఆలస్యమయ్యారే" నని పలకరించింది.

"ఏమిటో యేమి ఉద్యోగమో ...." మాట జారిందే గాని, నిర్మల వెంటనే తనను తానుసంభాళించుగుంది.

"చూడు తల్లీ మీనాక్షీ ! యీ తలగడ కాస్త మెడ క్రిందికి" అంటూ నరసమ్మగారు దిండు సర్దమని అడగడంతో మీనాక్షి నిర్మల మాటలను వ్యాఖ్యానించలేదు. ఆమెకు దిండు సర్ది గభిక్కున "అయ్యో ! ఉత్త కుంపటి ఉండిపోయింది ...." అంటూ వంట యింటికేసి పరిగెత్తింది.

"పాపం ! దీనికి తలప్రాణం తోకకి వచ్చేను .... అయ్యో రెండురోజులకే చూడు, పీక్కుపోయింది! ....వాళ్ల తల్లీ తండ్రీ ఏమనుకుంటారో ?" నన్నది నరసమ్మగారు, నిర్మలతొడమీద చెయ్యి వేసి, వెళ్లిపోయిన మీనాక్షి నుద్దేశించి.

"నిజమే ! కాలేజీలకెళ్లే పిల్లలు, వంట వండలేరనకుండా ఎంత చక్కా సర్దుకువచ్చింది ?" అన్నది నిర్మల.

నిర్మలకి నరసమ్మగారిమీద గౌరవమున్నది. ఆపేక్ష కూడా ఉన్నది. కాని భయం కూడా లేక పోలేదు.

"నువ్వెంత మంచిదానివే ...." నరసమ్మగారు గట్టిగా ఆలోచించుకున్నది. "ఈ ప్రమాదమే కనక నాకు రాకపోతే నీలాంటి మాణిక్యం గుణం ఎలా తెలుస్తుందే పిల్లా ! పాడుదైవం ఈ ముసిలిప్రాణా లిలా ఉంచి యెన్నాళ్లు మిమ్మల్ని హింసపెడతాడో ?"

నిర్మల ఆమె ఆ మాటల వారంభించినపుడు సంతోషించింది. కాని పూర్తిచేసేసరికి బాధతోనూ, అయిష్టంతోనూ నొచ్చుకు చిన్నబోయింది.

"మీరు మాటాడొద్దు" అన్న ఆ పిల్లకళ్లను చూచిన నరసమ్మగారు నిజంగా ఆ చిన్నపిల్ల ముందు చంటిపిల్ల ఐ ఊరుకుంది.

నాలుగు క్షణా లాగి "ఇంక దీన్ని సంపించేయాలి ! వంట వండి ఆ యింత యిది మంత మెక్కేనా ? అప్రదిష్ఠ" అన్నది నర్సమ్మగారు.

ఆమెకు రాజ్యలక్ష్మిమీద జాలి, మీనాక్షిమీద ఆపేక్ష, నిర్మలమీద సానుభూతి, సూర్యంమీద మమకారం .... బ్రతుకుమీద ఉదాసీనం అన్నీ ఒక్కసారి పెనవేసినందువ హృదయాంతారాళంలో భావాలు విడీవిడని చిక్కులుగా పడిపోయేయి.

"చూడమ్మాయీ !" అన్నది, ఆమె యొట్టకేలకు. కందకాలలో వెలిగే రెండు జ్యోతుల్లాంటి ఆమె కళ్లు చెమర్చడానికి తేమ లేకనో యేమో బరువెక్కి ఊరుకున్నాయి.

"నా చాందసాన్ని మనసున పట్టించుగోకూ .... నాకీ బొందెతో కైలాసం ఎటూ వద్దుగాని కన్ను మూసేవేళ కాస్తంత మనశ్శాంతి గావాలి"—

నిర్మల కదేమో విపరీతమైన భయంవేసింది.

"మీ రిలాగే మాటాడితే—నే వెళ్లిపోతా" నంది ఎలా వారించాలో తెలియక.

"ఊఁ" అన్నది నిస్సహాయంగా నరసమ్మగారు. "నువ్వింత మంచిపిల్లవుగదా ... నిన్ను కన్నతల్లివి గాకపోయినా కన్నతల్లికి గన్నతల్లిని, అనుకొని నాదగ్గర మనసు విప్పి మాటాడకూడదా ?" అనడిగింది. ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసాల వడి యెక్కువయ్యింది.

ప్రతివారం ఆంధ్రదేశమంతటా లక్షలమంది ఆంధ్ర సచిత్ర వారపత్రికను చదివి ఆనందిస్తూ ఉంటారు. మీ స్థానిక ఏజెంటు ద్వారా చందాదారులయితే మీ కాపీ మీకు వారం వారం నిశ్చయంగా చేరగలదు.

విడీ విడని చిక్కులు

నిర్మల ఆమె రక్తహీనమైన చేతిని తన రెండు చేతులతోనూ కప్పి తల వాల్చుకుని ఊరు కున్నది.

అంతలో సూర్యం రావడంతో నిర్మల తనను తాను సంభాళించుకుని కూచోవాలని ప్రయత్నించింది.

37

లలితాంబమీద తాత్కాలికంగా యెంత కోప మొచ్చినా, సాంబశివంగారికి గల సంస్కారపటిమ గానీ, తర్కజ్ఞానంగానీ ఆమెనే పూర్తిగా నిందించ డానికి ఒప్పుకోలేదు. పోనీ ఆమెకి నిజం చెప్పే ద్దామా అనుకున్నాడుగాని ఆయన కింత పిసరు కూడ అందుకు ధైర్యం చిక్కలేదు. ఇప్పటికే వగపట్టి ఉన్నది లలితాంబ. ఇక అప్పుడు రాజ్య లక్ష్మి తన బిడ్డేనని చెప్పడం దుంపనాశనానికి కార ణమే అవ్వొచ్చును.

ఒకనాడు కట్టుతెగి తాను చేసిన తప్పుకి దైవ మింత కఠిన శిక్ష విధిస్తాడని ఆయన ఊహించలేకపోయాడు. తనని అడుగడుగునా రక్షించిన వదినె ఈనాడు ఉంటేనా అని అతని మనస్సు కుమిలి కుమిలి క్షోభించింది. అత నిప్పుడు లలితాంబదృష్టిలో కేవలం కాపుపిల్లగా రాజ్యలక్ష్మిని చూపించి, తను కూడవేసిన నాలుగు రాళ్లతో .... ఆ పిల్లను వదిలించుకుని శాశ్వతంగా భార్యదృష్టిలోనూ, సమాజం దృష్టిలోనూ, పరు వునూ, ప్రతిష్టను నిక్షిప్తం పరుచుకోగలడు గాని....

రాజ్యలక్ష్మి ఎవరూ ?

తన బాధ్యత ఒక్క లలితాంబపట్లా ఆమె పిల్లలపట్లా మాత్రమేనా ఉన్నది ? తాను ఒక నాడు చేసిన తప్పుకి రాజ్యలక్ష్మికి — ముక్కుపచ్చ లారని పసిదానికి వికలాంగుడితోనూ, మృత్యు ముఖాన నిలబడ్డవాడితోనూ మూడు ముళ్లూ వేయించడమా ?

ఆపిల్లను తీసికొచ్చి పెంచి తన పాపానికి ఇహ మందూ పరమందూ కూడా ప్రాయశ్చిత్తం కల్పించుదా మనుకున్న వదినఆత్మ కావిధంగా శాంతి చేకూరుతుందా ....

'నిక్కృష్టుడా ? నువ్వు తండ్రివికాదు పాషా ణానివి !" అని వదినె ఎదురుగుండా నిలిచి పలికిన ట్లయింది.

సాంబశివంగారికి చిత్తక్షోభతో నిద్దర పట్టనే లేదు.

"ఊహూ ! వీల్లేదు !" అంటూ ఆయన ఉలిక్కి పడి లేచేడు.

"ఏమిటి ? వీల్లేదనేది మీరు ? .... ఈ పీడ ఇంత కొంచెంలో విడి శాపన అవడమేమని కదూ మీ బెంగ ? .... ఆ ముసిలాళ్లనలే నిప్పురవ్వలు .... అనక మీ ఇష్టం. ..."

లలితాంబ కళ్లు వత్తుకుంది. "నా పిల్లలికి పుట్టగతు లుండవు .... ఈ నీతిమాలినదానికోసం, జాతిలేనిదాని కోసరం నా పిల్లల్ని బలి చేయకండి. మీ పాదాలు పట్టుకుంటాను" ఆమె భర్త కాళ్లను పెనవేసుగుంది.

ఆమెమాట అతని గుండెలమీద దంపవుపోతలే

అయినా నిస్సహాయుడై కూర్చుండిపోయారు సాంబశివంగారు.

సాంబశివంగారికి సూర్యోదయమైనా కటిక చీకటే ఆవరించినట్లుంది. ఆయన హృదయం లోని ఆవేదనను వినగల వ్యక్తి యెవ్వరూ లేరు. ఒక పాషాణదైవం తప్ప. వినగల ఒకే ఒక్క మాతృమూర్తి వదినెగారు—ఏనాడో స్వర్గవాసి ఐనది.

రాజ్యలక్ష్మి మొహంకేసి ఆయన చూడలేక పోయేరు. లలితాంబతోకూడా ఆయనేమీ మాటాడ లేదు.

ఆ ఇద్దరి ముసలమ్మలను చూసి బుసలు కొట్టే త్రాచులకు ఝడిసినట్లుమాత్రం బెదరుతూ మసలి, ఆఫీసుకు వెళ్ళిపోయేరు.

* * *

ఆటుతర్వాత లలితాంబ కృష్ణవేణమ్మలు తమ "మహత్తర" ధ్యేయం కార్యసాధనలో ఏదశ వందుకున్నదీ, తమ పథక మెంత విజయవంతమైందీ బేరీజు వేసుకుంటూ చాలా పొద్దు గడిపేశారు.

అంతలో వాళ్ల కొక మెరుపులాంటి ఆలోచన తట్టింది.

"రాజ్యలక్ష్మి !" అన్నది లలితాంబ అధికార స్వరంతో, ఎంత విహ్వాత కనబర్చాలో అంతకు రెట్టింపు వినబర్చింది ఆమె కంఠధ్వని.

రాజ్యలక్ష్మి మీట నొక్కితే కదిలివచ్చే మర బొమ్మలాగ వచ్చి నుంచున్నది.

"చూడు తల్లీ ! నీకు మొగుడు కావాలి కదూ !"—కృష్ణవేణమ్మ ప్రశ్న.

నరసమ్మగారి మాట అంటే బుగ్గలు కంది పోయి పెదవుల చిరుహాసం వెలువడగా తల వాల్చి గోముగా "పోండి" అనే రాజ్యలక్ష్మి ఈ ప్రశ్నకి అడ్డంగా తల ఊపింది. అదీ ఎంతో బరువుగా అతి ప్రయాసతో.

ఉరికంబ మెక్కించి నిస్సహాయ భూమిలో, భీతావహ వాతావరణంలో "నీకీ శిక్ష కావాలికదూ" అంటే ఒక పసిహృదయ మేమి చెబుతుంది ? వద్దంటుంది.

"అదేమే ! పాపిష్టిదానా ! పెళ్లయితే నలుగుర్ని ఎత్తుకుందువు ? ఇంకా ఎన్నాళ్లీ గుండెలమీద కుంపటి నాకు" మండిపడ్డది లలితాంబ.

"వాడికేం తక్కువ .... దాని ఆయుష్షు నిండి అది నిండుకుంది కాని వాడి భార్యలాంటిది ఈ ముల్లోకాల్లోనూ ఎరుగుదుమే ! .... ఎంత అప్పరసనుకున్నావ్ ? నేను వెళితే చాలు కాళ్ళు కడిగి నెత్తిన జల్లుకునేది" .... కంట తడిబెట్టినంత పని జేసింది కృష్ణవేణమ్మ, లలితాంబ వేలు విడిచిన ఘట్టమూ, ప్రస్తుతం నలభై తొమ్మిది మాత్రమే వయస్సు గల తరుణ వయస్కుడైన వరునియొక్క, స్వర్గవాసి భార్యని తల్చుకుని—

"అంతా యెన్నేళ్లు దానికి పాతికలేవు" అని బలపర్చింది లలితాంబ.

"నీ కెన్నేళ్లే ?" అన్నది అట్నుంచి ఇటు తిరిగి రాజ్యలక్ష్మిని

"పిన్నీ ! పాలు పొంగుతున్నాయి"—రాజ్యలక్ష్మి అటుకేసి చూసి చెప్పింది.

"ఓసి, నంగనాచీ ! .... అసలు ఏడుపు ఏడవ్వే" లలితాంబ ఆపిల్ల అమాయకత్వాన్ని ధూర్తలక్షణంగా భావించి, వెంటనే శిక్షించవానికి పూనుకుంది. లేచి పట్టుకుచ్చులాంటి రాజ్యలక్ష్మి జెడను తన చేత మెలివేసి పట్టుగుని గదిలోకి ఈడ్చుకుని పోయి లోపల గడియ పెట్టుకుంది.

"ఆ ఇంతా పిల్లికూనలా పీకె నొక్కేయదుగదా?' అన్నది సావిత్రి.

"నీ కెందుకు నోరు మూసుకో, దాని సొత్తు అదెలా యేడుస్తే మనకేం ? యేమేనా అంటే మన పీకె నొక్కుతుంది" అంది రహస్యంగా కృష్ణవేణమ్మ.

గదిలోనించి రాజ్యలక్ష్మిరోదన దళసరి దర్వాజాల్నించి వినిపించినా, గత పదేళ్ళుగా నిమనిష్ఠలతో సాధించిన వైధవ్య విగ్రహమంతా అందుకే విని యోగించి ఊరుకున్నారు ఇనతలి పూర్వ సువాసిని లిద్దరున్నూ.

ఒక చిన్న ఊళ్లో బ్యాంకు దోచుకున్న దొంగలు పోలీసు కానిస్టేబుల్‌కు టోపీవేసి పారిపొయ్యారు.

"ఆ దొంగల్లో ఎవరినైనా గుర్తుపట్టగలవా?" ఒక విలేఖరి కానిస్టేబుల్‌ని అడిగాడు.

"ఊహూ."

"వాళ్లు ఎలాంటి కారులో పారిపొయ్యారో చెప్పగలవా?"

"ఊహూ."

"పోనీ, ఈ దోపిడికి సంబంధించిన మిగతా వివరాలేమైనా తెలుసా?"

"బ్యాంకుని వర్ణించి చెప్పమంటే చెబుతా !" కానిస్టేబుల్ ఇకిలించాడు.

రహీం (హైదరాబాద్)

38

నరసమ్మగారు తిరిగి నట్టింట దీపం వెలిగించుకుని .... వంటవండుకుని తినడానికి పదిహేను రోజులు పట్టింది.

ఆమె మొట్టమొదట దేవుడి విగ్రహాలను చూసి "అయ్యో! తండ్రీ నైవేద్యం లేక ఎంత ఆకలిగా ఇన్నాళ్లు బాధపడ్డావో" నన్నది, పరాత్పరుడిమీద జాలీ, ఆపేక్ష ప్రదర్శిస్తూ.

మీనాక్షిని జయరావుగారు వచ్చి స్వయంగా తీసుకువెడతానని ఉత్తరమున్నూ రాసి వచ్చేరు. ఆయన వస్తూనే "ఆశీర్వదించాలి!" అంటూ నరసమ్మగారికి పాదాభివందనం జేశాడు.

ఆమె "సకలైశ్వర్యప్రాప్తిరస్తు" అన్నది జోసినోట నవ్వుతూ.

"దేవుడున్నాడు సుమండీ ! మిమ్మల్ని ఇలా చూస్తున్నాను అంటే మరి వాడిదయకదా!"

జయరావుగారు నరసమ్మగారు కోలుకున్నందుకు పులినోట బెడ్డకొట్టినందుకు నిండు సంతోషం వెలిబుచ్చేడు.

"పిల్లవాణ్ణి ..... ముఖ్యంగా యెదిగినపిల్లది ఇంట ఉన్నవాడినీను ! కన్యాదానం చేసుకోమని దీవించండి"— అన్నాడు: ఆమె అందుకు నవ్వుతూ "ఏమేవ్" అంటూ మీనాక్షిని కేకవేసింది—.

మీనాక్షి తండ్రిరాకకు ఆనందాన్ని కళ్లలోనే వ్యక్తంచేసింది.

మీనాక్షితో "కాఫీయివ్వ"మనిచెప్పి — జయరావుకేసి తిరిగి "మాణిక్యంలాంటిది పిల్ల.... దానికి మేరువులాంటి వరుడొస్తాడయ్యా!" అన్నది.—

"మేనల్లుడు యేడీ ! ఇంకా రాలేదల్లేవుంది — మీరు దేవతలేనిజంగాను...వాడి నెంతవాణ్ణి చేశారు? మా చెల్లెలివిషయంలో మీరు మాతృమూర్తులు! అత్తగారని ఎలా అనను?"

జయరావుగారు నరసమ్మగారిని ఉబ్బేద్దామన్న ప్రయత్నంలో దొరికిపోయాడు.

"ఎవరి ఇల్లు! ఎవరిబిడ్డ? గనక జయరావూ? వాడు నాకు మనుమడు. నేను గాపోతే, మరెవరి బాధ్యత!"....అన్నది, నరసమ్మగారు ఆవేశపడి.

జయరావుగా రన్నాడు "బావగనక ఉంటేనా? వ్చ్ వ్చ్...వాడికి ప్రాప్తంలేదు యీ పుత్రసంతోషం..." అతనికి దుఃఖం నిండుకొచ్చినట్లు కంఠం గద్గదికమవడం నరసమ్మగారి హృదయాన్ని కదిలించినా కించిత్ విస్మయంకూడా ప్రకటించిం దామె.

"అది సరేగాని పిల్లకు కలవులే కదా?.... ఉంచరాదూ! అనలడగటం మరిచా....నీపెళ్లాం పిల్లల్ని తీసుకురాకపోయావూ ? ఈ ముసిల్ది చూడడ మేమిటిలే! అనుకున్నావా?"

"అవ్వ, ఎంతమాట!.... మీరుగాక మరి ఎవరు నన్ను కడుపులో పెట్టుకుంటారు .... ఇంతకీ మా మీనాక్షినీ అబ్బాయినీ అడిగి పెద్దలు మిమ్మల్ని అడగా లనుకుంటున్నాను."

జయరావుగారు ఏ విషయాన్ని మాటాడుతున్నా లక్ష్యాన్ని మరిచిపోలేదు, గురికి బెత్తెడుదూరాన ఉండి, ప్రసంగవశాన్న నరసమ్మగారిని దొరక పుచ్చుకోవాలని అతని తాపత్రయం.

మీనాక్షి కాఫీతేగా .... "తల్లీ ! ఈ పూరు నీళ్ళు నీకు బాగా పడ్డట్టున్నాయే" అన్నాడు లేని సంతోషం కనబరుస్తూ.

"ఏం పడ్డం! ఆదేపడ్డం....నేను మంచాన పడ్డానూ .... ఏదో సామెత చెప్పినట్లు దానికి చిక్కులొచ్చినై .... పిల్లది ఒక్కనాడు కాబోలు వాళ్లరాజ్యంతోనూ, ఈ నిర్మలతోనూ సినిమాకి వెళ్లింది...." అన్నది నరసమ్మగారు.

ఆవిడ ఉద్దేశ మేమిటంటే "అబ్బాయీ! నీ పిల్లని కేవలం ఇంటో గొందెకట్టిన గేదెపెయ్యలాపెట్టి ఉత్తచాకిరీ చేయించలేదూ. సినిమాలకున్నూ పంపేను సుమా" అని చెప్పడం.

మీనాక్షి అన్నది "అదికాదు నాన్నా, మీరు రాత్రిబస్సుకే ప్రయాణమంటున్నారు కదూ!"

"కానమ్మాయీ!...." అంటూ ఆయన కప్పు వందించి వీధిగుమ్మంకేసి చూస్తూ "మరి మావాడు సూర్యనారాయణ రాలేదేనని చూస్తున్నా" నన్నాడు.

"అదేపోయెగాని! రేపు వెడుదువు... నిక్షేపంలా కందముక్కలు వేచుతాము, అప్పడాలూ, ఒడియాలూ వున్నాయి. భోజనంచేసి కాస్సేపు కబుర్లుచెప్పు.... మీ ఆవిడ ఇప్పుడు ఒత్తిమనిషేకదా .... అఖరి దాని కెన్ని ఏళ్లన్నావూ?....అయినా.... చూడాలిస్మీ! నీ పిల్లల్ని" నరసమ్మగారి వాత్సల్యాన్నికి జయరావుగారు లొంగిపోయాడు.

ఆటుతర్వాత నిర్మల రాగా "రా! డాబామీదకి పోదా"మని ఆపిల్ల ననుసరించింది మీనాక్షి.

మీనాక్షి కీ పదిహేనురోజుల జీవితమూ ఒక మరుపురాని బంధనమయ్యింది. ఇక రేపు ఇక్కడి నించి కదలాలంటే ఆమె ఎదను ఏదో దేవి నట్లయ్యింది.

జయరావుగారు మీనాక్షి అలా వెళ్లడానికే యెదురుచూస్తున్నాడా అన్నట్లు నరసమ్మగారితో "మా మీనాక్షికి ఇంత చదువుచదివినా గర్వంలేదు. పెద్దలు మీరేమంటారు?" అన్నాడు. "దానికి వంకలేదయ్యా జయరావూ? చందమామకేనా మచ్చ వుందేమోగాని...." అన్నది. కుంపటిమీద చారుగిన్నె దింపుతూ ఆమె.

"సూర్యం వస్తేనూమీ అనుమతి అయితేనూ. ఒక్కమాట అడగాలనుంది"—నీళ్లు నమిలేడు జయరావుగారు.

"అదేమిటయ్యా! పరాయివాడా వాడు! నీ మేనల్లుడు...."—

"అదే! అదే! ఏదో ఇంటి సమ్మంధం .... మచ్చలూ, మరకలూ శాశ్వతంకాదు.... నాకు మీ యింట మీనాక్షిని పడేయ్యాలనుంది—" చివరికి అసలువిషయం తేల్చాడాయన.

ఆసంగతి నెంత లౌక్యంగా అడిగాడో అంత బెదిరింపూ ఉంది అందులో....మచ్చలూ మరకలూ వున్నదెవరికి? సూర్యం తండ్రికి.... సూర్యం కుటుంబానికి.

నరసమ్మగా రీ ప్రశ్న ఊహించలేదంటే ఆమె వయస్సునీ అనుభవాన్నీ కించపరచడమే అది. కాని జయరా వీమాట అనగానే దీపంకాంతిలో ఆమెమొహం రంగులు మారింది.

ఆమె మరేదోవిషయం మాటాడుతూవున్నట్లు కొంచెం ఇసింటావచ్చి "చూడు జయరావూ!" అన్నది అతగాడి కేదో అత్యంత రహస్యం చెప్పనుకించినట్లు "పిల్లల మనస్సులు బహుసున్నితమైనవి. అందులోనూ మా సూర్యానిది వాళ్లతాతయ్యలాగే వెన్నలాంటి మనసు."

"అమ్మమ్మ! అదేమిటితల్లీ! వాడెవరు? మా చెల్లిమనసుమాత్రం ఏం తక్కువ అది దేవతకదూ.. లేకుంటే అది అంతటి దుఃఖాన్ని ఎలా దిగమింగుకోగలిగింది?" అన్నాడు జయరావుగారు.

ఏవిషయమై ఆమె రక్షణ ప్రతిపాదిస్తున్నదో అదేవిషయాన్ని ఆసుముక్కలాగ రక్షించుకుంటున్నాడు అతడు. ఆవిధంగా కొంత చర్చజరిగిన తర్వాత సంభాషణల సారాంశం; నరసమ్మగారు జయరావును బ్రతిమాలడమే అయ్యింది.

పిడికి పిడని చిక్కులు

గతమంతా వాడికి కలనైనా తెలియదు ఈవాళ తెలిసిందో తండ్రి పరారీ.... అక్కలేచిపోవడం ఇత్యాదులు వాడి లేతగుండె భరించకపోవడం అటుంచి, ఈ వ్యధ వాడికి సమాజంలోగల పరువూ ప్రతిష్ఠలను తగ్గించడమేగాకండా, వాడిలోని తలబిరుసుతనాన్ని పూర్తిగా నమిలేస్తుంది. వాడిసుఖాన్ని వేళ్లతో పెకలించడం తన జీవితానికిమాత్రం సార్థకంగాదు. అదీ నరసమ్మగారి ఉద్దేశం.

జయరావుగా రన్నాడు. "అత్తయ్యగారూ! ఈ పాపిష్టి ఘటానికి నలభైఅయిదు సంవత్సరాలు.... నాయింటికి నేను నిప్పులెందుకు పోసుగుంటాను. అదిన్నూగాక పైవాళ్లయితే ఈ సంప్రదాయవిచారణ జరుపుతారుగాని,.... "అయినవాన్నినేను!....కడుపుచించుకుంటే కాళ్లమీద పడదూ" — పాచిక పారిందిగనుక ఇక కోటలో పాగా అన్నట్లు దుమ్ముగానవ్వేడు జయరావు.

"నా ఉద్యోగం ఖాయమయ్యేట్టు ఉంది" కొత్తగా వచ్చిన టైపిస్టు తన స్నేహితురాలికి చెప్పింది.

"ఎట్లా తెలుసు? మేనేజరు చెప్పాడా?"

"చెప్పలేదనుకో! కాని ఈ వేళ పొద్దున నాకో 'డిక్షనరీ' కొని పెట్టాడు కదూ అందుకని"

శ్రీరాములు (విజయవాడ)

నరసమ్మగారి మనస్సు చివుక్కుమంది ఆహంకారం దెబ్బతిన్నది.

"పిడికి 'కో' అంటే కోటిమంది వస్తున్నారు....అయితే వాడో కోతి!....వాడికి యే అవ్వరసొచ్చిందు.... మొన్ననే యాజుల సోమశేఖరమ్మ వచ్చింది.... మనుమరాలినిస్తానని. పదహారుతులాల బంగారమూ, పాతికవేలు ఖరీదుచేసే ఇల్లూ సర్వమూ వాడివేనంటూ కాని నేనే...."

ఆమె ఆర్ధోక్తిలో ఊరుకోడమూ జయరావుగా రావ్యాక్యాన్ని అందుకోడమూ సూర్యం రాక అవతల జరగడమూ మూడూ ఒక్కసారే జరిగేయి.

"నిజమే నిజమే.... పిల్లలవాణ్ణి....నేను అంత ఇచ్చుకోలేను .... అదిన్నూగాక ఈ సంప్రదాయాలు గట్రా అంటే నాకు నమ్మకంలేదుగాని మా ఆవిడకు మాత్రం భయం"

"ఏవిటోఁ! మావయ్యగారు సంప్రదాయాలంటున్నారు...."

సూర్యం పలకరించేడు. నిజానికి అతగాడంత చనువుగా పలకరించడం అదే మొదటిసారి. అయితే మీనాక్షిమీద అతనికేర్పడిన సదభిప్రాయమే, ఆపిల్లమీద కలిగిన ఆపేక్షే, ఆపిల తండ్రి దగ్గర చనువుగా మారింది.

ఆత్మీయతలోని రహస్యమే అది!

సూర్యంప్రశ్నకి నరసమ్మతో పీమని జవాబిచ్చింద్ని "ఏదో లోకాభిరామాయణం.... ఇతగాడు ఈ రాత్రికే వెళతానంటున్నాడు.... నేను ఉదయం వెడుదువు అని ఉంచేశాను.... అదో ఆమేడమీద నిర్మలా మీనాక్షి వున్నారు. పోయి పిలూ కాఫీ యిస్తుంది ఫ్లాస్కులో వుంది."

"ఏం బాబూ? ఆఫీసులో పని జాస్తిగా ఉంది కాబోలు" నన్నాడు జయరావుగారు.

"మరే!" నన్నాడు చీకటైనా అలవాటైన మెట్లు తడుముకోకుండా ఎక్కుతూ.

జయరావుగారు అస్వస్థతగా ఆసనంలోనే అటూ యిటూ కదిలేడు. ఏమో అనాలనుకున్నాడు. ఏమీ అనలేకపోయాడు.

నక్షత్రాల మినుకుమినుకుకాంతి ప్రసరిస్తున్నది. పశ్చిమాన చంద్రవంక అస్తమిస్తున్నది. విషయ మేమంత రహస్యం గాకపోయినా నిర్మలా, మీనాక్షీ రహస్యం మాటాడుకుంటున్నట్లు మెల్లిగా కబుర్లు చెప్పుకుంటున్నారు. వారు మాటాడుకునే విషయాలు అలౌకిక మేమీకాదు.

సూర్యం మెట్లచివర అనాలోచితంగానే నిలబడ్డాడు.

"ఈ నవీనయుగంలో సైతం సంప్రదాయాల పేరిట ఆడవాళ్లని హింసపెట్టడం దారుణం.. ఉద్యోగం చెయ్యడం అవసరమైతేతప్ప ఏ ఆడదీ చెయ్యదని ఈవెధవసమాజ మెందుకు గుర్తించదు?" — తాపీగా అన్నప్పటికీ మీనాక్షికంఠం తీవ్రంగానే ఉన్నది.

"ఏమోనుమా? బలమైన మనఃప్రవృత్తులు గలవాళ్లని ఈ సమాజం ఆపలేదనుకుంటాను!.. అసలు ఆత్మీయత, లోపించకుండా వుండాలి. ఈ పురుషుల విషయంలో పరువూ, ప్రతిష్ఠ, ధనమూ సంపదా, ఇత్యాది భౌతికవిషయవాంఛలతో ఆత్మీయత పోటీపడి లోపిస్తుం దనుకుంటాను.... మనవిషయంలో అదే నెగ్గుతుందేమో...." నన్నది నిర్మల.

సూర్యానికి సంభాషణ అద్యంతాలు తెలియవు. కుతూహలమేమీ ఇనుమడించలేదు.

"ఏమిటో అత్యంత అవసరమైన చర్చలు సాగుతున్నాయనుకుంటాను...." అన్నాడు తనరాక తెలియజేసిందికి.

ఉలిక్కిపడ్డది మీనాక్షి, ఉలిక్కిపడ్డది నిర్మల.

"ఎంతసేపయ్యింది వచ్చి?" మీనాక్షి అడిగింది.

"అసలింతసేపుకూడా అవలేదు. ఇదేరావడం.." సూర్యం చెప్పేడు "బామ్మ కాఫీతెమ్మంది"

"ఎవరికి" మీనాక్షినవ్వును నిర్మలకూడా పంచుకుంది.

"నాకు"—

మీనాక్షి నిర్మలా చరచరా దిగిపోయేరు. నిర్మలను పిలుద్దామా అనుకున్నాడు వెనకగోడమీద చతికిలపడి! భయమేసింది! నిర్మల ఆత్మీయత ఉండాలన్నది. అదిమాత్రం స్పష్టంగా తాను విన్నాడు. మరి ఈ ఆత్మీయతతోనే, తన లోగిలిలోని వాళ్ళనోళ్ళు తనుమూయించగలడా? (సశేషం)

ఆంధ్రసచిత్రవారపత్రిక


దీపావళి కథలపోటీ

మొదటి బహుమతి రు. 600
రెండవ బహుమతి రు. 350
మూడవ బహుమతి రు. 200

ఎప్పటివలె 1962 దీపావళికి కథలపోటీ నిర్వహింప నిశ్చయించాము. రచయితలుకూడా ఎప్పటివలె మాతో సహకరించి ఈ పోటీ జయప్రదం చెయ్యగోరుతాము.

నిబంధనలు

- కథలు స్వంత రచనలై ఉండాలి. అనువాదాలు పంపరాదు.
- కవరుపైన "దీపావళి కథల పోటీకి" అని స్పష్టంగా వ్రాయాలి.
- రచనలు తిప్పి పంపగోరువారు తగుమాత్రం పోస్టేజీకల కవరు జతపరచాలి.
- కథ ఇరవై అరఠావు పేజీలు మించరాదు.
- కాగితానికి ఒకవైపుననే వ్రాయాలి.
- పోటీలో బహుమతి పొందని కొన్ని కథలను విడిగా ప్రచురించవచ్చు.
- వ్రాతప్రతులు 31-8-62 లోగా మా కార్యాలయం చేరాలి.
- పోటీలో తుది నిర్ణయాలు సంపాదకులవే. ఈ విషయమై ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.



సెట్సు మీద

11-వ పేజీ తరువాయి

విజయ, వాహినీ స్టూడియోలలో 'చివరిదశ' షూటింగులో ఉన్న ఈ చిత్ర దర్శకుడు : కమలాకర కామేశ్వరరావు; రచయిత : పింగళి నాగేంద్రరావు, సంగీతం : పెండ్యాల నాగే 'స్వర' రావు; కళ : మాధవపెద్ది గోఖలే; ఛాయ. డి.ఎల్. నారాయణ(అన్నయ్య).

పై నటీనటులు కాక, ఈ చిత్రంలో గుమ్మడి తిమ్మరుసుగా, ఎస్. వరలక్ష్మి తిరుమలగా, ఎల్ విజయలక్ష్మి చిన్నాదేవిగా, ముక్కామల గజపతిగా, లింగమూర్తి గజపతి సోదరుడు హంవీరునిగా, మిక్కిలినేని రాయలసేనాని రామలింగనాయకునిగా, రాజశ్రీ కందులి(వేగు)గా నటిస్తున్నారు. జులైలో విడుదల చెయ్యాలని నిర్మాతలు రామబ్రహ్మం, పుండరీకాక్షయ్యగారలు తీవ్రంగా కృషిచేస్తున్న ఈ చిత్రాన్ని గౌతమీవారే విడుదలచేస్తారు.

"మదనకామరాజు కథ" ప్రారంభం


విఠల్ ప్రొడక్షన్స్ పేరిట దర్శక, నిర్మాత విఠలాచార్య ప్రారంభించిన "మదనకామరాజు కథ" చిత్రనిర్మాణంకు ఇటీవల గోల్డెన్ స్టూడియోలో ముహూర్తం జరిపారు. పూర్ణా పిక్చర్స్ అధిపతి కామరాజు కెమెరా స్విచ్ఆన్ చేశారు.

విఠలాచార్య స్వయంగా దర్శకత్వం వహిస్తున్న ఈ జానపదచిత్రంలో కాంతారావు, జయంతి, రాజశ్రీ, అనూరాధ, శాంతి, చంద్రసేన, మీనాకుమారి, రాజనాల, బాలకృష్ణ, ధూళిపాళ,హరనాథ్, లంకాసత్యం, ఎ. ఎల్. నారాయణ, పి. కృష్ణమూర్తి శ్రీకాంత్, మహేశన్ పాల్గొంటున్నారు. రచన: జి. కృష్ణమూర్తి బి.ఏ. సంగీతం: రాజన్, నాగేంద్ర, ఛాయ: చంద్రన్. ★

చిత్రసమీక్ష

ఖేదమోదాల గంతులు "అప్పగింతలు"

"జగమే మాయా బ్రతుకే మాయ"---అ చెప్పినాయ నెవరోగాని మహా చక్కగా చెప్పాడు నిజానికి బ్రతుకు, అందులో మనిషి బ్రతుకు మహా మాయబ్రతుకే. కలలాంటి యీ బ్రతుకులో మనిషి కలకీ, నిజానికీ, గంతులు వేస్తుంటాడు. ఎంతో ఆనందంగా సాయిలా పాయిలా గా పైలాపచ్చీస్ గా గెంతే జీవితం మనకు తెలియని, తెలిసినా ఏమీ చేయిలేని కారణాలవల్ల బోర్ల పడుతుంటుంది. ఆనందం, శాంతి ఉన్న జీవితంలో అశాంతి, ఖేదం అలుముకుంటాయి. ఈ సత్యాన్నే రెండు విడిచిత్రా లనదగ్గంత విభాగాలుగా రస (అక్కడక్కడా నీరస) వంతమైన పాటలతో, మంచి పాత్రపోషణలతో, ఆనంద విషాదాల గంతులువేయిస్తూ నిర్మించిన చిత్రం ఏ.ఎం. పిక్చర్స్ 'అప్పగింతలు'. (నిర్మాత : శ్రీరామమూర్తి, పాటలు చిరంజీవి(వార్ల), సంగీతం : గోపాలం, ఛాయ జి. దొర : కూర్పు : కె. సత్యనారాయణ. దర్శకుడు వి. మధుసూదనరావు, కళ: కె. ఎస్. ఎస్. మూర్తి.)




"అప్పగింతలు"లో జగ్గయ్య, జమున

ముందు జాగ్రత్తకోసం ఉన్నచోటునుండి వెనక్కిచూచే (ఫ్లాష్‌బాక్) ఈ చిత్రంకు గ్రామీణ జీవిత కథ ఆధారం.

కట్నాలనేమాట పట్టింపుగల రామచంద్రయ్య అనే ఆసామి (కె.వి.ఎస్) తన బావమరిది వెంకటాద్రి (వై. వి. రాజు) పెద్ద కూతురు లక్ష్మి(జమున) ని తన పెద్దకొడుకు రామదాసు (జగ్గయ్య) కు ఇచ్చి వివాహం చేయా లనుకుంటాడు. రామదాసు తమ్ముడు వేణు (రమణమూర్తి) పట్నవాసవలకు మురిసిన లక్ష్మి రామదాసుతో తన పెళ్లి 'అతికని బతుకని' చిన్నబావ వేణుకు (రమణమూర్తి) తన మనస్సు 'అప్పగింతలు' చేసుకుంటుంది. రామ జాతి పోగా పెద్దబావ ఉట్టి దాసై (అనగా విరక్తి కలిగి) పోగా, అతనివల్ల లక్ష్మి, వేణులకూ రామచంద్రయ్య మేనల్లుడు సుందరం (రమణారెడ్డి) కుమార్తె సుబ్బులు(అనూరాధ)లకూ వివాహం జరుగుతుంది.

తర్వాత కొన్ని సినిమాల్లో మాదిరిగా పెళ్లై



కెమెరా ఎట్లా పనిచేస్తుందో వివరిస్తున్నది జమున—సాధనావారి సెట్టుమీద; ప్రక్కన కెమెరామన్ కె. సత్యనారాయణ. ఫోటో: రూప.

అప్పగింతలు

టూరి గబ్బిలాయి లాంటి లక్ష్మితో వేణు మనసు విరిగి, పట్నపు పోకడ లెరిగిన తార అను ఒకానొక 'యెంకటసుబ్బి' (లక్ష్మి చెల్లెలు—రాజసులోచన) పై తారాడటం, తత్ఫలితంగా భార్యాభర్తల మధ్య అనురాగబంధం అతక్కపోవటం, అప్పు లెక్కువ చేసిన వేణును రామచంద్రయ్య, అలవిమాలి ప్రవర్తిస్తున్న తారను వెంకటాద్రి, ఇంట్లోనించి వెళ్లగొట్టడం, కథాబలంవల్ల మనసు పాడు చేసుకున్న లక్ష్మి తన బిడ్డను రామదాసు కప్పగింతలుచేసి తన అతకని బతుకును అంతం చేసుకోటం—ఈ కథ చెప్పి రామదాసు లక్ష్మి కుమార్తె మనసు మార్చి(షరా: ఇది కొన్నేళ్ల తర్వాత సంగతి) తన మేనల్లుడి కిచ్చి వివాహం చేయటం జరుగుతుంది. కథ సుఖాంత మయ్యేందుకు కన్నతండ్రయిన వాలేకపోతే ఎలా? అపిల్ల మా నాన్నేడీ అని అడగ్గానే మునలాడై వేణు వచ్చి అన్నకు క్షమాపణలు చెప్పుకుంటాడు.

రామదాసు తల్లిగా హేమలత, రామదాసుగా జగ్గయ్య, లక్ష్మిగా జమున, ఆ పాత్రలకు జీవం పోశారు. జగ్గయ్య ఎప్పుడూ ఇలాంటి వేషాలువేస్తేనే బాగుండనిపిస్తుంది కూడా. చిత్రంతో అంతగా సంబంధం లేకపోయినా, రమణారెడ్డి, అనూరాధ చక్కని, సెన్సారుకు చిక్కని, అశ్లీలపు మాటలతో అక్కడక్కడా బక్కచిక్కిన హాస్యం అందించారు.

చిరంజీవి పాటలు రంజాగా సాగాయి. సంగీతం ఆ పేరును సార్థకం చేసుకోకపోయినా ఓరోరి తస్సదియ్యా, మల్లె పందిరి పూసే వేళ, అనేవి, రమణారెడ్డి అనూరాధల "జాయింటు పాట" కాస్త వినసొంపుగా ఉంటాయి.

నరసరాజు రచనలో మాటలు సెన్సారు హద్దు కోటను దాటి జానపద రసికతను వెల్లడించాయి. అనంది తప్పు కాదేమో. 'ప్రేమలేని పెండ్లి వ్యభిచార సమానం' లాంటివి, జనసామాన్యం ఓర్చుకొని, తప్పయినా నేర్చుకోవాల్సినవి అభ్యుదయకర నీతి సూత్రాలన్నే ఉన్నాయి మరి!

నాగరాజ్ ★

106-వ గళ్లనుడికట్టుకు జవాబు

■	మె	ర	2 క	■	■	■	3 మే	తా	4 బో	■
■	ట్లు	■	లు	■	■	■	డి	■	పు	■
■	■	5 జీ	వ	6 సిం	■	7 కా	సి	8 ని	■	■
9 ని	డ	త	■	10 ప	త్రి	క	■	11 ర	త్న	ము
■	■	12 ము	13 ది	త	■	14 ర	15 జ	తం	■	■
■	■	■	ను	■	■	■	న	■	■	■
■	■	16 పి	సు	17 పు	■	18 సి	త	19 మొ	■	■
20 దీ	వ	న	■	21 ల	త్తు	క	■	22 సు	న్న	ము
■	■	23 సే	24 రా	గం	■	25 లం	26 గ	రు	■	■
■	27 తే	■	28 గ	■	■	■	త	■	28 మే	■
■	29 ప్రే	ర	ము	■	■	■	30 ము	ష్టు	లు	■

కొత్త నుడికట్టు-1


అడ్డం

1. సూపరువందలలో ప్రాయము.
3. స్వతంత్రనాయకుడు!
6 ముందుసేన ఉన్నవాడు నేర్పరి!
7. మూషు తిరగబడింది.
8. పరిపాలించు.
9. ఎన్నో!
10. పోలిక.
11. కథ.
12. ఒకటి ముక్క— రాజుకన్నా ఎక్కువా?
13. ఈ చెత్త ఊడిస్తే వస్తుంది.
14. ప్రవర్తన.
16. పక్క.
17. చుక్క.

నిలువు

2. ఇది సిరు దాటుతుందా? లేక దాటిస్తుందా?
3. రామానుజుడి అన్న!
4. ప్రాణములు.
5. హింస! (వింత ఘూస్కిలోనా?)
6 ప్రారంభము.
8. ఎందుకు?
9. దాసి.
10. ఊబుసు!
11. మాజిక్!
12. గోవులు ఇంక మార్కి కలిపి చదివితే నోరు తెరవవలసివస్తుందా? (తర్వాత నిద్రకూడానా!)
14. ఇంకా—! అంటారు.
15. ఇది జరిగితేనే తినడము!

★



కథకాని కథ పోటీ

నిబంధనలు

(1) కవరుమీదగాని, కార్డు మీదగాని, ఇన్‌లాండు కవరు మీదగాని స్పష్టముగా 'కథకాని కథ పోటీకి' అని వ్రాయాలి.

(2) ఈ పోటీ కథలతో ఇతర రచనలను జత చేసిపంపకూడదు. పోటీకి అర్హత లేని రచనలు త్రిప్పి పంపబడవు. వాటిమీద ఉత్తర ప్రత్యుత్తరములు జరుపబడవు. కార్డులు జత చేసి పంపకూడదు.

సరాగమాల

15-వ పేజీ తరువాయి

సంక్షిప్త చిత్రం విని హైదరాబాద్‌నుంచి పి. లక్ష్మి గారు వ్రాశారు. ఆ పాట ఎంతటిది కాకపోతే ఇన్ని నాళ్లతరువాత వారు దీని గురించి వ్రాస్తారు?

"భక్త మార్కండేయ" చిత్రంలో మార్కండేయుడు తపస్సుకై తరలిపోతే తిరిగి తనయుణ్ణి చూడగలనో లేనో అనే బాధతో కుమిలిపోతూ మరుద్వతి ఒకపాట పాడుతుంది. "దాగుడు మూతలు నాతోనా" అని. ఈ పాటను ఆ సినిమాలో విని చెమర్చని తల్లి (ఒక్క తల్లులేకాదు వాత్సల్య ప్రేమ నెరిగిన వారందరి) కన్నులుండవు. ఈపాట ఇంత విశిష్టంగా రూపొందటానికి మొదటి కారణం పాడిన బాలసరస్వతీదేవి కంఠంలోని భావ సాఫల్యం. రెండవది ఆ పాటకు విశ్వనాథన్ రామ్మూర్తులు ఎన్నుకున్న రాగప్రాబల్యం. ఈ చిత్రం మూడు తమిళ, కన్నడ, తెలుగు భాషలలో తయారయింది. కాని పైపాట ఒక్క భాషలోను రికార్డుగా రాలేదు.

"రాజా మలయసింహ"లో పద్మనాభానికి జానకి సంగీతం నేర్పుతూ, రాజేశ్వరి కంఠంతో కృష్ణుని మీద ఒక చక్కనిపదం పాడుతుంది. ఆ చిత్రంలోని మంచిపాటలూ, మంచివికానివీ, పాట అనే పేరుకు తగనివీ అన్నీ రికార్డులుగా వచ్చినవి కాని పై పాట రాలేదు.

పై మూడు చిత్రాలు, కాకతాళీయంగానే కావచ్చు. రంగావి. విక్రమ్ నిర్మాణాలు. ఈ సందర్భములో "పెళ్లితాంబూలం"లోని "నిత్య వినోదం" "కాలమంత" పాటల గురించి జ్ఞప్తి తెచ్చుకోడం అప్రస్తుతం కానేరదు. ప్రతి చిత్రంలోను అమోఘమైన సంగీతాన్ని వినిపించటానికి అపూర్వమైన కృషి చేసిన రంగాగారే ఈవిధంగా అశ్రద్ధ వహిస్తే ఇక తక్కిన నిర్మాతల నని ఏమి ప్రయోజనం!

కెంపరాజు తీసిన "నలదమయంతి"లో బి. గోపాలం కృతులు మరపురానివి ఉన్నాయి. ఒకమాదిరివి వున్నాయి. ఇవన్ని పాటలుగా, తెలుగు, కన్నడ భాషలలో విడుదలైనవి ఒక్కటి తప్ప. అది యుగళ గీతాల వంశానికే వన్నె తెచ్చే "జీవనమే, ఈ నవ జీవనమే హాయిలే, పూవులును తావివలె హాయిగా మనేవారి" అన్నది భానుమతి ఘంటసాల పాడినది. అలాగే "దేవదాసు"లోని "ఇంత తెలిసియుండి ఈ వంతమేలరా" అనే మువ్వగోపాలపదం బాలసరస్వతి పాడినది. "భూకైలాస్" చిత్రంలో కుమారి కమల అద్భుత నాట్యవిన్యాసానికి వసంతకుమారి పాడిన రాగమాలిక, "మున్నీట పవళించు నాగశయనా", "భలే అమ్మాయిలు" చిత్రంలో టైటిల్స్‌తో బాటు వినపడిన ఉదాత్తమైన తిల్లాన.

తీరికగా కూర్చొని ఆలోచిస్తే ఇంకా ఎన్నో ఇటువంటివి అకారణంగా తెర మరుగున పడిపోయినవి. మంచి పాటలను విడుదలచేస్తే, వాటి కలవాటుపడి ప్రజల అభిరుచి పెరిగిపోతుందేమో. ఆ పక్షంలో తాము సాధారణంగా వినిపించే చెత్త పాటలను తిరిగి

మెచ్చరేమో అని నిర్మాతల భయ విహ్వలూహా కాబోలు. అవునా మాధవీ! వాళ్ళివ్వకపోయినా రికార్డింగ్ కంపెనీ అధినేతలు కోరిపుచ్చుకోవచ్చుగా!

అటు వారికీ, ఇటు వీరికీ ఏవో పాటలు నొక్కేద్దాం. వచ్చే డబ్బు దాబట్టుకుందాం అనే కేవల వ్యాపార చింతనతప్ప, ప్రజలకు వచ్చే మంచి పాటలను గురించి తలపే లేదనుకుంటాను.

*   *   *

నాకు నచ్చిన ఇళ్ళు, ఊళ్ళు, ప్రదేశాలు గురించి నా మనస్సునున్న మధురస్మృతులు ఒకోసారి ఒక పాటతో పెనవేసుకునిఉంటాయి. దీనికి ఒక నిర్ణీత కారణమంటూ లేకపోవచ్చు. ఉన్నా బహిర్గతంగాకాక అంతర్యంలోనే గుప్తమై యుండవచ్చు. కనపడితే బాహాటంగా కనపడవచ్చుకూడా! ఈ ఆఖరికోవకు చెందినవాటిలో కొన్నిటిని గురించి వ్రాస్తాను.

కొన్ని వారాల క్రిందట "మనసున మల్లెలు" పాటకు రాజమహేలుకూ ఏర్పడిన బాంధవ్యం గురించి వ్రాశాను. అలాగనే రాజమండ్రికీ "బరస్ బరస్ శిరే అంఖియా తరఫ్ గయా తుమ్ కబ్ ఆఓగి బాలమా" అన్న "గజరే" లో లత పాడిన పాటకూ "గోరే గోరేహన్ ఫులాసర్‌కీఖాన్ దాదామలాయిక్ నహీ హై యా" (తాత తమలపాకులవంటి దేహచ్ఛాయకలిగిన ఒకవదిన నాకు కావాలి అన్నయ్యా) అన్న మరాటీ జానపదగేయానికి మహారాష్ట్ర దేశానికి "సులలిత మురళి మధురనాదే బాంతిమ వధరే బాజీ" అనే చిన్న పాటకూ ఒరియా దేశపు ప్రకృతి సౌందర్యానికీ, నా మనస్సులో వేర్వేరు కారణాలచేత అవినాభావ సంబంధమేర్పడింది.

ఇటువంటి అనురాగబంధమూ, ప్రేమానుబంధమే నెల్లూరికీ "కనులకుదోచి" పాటకూ ఉన్నది. కాకతాళీయంగా ఈ పాటను సమీక్షించమనే నెల్లూరు వాస్తవ్యులైన వి. గోపాలరెడ్డిగారు కోరేరు.

"బాటసారి" విడుదలైన రోజుల్లో మద్రాసులో వేయబడే ప్రెవ్యూల గురించి, ప్రీవ్యూల గురించి నాకు తెలిసేదికాదు. ఏదైనా తెలుగుచిత్రం చూడాలనుకుంటే ప్రతీ వేసవికీ ఆంధ్రదేశంపై దండెత్తినపుడు ఎక్కడో ఒక్కడ "ఏలాగో ఓలాగు" చూడటమో, నాలుగేళ్ళు ఆగి మద్రాసులో మార్నింగ్ షో చూడటమో జరిగేది. నాలుగేళ్ళనుంచి "నిమ్మ నమ్మేక నిశీధ యుగమ్ము భంగి" ఎదురు చూస్తున్న "బాటసారి" విడుదలంటే, ఆరోజునే నెల్లూరు బయలుదేరాను. ఆ నాలుగేళ్ళ విరహం, ఆ వందమైళ్ళ ప్రయాణప్రయాస, టిక్కెట్లకోసం పడిన శ్రమ అంతా సార్థకమనిపించింది ఆ చిత్రం చూశాక. ప్రతి ఒక్కపాట, మాధవి పలికిన ప్రతి ఒక్కమాట, భానుమతి కంఠస్వరానికై ముఖంవాచిన నాకు అమృతప్రాయమనిపించాయి. ఇప్పుడు ఆలోచించి చూస్తే మొదటిపాటే అంత విలువైనది.

"కనులకుదోచి చేతికందని ఎండమావులున్నై
పోయగమునుండి సుఖమునోచని బ్రతుకులున్నవి కొన్ని
భూమి జనించి ఆకలికొదగని ఫలములున్నవి కొన్ని
మనసుననిండీ పలుకగరాని తలపులున్నవి కొన్ని"

ఈ సత్యం మనం నిత్యం ప్రపంచంలో చూస్తున్నదే. ఆ నిజాని కేమీ ప్రత్యేకత లేదు. కాని ఆ నిజాన్ని పొందుపరచిన మాటల్లో సముద్రాలవారి రచనలో ప్రతిభావుంది, ప్రత్యేకతా ఉంది. సప్తసాగర గాంభీర్యమూ ఉంది. ఏరిన ఊహలను కోరిన పదాలలో చేరికగా చేరవేయడంలో వారు సిద్ధహస్తులుగదా!

పై చరణం తరువాత వచ్చే ప్రశ్న:

"సృష్టిచేసినది దేవుడైన మరి నాశమునేల సృజించే
పలుకు నొసగినది దేవుడైన మరి మూగలనేల సృజించే
వెలుగునిచ్చినది దేవుడైన మరి చీకటి నేల సృజించే
పెనుచీకటి నేల సృజించే"

ఈ ప్రశ్న సముద్రాలవారిది కాదు. దేవిక ధరించిన ఆ పాత్రదీకాదు. కష్టకాలంలో తాత్కాలికంగా నిర్వేలహృదయాల నుద్భవించే అజ్ఞానప్రేరితమూ, అహంకారపూరితము అయిన అకారణ ఆత్మగర్వంవలన ఒకోప్రాణి సృష్టిని, సృష్టికారుణ్ణి సహితం విమర్శించి ప్రశ్నించ సాహసిస్తాడు. అటువంటి సమయంలో స్వార్థం, స్వోత్కర్ష ప్రకోపించగా, విశ్వేశ్వరునియందు వినయం లోపించగా ప్రభవించిన ప్రశ్న ఇది.

దానికి జవాబు,

"వేదశాస్త్రములు చదివినవారే ఎరుగరు సృష్టి విలాసం
అల్పబుద్ధివై జ్ఞానదాతనే సల్పకు పరిహాసం"
పైగా సలహా

"బ్రతుకంతా బలు ప్రశ్నలమయమై బ్రతుకును జనసముదాయం
బదులు కొరకు వెదకుటమాని బ్రతుకుట యే న్యాయం"

వేదాలు పఠించకపోయినా, వేదాంగాలైన ఉపనిషత్తులు పరిశీలించకపోయినా, ఒక జీవి నిర్లిప్తంగా జీవించాలంటే ఒక మానవాతీతశక్తిపై నమ్మకముండాలి. ఆశక్తిని రాం అన్నానరే రహీం అన్నానరే ఒకటే. అటువంటి నమ్మకమున్న వ్యక్తి జీవితంలోని ఒడిదుడుకులను మనోస్థైర్యంతో ఎదుర్కొగలుగుతాడు. సుఖదుఃఖాలను సమానభావంతో చూడగలుగుతాడు. ప్రశ్నించే తాహతులేక, ప్రశ్నలకు సమాధానం ఆలోచించుకొని చెప్పుకునే మనో పరిపాకం రాక, ప్రశ్నించడం మానుకోలేక సతమతమవుతున్న మరో ప్రాణికి పై విధముగా జవాబుచెప్పి ఓదార్చగలుగుతాడు.

పై పాటకూ నెల్లూరుకూ ఏర్పడినబంధానికి మంకొక కారణం సినిమా చూసినతరువాత నాకు శంకరాగ్రహారంలో లభించిన ప్రేమ పూరితమైన ఆతిధ్యము; చిననాటి స్నేహితుల సాన్నిధ్యము.

పై రికార్డు నెంబరు ఎన్. 69672. రెండవ ప్రక్క భానుమతి పాడిన "ఉపకారచింతే" నన్న పాట. సాహిత్యం సముద్రాలవారిదే. రెంటికీ సంగీతం ఎమ్వేణుది. ★

చిత్రభేదము

9—వ పేజీ తరువాయి

రాత్రులు ఆరుబయట నిద్రపోయేవాడిని. ఎందు కంటే, బాహాటంగా బాగా గాలి రావాలని! ఆదేగా మరి మన భోజనం!

సాయంత్రంపూట పార్కులో కూచునేవాడిని—ప్రతీ పిక్చరూ ప్లాన్ కథలనే అనుకునేవాడిని. ఎవడో కనిపించి—'ఫలానా పిక్చరు బ్రహ్మాండం సుమా' అనంటే 'ఏడిసిందిపోదూ. ఏవరేజ్ టు' అనేవాడిని.

"లేదు భాయ్—టాప్ కలెక్షన్సుట—రికార్డులు బ్రేకులుట" అని అతను అనేవాడు.

"నే నేకటి చెబుతా విను. ఇదంతా ఆరంభ శూరత్వం. ఏదీ—ఇది నాల్గోవారమేగా—అగు. ఎంతవరకూ నిలబడుతుందో చూడు" అనేవాడిని.

"లేదు—హిట్టుట—అసలు వందరోజులూ గ్యారంటీట"

"లాగుతార్లే—దానికేం"

"లేదయ్యా — థియేటరువాళ్లు అంతవరకూ మరో పిక్చరు వేసుకోం" అని చెబుతున్నారుట.

"అబ్బాయ్—నేనోటి చెబుతా విను. ఏదో ఒకటి ఉండాలి. ఏదో, చూడ్డానికి నలుగురు తారలు కని పిస్తున్నారు—నాలుగు డ్యాన్సులూ, నాలుగు పాటలూ బాగున్నాయి. ఏదో నలుగురూ చూస్తున్నారు. ఇదో సక్సెసా?"

ఇట్లా మాట్లాడేవాడిని. అంతేకాని ఒప్పుకునే వాడినికాదు.

ఒక సాయంత్రం పార్కుబెంచిమీద కూచు న్నాను. ఎవరోవచ్చి 'నమస్కారం డైరక్టరుగారూ' అన్నాడు. నాకు ప్రాణంలేచి వచ్చింది. ఎన్నాళ్ళకు విన్నా నీమాట! నవ్వుతూ 'నమస్కారం' అన్నాను. నా ప్రక్కన కూచోపెట్టుకుందాం అనిపించి, అంత లోనే డైరెక్టరు పోజుకొట్టి అతనివేపు చూశాను. నన్ను డిస్టర్బ్ చెయ్యకన్నట్టు. "నన్ను మీ కెర నను. [illegible] నేను, మీరు పిక్చరు తీస్తున్న రోజుల్లో మీ చుట్టూ తొంభై ఆరుసార్లు తిరిగాను. నేను తిరగటంకాదు—మీరే తిప్పారు. చివరకు వేషం ఇవ్వనేలేదు. పైగా 'నెక్స్టు పిక్చర్లో ఇస్తాలేవయ్యా' అని కసిరారు" అన్నా డతను.

"ఐతే ఇప్పుడు నన్ను ఖూనీ చేస్తావా ఏమిటి?" అన్నాను నేను భయపడి.

"నేను ఖూనీ చెయ్యనులెండి—నాకు వేరేపనుంది. చెప్పొచ్చేదేమిటంటే—మీకు నెక్స్టు పిక్చరు వస్తుం దేమోనని రోజూ ఎదురు చూస్తున్నాను. ప్రతి దేవుడికీ మొక్కుతున్నాను—మీ దుంపతెగా—ఇంత వరకూ మీకు రావటమేలేదు. కాని— ఇవాళ దేవుడు నాపై కనికరించాడు. ఏమిటంటే మా ఊరి నుంచి ఒక డబ్బున్న ఆసామీ దిగాడు. 'సినిమా తియ్యా లంటే ఎటుపోవాలి?' అని నన్ను అడిగాడు. మాటా, మాటా వచ్చాక తెలిసింది మా ఊరేనని. అతను సినిమా తీస్తానంటున్నాడు—జేబులో విల్లర డబ్బులు బాగా కనిపించాయిలెండి. 'పేరుండక్కర్లేదు—తెలిస్తే చాలు—డైరెక్టరెవరన్నా కావాలి' అన్నాడు. ఇంకేం మీరున్నారు అనుకున్నాను. అంచేత మీరు అక్కడ ట్రై చెయ్యండి—ఐతే నేను చెప్పానని మాత్రం చెప్పకండి. సమయంవస్తే నేనూ ఓ మాట వేస్తాననుకోండి. హాస్యంకాదు. కొంపదీసి, మీకు డైరక్షన్ ఛాన్సు తగిలిందా, నాకు వేషం గ్యారంటీ. ఏమంటారు?" అన్నాడు ఫలానా.

నాకు ఆశ కలిగింది. నా ప్రక్కనే కూచోమని ఫలానాకు చోటిచ్చాను.

'రేపుఉదయం నేనొచ్చి తీసుకెళ్ళి ఇల్లు చూపి స్తాను. మీ రెక్కడుంటారు?" అని అడిగాడు. నేను ఆలోచిస్తూ ఉంటే అతనే అన్నాడు.

"ఓపని చెయ్యండి—పాండీబజార్లోనే ఇట్నుంచి లెక్క పెట్టుకుంటూవెళ్ళి పదకొండోనెంబరు చెట్టుకింద నుంచోండి. పదకొండు నాలుక్కొ నెంబరు. నేనొచ్చి పికప్ చేస్తాను—అదే, పదకొకెలెండి."



చిత్రభేదము

"సరే" అన్నాను. అతను వెళ్ళిపోయాడు. నాకు అనుమానంవేసింది. ఒకసారి అనుభవం అయింది చాలదా అనుకున్నాను. వీడు కూడా ఎవడో అటువంటి వాడే పోగైతే? మరో ఫ్లాష్ పిక్చర్ తియ్యాలి. పిక్చరు దెబ్బ తిన్నదంటే నానుంచే అని అందరూ అంటారు గాని, అసలు సంగతి ఎవరూ ఆలోచించరు. ఏమో, ఒకవేళ నిజమేనేమో. దేవుడు మేలుచేస్తే ఈ చిత్రం హిట్టవరాదా—సరే, చేతికొచ్చిన ఛాన్సు జారవిడవటం ఎందుకు అనుకున్నాను. నా సామాన్లు ఒకరింట ఉన్నాయి. నా జోళ్ళు మరొకరియింట— నా పడక ఇంకోరి అరుగుమీద. ఒక అడ్రసంటూ లేదు. సరే, పొద్దున్న వీడెవడో మళ్ళీ ఇక్కడికి రమ్మంటున్నాడు, ఇప్పుడు పడకకోసం పోలోమని అంతదూరం ఎందుకు పోవటం? పోయి, పొద్దున్నే లేచి మళ్ళీ పోలోమని ఇక్కడికే రావాలి. అంచాత, ఈ రాత్రికి ఈ పార్కు బెంచిలోనే మకాం చేద్దాం అనుకున్నాను. అనుకున్నానో లేదో ఆకలివేసింది. జేబులో చిల్లికానీలేదు. ఐనా ఎందుకేనా మంచిది చూదాం అని జేబులో చెయ్యి పెట్టాను—ఒక చిల్లికానీ దొరికింది! ఈ రాత్రి భోంచెయ్యాలంటే కనీసం పదణాలుండాలి. లేదా టీ తాగడానికి బేడేనా ఉండాలి. ఏం చెయ్యటానికీ పాలుపోలేదు. నా కెదురుగా ఓ రూపాయినోటు కనిపించింది నేలమీద. చట్టునలేచివెళ్ళి తీశాను. అది కాయితమ్ముక్కగా మారిపోయింది! ఎవడేనావచ్చి, ఐదురూపాయలు పట్టి పుణ్యానికి తీసుకోమని ఇవ్వరాదా? లేకపోతే ఇంకెవడేనా పరుగెత్తి వచ్చేసి—ఎప్పుడో నే నిచ్చానని చెప్పి—ఒక రూపాయి తెచ్చియిచ్చి బాకీ తీర్చరాదా? తెలిసిన వాడెవడైనా ఇట్నా వెళ్ళరాదా? పోనీ ఎవడన్నా స్నేహితుడు 'పదరాభోంచేదాం' అనరాదా? అని ఇట్లా అనుకోసాగాను. ఐతే భోజనం చేసే వాళ్ళు ఇటురారు. హోటలుదగ్గర నించుంటే ఎవడన్నా రాకపోడాఅని, హోటలుగేటుముందు నించున్నాను—భోజనం చేసేసిన వాడల్లే తీపిగా. చాలా సేపటిదాకా ఎవడూ కనిపించలేదు. ఆతర్వాత ఒకడు కనిపించాడుగాని, వాడు భోజనంచేసేసి వస్తున్నాట్ట. పైగా పదపోదాం అంటాడు. నాకు పనుంది వెళ్ళమన్నాను. రాత్రి చాలాసేపయింది. హోటలు కుర్రాడొచ్చి 'మీల్స్ రడీ' అన్న బోర్డు తీసుకెళ్ళిపోయేంతవరకూ అక్కడే నించున్నాను. ఇంక లాభంలేదు—తెలిసినవాడెవడన్నా వచ్చినా, అసలు హోటల్లోనే కూడు లేదు!

"కష్టాలు కలకాలం కాపురం ఉండవు. కష్టం వచ్చినా సుఖంవచ్చినా మానవుడు చిరునవ్వుతో ఎదుర్కోవాలి రఘూ!" అని నాహిత పిక్చర్లోని డైలాగు మననం చేసుకున్నాను. వెంటనే చిరునవ్వు నవ్వాను. పార్కుబెంచిమీదచేరి, నిద్రపోయాను.

(న శేషం)

పరంపదవం

8 వ పేజీ తరువాయి

"అవును. నిజమే" శేఖరం నెమ్మదిగా జవాబిచ్చాడు.

"నిజమట నిజం! ఆమాత్రం బుద్ధి ఉండొద్దూ. నీకు పరువూ, మర్యాద లేకుంటే మాకుమాత్రం అక్కరలేదా? మా మర్యాదకాదా మంటకలిసేది?"

'మీ గొప్పతనాలు మీవద్దే ఉంటాయి. నా గౌరవం చెడిపోదు. మీ ప్రతిష్ఠకు లోటుగా ఎందుకు భావిస్తున్నారో నాకు....."

"నీకెట్లా తెలుస్తుంది. నీ ఇష్టమొచ్చినట్లు నువ్వు చేసుకుంటావు. మేమంతా మట్టిలో కలవాలవా? డాక్టరు ప్రకాశంగారి సంబంధము బంగారంలాంటిది. అన్నివిధాలా సరియైనది. నీ భవిష్యత్తు ఎంతో బాగుపడుతుంది. నువ్వు ఎవతెనో నాకు కోడలిగా కట్టిపెట్టాలనుకున్నావు. నీ దురదృష్టం" ఉప్పెనలా కోపం ఒక్క ఉదుటున పొంగింది.

"నాదికాదు దురదృష్టం. ప్రేమించిన యువతినే వివాహమాడాలనుకోవడం నా అదృష్టం. మీరు నిశ్చయించిన గొప్పింటి సంబంధము తప్పిపోవడం మీ దురదృష్టమే కావచ్చు" నిశ్చయంగా శేఖరం జవాబిచ్చాడు.

"ఛీ......ప్రేమించాడుట, వెధవ ప్రేమ! దాని పిచ్చిలోబడి దానికి గర్భంచేసి, దాని బెదిరింపులకు లొంగి తీరా ముంచుకొచ్చిన తర్వాత పెండ్లి చేసుకోవాలనుకొంటున్నావు."

"చాలా పొరపడుతున్నారు నాన్నగారూ. మేమిద్దరం ప్రేమించుకొన్నాము. ఒకరికొకరం వాగ్దానం చేసికొన్నాం. అప్పుడే వివాహానికి మాకు ఇష్టంలేకపోయింది. కాని మా ప్రేమకలాపం ఇంతవరకు పరిణమించింది. నామనస్ఫూర్తిగానే పెండ్లికి ఒప్పుకుంటున్నాను. గిరిజను మీరు చూచారు. ఆమె చదువు, స్థితిగతులనుగూర్చి విన్నారు. నేను వివాహమాడకుంటే ఆమెజీవితం నాశనమౌతుంది. ఒక స్త్రీ జీవితాన్ని బలిగొన్నవాడినౌతాను. నా జీవితంలో ఇలాంటి అన్యాయానికి నే నెప్పుడూ ఒప్పుకోను! నేను చేసిన పొరపాటల్లా—మా ప్రేమను మీకు ముందే తెలియపరచకపోవడం. అందుకు మీరు నన్ను మన్నించాలి. మమ్ములను కరుణించాలి." శేఖరం కండ్లకు నీటి ముత్యాలు అడ్డంగా నిల్చాయి. మాటలు కొక్కొరపడి బొంగురుగొంతునుండి దీనంగా వచ్చాయి.

తన పుత్రుని అసహాయస్థితికి తనేమీ మాట్లాడలేకపొయ్యాడు.

రఘుపతి విచారంలో మునిగి ఆలోచిస్తున్నాడు.

రఘుపతి రిటైర్డు ఇంజనీరు. అతని కుమారుడు శేఖరం మెడిసిన్ చదువుతూ, గిరిజను ప్రేమించాడు. ఆమెనే వివాహం చేసుకుంటానని ఆరోజు తండ్రితో వాదించాడు. కానీ, తండ్రి దృష్టి తన అంతస్థుకు, హోదాకు తగ్గట్టు దూరంగా గొప్పింటి మీద పడింది. డాక్టరు ప్రకాశం తన బాల్య మిత్రుడు. ఇప్పు డీ ఉద్యోగ అధికారాలతోపాటు తమ స్నేహ బాంధవ్యము మరింతగా పెరిగిపోయింది. తన కొడుక్కు ఆయనగారి కూతురు అరుణకు ఈడూ జోడూ బాగా సరిపోతుంది. ప్రకాశం తనమాటను త్రోసివేయలేడని యోచించాడు. ఈసంబంధానికే ప్రాముఖ్యత నిచ్చాడు రఘుపతి.

రఘుపతి చేతివ్రేళ్ళమధ్య చుట్ట కాలుతూ పొగ వస్తూవుంది. వెల్లకిలా పండుకొని ఎత్తైనదిండుపై నిటవాలుగా తలవాల్చి ఆకసంకేసి చూస్తున్నాడేకానీ, అతని మనస్సంతా ఆలోచనాగ్నితో దహించుకపోతుంది.

ఒక నక్షత్రం క్రిందికి రాలుతూ మధ్యలోనే మాయమైంది.

ఆకసంలోకి విచ్చుకున్న టౌటు వింతశబ్దంతో పగిలి, రంగుల్ని వెదజల్లి, చివరిగా పొగరూపంలో మాయమైంది.

ఆలోచనలకు అంతరాయంకలిగి టౌటు మ్రోగిన దిశకు తల త్రిప్పాడు రఘుపతి. పారిపోయే పొగ కనిపించింది.

ఆ టౌటుకు తన జీవితానికి సంబంధమేలేదని గమనించాడు రఘుపతి. టౌటు భూమిమీద ప్రేలి, ఆకాశాని కెగిరి శబ్దం చేస్తూ, తన గుణాలన్నింటినీ ఒక్కసారి వెదజల్లి క్షణికంలో పొగగా మారిపోతుంది.

రఘుపతి జీవితం సాఫీగా నడిచింది. గంట్లు పడినప్పటికీ తప్పించుకున్నాడు. ఆ గంట్లు విశిష్ట రూపాన్ని పొందలేకపోయాయి. కానీ ఒక్కటి బలిపీఠంలాంటిది మిగిలిపోయింది. అది గుర్తుకొచ్చే సరికి అతని గుండె కలుక్కుమంది. ముప్పదియైదు సంవత్సరాలు సుడిగుండాలులాగు వెనక్కు మళ్ళాయి.

* * *

జూనియర్ ఇంజనీరుగా బి. ఇ. పూర్తికాగానే రాజమండ్రి మొట్టమొదటిసారిగా అపాయింట్ చేశారు తనను. తను ఆపట్టణానికి రావడం అదే మొదటిసారి. ఒంటరిగా ఒక రూము తీసుకున్నాడు. తనకి శ్రీమతి రాలేదు. అంటే అసలింకా పెళ్ళనేది కాలేదు. ఆరోజు సోమవారం ఉద్యోగంలో చేరాడు తను. మొదటి రెండురోజులు ఆఫీసునుండి రాగానే రూమును తనకు వీలుగా మార్చుకున్నాడు. తరువాత తనకేమీ తోచేదికాదు. పట్టణమంతా క్రొత్తగానే వుంది. ఇంకా స్నేహితులంటూ ఏర్పడలేదు. విరామ కాలంలో ఏం చేయాలన్నది ఒక పెద్ద ప్రశ్నై కూర్చుంది.

ఒక సాయంత్రము పార్కుకేసి నడిచాడతను.

విశాలమైన పార్కులో రేడియో మెల్లిగా మూలుగుతోంది. అప్పుడప్పుడే జనం వస్తున్నారు. బాటకిరువైపుల, అర్ధరులో, పూలచెట్లున్నాయి. మిగతా నేలంతా పచ్చికతో నిండివుంది. కొన్ని చిన్న మొక్కలు తొట్లలో పెరుగుతున్నాయి. పెద్ద చెట్లు మందంగా కదులుతున్నాయి. సిమెంటు బల్లలు అక్కడక్కడా ఖాళీగా ఉన్నాయి. బటానీలు అమ్మేవాడు మాటిమాటికి అటూ, ఇటూ తిరుగుతున్నాడు. తను కొంతకాలం ఉల్లాసంగాగడపగలిగాడు.

నాలుగోరోజు సాయంత్రం రాజమండ్రిని కబళించుకొన్న గోదావరితీరాని కెళ్ళాడు తను. చిన్న చిన్న తిప్పలులాంటి అలలు గాలికి ఊగుతున్నాయి. రాళ్ళకు ఢీకొన్న అలలు నీటి తుప్పర్లను ఎగజిమ్ముతున్నాయి. ఎర్రని సూర్య కిరణాలతో కొన్ని అలలు ఆడుకొంటున్నాయి.

పిల్లగాలులు నీటి చల్లదనాన్ని గ్రహించి ఇసుక

పరంపదము

మీదుగా ప్రయాణంచేస్తూ, అందరితోపాటు తనని ఆహ్వానించాయి.

తను సూర్యకిరణాలచే వెండిలాగ మెరిసే నీటి అలలవైపు తెరిగ చూస్తూ నిల్చున్నాడు. ఒంటరిగా చూడడం కొంత కష్టంగాతోచింది తనకు. తోటి సహచరులు లేకుండేసరికి తన మనస్సుకు చిరాకు వేసింది.

ముందుకు కొంతదూరం నడిచాడు తను. పిడికిలనిండా ఇసుక తీసికొని గాలికి పాటంగా వదులుతూ ముందుకు సాగాడు. ఒక ఇసుకతిన్నెపై కూర్చుని ఇసుకను తోడుతూ, పూడుస్తూ కొంత కాలం గడిపాడు.

సూర్యుడు అస్తమించినచోట వెలుగు కనిపిస్తూవుంది. నెమ్మదిగా చేతులూపుకుంటూ కదిలాడు తను.

పున్నమిచంద్రుడు ఆతృతగా పైకి ఎగ్రబాకుతున్నాడు. నక్షత్రాలు ఐద్ధకంగా ప్రకాశిస్తున్నాయి.

వీధిలైట్లకాంతిలో ఏదో ఎరిగిన ముఖం కనిపించినట్లయింది తనకు. క్షణంసేపు ఊహించేసరికి బాగా గుర్తుకొచ్చింది. వెంటనే ఉత్సాహంతో చప్పట్లు కొట్టాడు. వడివడిగా పోతున్న శర్మకు పరధ్యానంలో అవి విన్పించినట్లు లేవు.

ఐదారు అంగలు పెద్దవిగవేసి చప్పట్లు తట్టి 'శర్మా' అని ఎలుగెత్తి పిల్చాడు.

రోడ్డమీదిజనం వెనక్కు తిరిగారు.

శర్మ కూడా వెనుదిరిగి చూశాడు—ఎవరా పిలిచేది అన్నట్లు.

'శర్మా' అని మళ్ళీ పిలిచి, చేతి రుమాలతో సంజ్ఞచేసి, అతనివైపు పరుగెత్తాడు తను.

శర్మ, తను ఇంటర్మీడియట్‌లో రూమ్‌మేట్లు. ఎంతో స్నేహంగా, అన్యోన్యంగా ఉండేవాళ్ళు. ఆ క్లాసు పూర్తికాగానే చెరొదారి చారిదయింది. తను ఇంజనీరింగుకై అనంతపురం వెళ్ళాడు. శర్మకు ఫస్టుక్లాసు రానందున బి. ఏ. లో చేరాడు. మొదటి రెండు సంవత్సరాలలో ఏ ఆరునెల్లకో ఒక్కొక్క ఉత్తరం వ్రాసికొనటిగారు.

"హలో శర్మా"

"ఓహ్హో......రఘువా"

శర్మ, తను చేతులు కలిపారు చిరునవ్వులతో.

తను ఊహించినంతగాలేడు శర్మ. చిక్కిపోయిన శరీరం—కళ్ళక్రింద ఏవో నల్లటి చారలు—నిగూఢ రహస్య విషాదాన్ని గోచరింపచేస్తున్నాయి. కొద్దిగా పెరిగిన గడ్డం, వడలుకుపోయిన బుగ్గలు, ముఖాన్ని కాంతిహీనము చేస్తున్నాయి. వీధిదీపాల వెలుగులో శర్మను చూడగనే తన శరీరం జలదరించినట్లయింది ఆశోభంగమ్మైనట్లు తోచింది.

"అలావున్నావేం" తను శర్మ నడిగాడు.

"ఆఁ......ఎన్ని సంవత్సరాలకు కలుసుకొన్నాం" తనమాట పూర్తిగాకముందే శర్మ అన్నాడు.

"చాలా చిక్కిపోయివున్నావే" తను మళ్ళీ అడిగాడు.

"దానికేముందిలే" చిరునవ్వుతో దాటవేశాడు.

శర్మ తనలోటును కప్పిపుచ్చి మాట్లాడుతున్నట్లుగా తను పసిగట్టాడు. అతనిముఖంలో తిరవి

ఆవేదన......తీవ్రంగా చూచేకళ్ళు.................. లేని చిరునవ్వు. తనకి వింతగా తోచాయి.

"ఇక్కడ ఏం చేస్తున్నావు" తన ప్రశ్న.

"బి. ఇ. చదివి క్లర్కుగా మునిసిపల్ ఆఫీసులో ఉద్యోగం చేస్తున్నాను.......మరి నీవో"

"బి. ఇ. పూర్తయింది. ఇక్కడ జూనియర్ ఇంజనీరుగా నాలుగు రోజులనుండి 'పవర్ హౌస్'లో పనిచేస్తున్నాను."

"ఓ......వెరీగుడ్" శర్మ చిరునవ్వు నవ్వాడు.

కానీ, ఆ నవ్వు కుమిలిన దుఃఖసముద్రంనుంచి వచ్చినట్లుంది తనకు.

కాలేజీ జీవితాన్ని గుర్తు చేసుకుంటూ, పాత స్నేహితుల వివరాలు తెలుసుకుంటూ రోడ్డు ప్లాటు ఫారంమీద ఆగుతూ నడుస్తున్నారు.

ఎలక్ట్రిక్ బల్బుచుట్టూ వెలుతురుకోసం రెక్కల పురుగులు నిండా ముసురుకుంటున్నాయి. దానికి పైగా ఆకసాన్ని కప్పివేస్తూ, నల్లగా చీకటి నీడలా విద్రగన్నేరుచెట్లు వ్యాపించివుంది. పొడలుపొడలుగా జారే వెన్నెల బల్బు వెలుగులో మాయమౌతుంది.

"అది సరేకాని, నీలో ఏదో గొప్ప వెలితి కన్పిస్తుంది" జరిగే సంభాషణను త్రుంచుతూ. వేరొక విధిదీపంలో ఆగుతూ అతని కళ్ళల్లోకి సూటిగా చూస్తూ తను అడిగాడు.

"మానవు డనగానే ఏదో వెలితి సహజంగా ఉంటుంది. కానీ, నాకు ఇంత చిన్నతనంలోనే గొప్ప తీరని వెలితి కలిగింది. అంతా విధికృతము" వైరాగ్య ధోరణిలో ముఖం పెట్టాడు శర్మ. గొంతులో ఆవేదన మిళితమైంది.

తన మనస్సు చివుక్కుమంది అతన్ని ఎందుకు కదిలించావా అని. అవును. కదిలించకుంటే ఎలా? ఇంటర్మీడియట్‌లోగల అనుబంధము తొలగిపోతుందా? మౌనంగా కాఫీహోటలు చేరారు.

"శ్రీమతిగా రింకా రాలేదా?" కాఫీ చప్పరిస్తూ తను ప్రశ్నించాడు.

"అవివాహయంలోనే తీరని వెలితి కలిగింది. కాని..." సందేహాన్ని వెలిబుచ్చాడు శర్మ.

తను కొంచెం తొట్రుపడ్డాడు.

"మనం ఇద్దరం స్నేహితులం. ఈ నాలుగు సంవత్సరాలు విడిగా వుండిపోయ్యాం. ఇప్పుడు మళ్ళీ ఒక్కటైనాం. మన స్నేహం మళ్ళీ పూర్వంలాగే అభివృద్ధి చెందుతుంది. మరి ఏనాటికైనా నీలో కలిగిన మార్పును నేను కనుక్కోవాలి. అది 'స్నేహిత ధర్మం' తనకు తోచిన ముక్క చెప్పాడు తను.

"అవును. అదీ నిజమే. నాకునూ చెప్పవలసినధర్మం వున్నది. అందువల్ల ఏమైనా హృదయభారం తగ్గిపోతుందో ఏమో. తర్వాత చెప్తాను."

కాఫీహోటలునుంచి బైటకొచ్చారు తాము. హృదయం బరువుగావుంది. రోడ్డుమీద కార్లు, దుమ్ము, వింతమనుషులు, బండ్లఅరుపులు, కోలాహలం—అన్నీ వెగటుగా ఉన్నాయి.

"సరే మళ్ళా రేపు కలుద్దాం. అమ్మ ఒంటరిగా ఉంటుంది. టైం చాలా అయింది" అన్నాడు శర్మ.

"అలాగేలే శర్మా. ఇంటి అడ్రసివ్వు. రేపు నేనే మీ ఇంటివద్ద కలుస్తాను" అడ్రసు నోట్ చేస

పరంపదము

కున్నాడు తను. 'గుడ్‌నైట్'లు చెప్పుకొని ఇద్దరూ విడిపోయ్యారు.

వాడిపోయిన ముఖంతో అంతులేని తలపులతో 'సూర్యంపేట' మీదుగా పోయాడు తను. దారిపొడవునా పూర్వాలోచనలు తన మస్తిష్కాన్ని ఆందోళన పరిచాయి. తనకుమటుకు తాను స్వతంత్రంగా జీవించాలనేవాడు. ప్రతి విషయంలో బాదరబందీ లేకుండా ఉండాలి. తనకు పట్టుదల అనేది అనవసరం. కావాలనుకున్నవని జరగనీ, లేకపోనీ ఆ కార్యాన్నిగూర్చి బాధపడేవాడుకాదు. ఆ కార్యానికి ప్రయత్నం చేయలేదనుకొనేవాడు. దాని లాభ నష్టాలు ఒక్కసారి విచారించేది. అంతే. దాన్ని తన దృష్టిపథం నుంచి తప్పించేది. అందుకే తనలో ఏదో ఉత్సాహం ఎప్పుడూ వున్నట్లు తోస్తుంది. కానీ, తనలోని కోర్కెలను నెరవేర్చాలనుకొనేవాడు. అవి ఎటువంటివైనాకానీ, ఎదుటివారిని నొప్పించకుండా ఉండేందుకు ప్రయత్నించేవాడు. ఎక్కువ పరిచయమున్నవారితోతప్ప మిగతా వారితో ముక్తసరిగా మాట్లాడేది. తరచు చుట్టపక్కాల ఇండ్లకు వెళ్లేవాడుకాదు. దానితో వాళ్ళు లేనిపోని అపోహలు కల్పించేది. "వీడు మహా పెద్ద చదువు చదువుతుంటాడని", "గర్వంగా ఉంటాడని", "చుట్టాలతో సరిగా మాట్లాడడని", "చూచీ చూడనట్లు పోతాడని" ఏవేవో గుసగుసలు తనకు వినిపించేవి. తను వాటన్నింటినీ పాటించేవాడు కాదు. తనకు తోచినవిధంగా ఉండేవాడు. అనవసరంగా ఇతరుల జోక్యానికి వెళ్లేవాడుకాదు.

తల్లిదండ్రులతో సహకరించేవాడు. వాళ్ళ ఆజ్ఞలను తన కర్తవ్యాలుగా భావించేవాడు. ఇష్టముండినా, లేకపోయినా "ఇది నా విధి" అని విసుగు కన్పరచకుండా ఆ కార్యాన్ని పూర్తిచేసేవాడు. ప్రతి విషయాన్ని యోచించేవాడు. తల్లిదండ్రులు తనకు పుట్టుక నిచ్చారు. ఎందుకు తనను పుట్టించారు? పెంచారు? కష్టసుఖాలలో ముంచారు? వంశాభివృద్ధి కొరకా? పిల్లలనుచూచి ఆనందించేందుకా? వృద్ధాప్యంలో తమని పోషిస్తారు అని? లేక కేవలం .... లేక......ఏమో.............

మానసికగ్లాని కలిగినపుడు మనసు, నిరాశచెంది కష్టంగాఉన్నపుడు—తనపుట్టుకదేనికోసం? కేవలం మాతా పితలను శిరసావహించడమా? ధనాన్ని సంపాదిస్తూ తన పుట్టుకలాగే ఇంకొకరికి జన్మ నివ్వడమా?

ఆ ఆలోచనలకు అంతూ వంతూ అంటూలేదు. ఎక్కడి వక్కడ తెంచివేశాడు తను. తన అభిప్రాయాలను తదనుకూలంగా మార్చుకున్నాడు. సాధ్యమైనంతవరకు సాఫీగా చూడతలచాడు.

పూర్తిగా ఆలోచించి, హృదయానికి కష్టమైనవి గాకుండా, శరీరానికి, మనస్సుకు, సుఖాన్నిచ్చే అవకాశాన్ని చూసుకొంటూ, ఇతరుల మనస్సు నొప్పించకుండా అందరితోపాటు సంఘంలో తనుగూడ గ్రుడ్డిగా బ్రతకను మొదలుపెట్టాడు.

నెమ్మదిగా రూము చేరాడు తను.

* * *

తన అల్పతకొద్ది సాయంత్రం ఆఫీసునుండి రాగానే స్నానంచేసి, హోటల్లో కాఫీత్రాగి శర్మ ఇంటికి నడిచాడు తను.

రేడియో విషాదసంగీతంతో మునిగివున్నాడు

శర్మ. కోళ్ళ కూతలతో శర్మ తనను గురించి ఆహ్వానించాడు. తనుకూడా ఆ సంగీతంలో మౌనం వహించాడు.

"షికారు వెళ్దాం శర్మా" అన్నాడు తను, అసలు బాధను తెలుసుకోవాలన్న ఆతృతతో.

"వెళ్దాం ఉండు......కాఫీ కానీ" శర్మ అన్నాడు.

కాఫీ అయినాక నదీ తీరాన్ని చేరాం.

గోదావరినీళ్ళు, నీళ్ళ కంటుకొని ఇసుక, చెట్ల మధ్యగా ఎత్తయిన కొండలు, సూర్యునికి అడ్డుగా తెల్లటి మబ్బులు, మబ్బులోంచి వెండి కిరణాలు, ఆపైన విశాల ఆకాశము—అందులో ఏదో లోటు కనిపిస్తుంది.

సూర్యుడు తన కర్తవ్యాన్ని ముగించేందుకు త్వరపడుతూ, అలసటతో ఎర్రగా మారిపోతున్నాడు.

బండల కానుకొని ఇసుకలో కూర్చున్నారు తాము. ఇద్దరిమధ్య నిశ్శబ్దం నిండింది. దూరాన ఊళ్లో కార్ల శబ్దాలు, సినీ రికార్డులు మసక మసకగా కళ్ళకు కన్పించినట్లు వినిపిస్తున్నాయి. ఎలా ప్రారంభించాలో అర్థం గాకుండా ఉంది తమ పరిస్థితి.

కొంతకాలానికి శర్మ సంభాషణ సాగించాడు.

"ఇప్పుడు నా గురించి జరిగిన విషయాన్ని నీ గుండెలోనే దాచుకో" తన ముఖంవైపు చూశాడు శర్మ.

గొంతులోని ఆవేదన, ఆ మాటల్లోని నిగూఢత తనహృదయాన్ని చలింపజేశాయి.

అలాగే అన్నట్లు వెర్రిగ తల ఊపాడు తను.

"ఇంటర్మీడియట్ పరీక్షలయినంతవరకు మనం ఒకటిగఉన్నాం. సాహిత్యాభిలాషతో బి.ఏ.లో చేరాను. మొదటి రెండు సంవత్సరాలు మనిద్దరిమధ్య కొద్దిగా ఉత్తరాలు నడిచాయి. తరువాత మనకు ఏ సంబంధము లేకుండా పోయింది. బి. ఏ. పూర్తికాగానే సెలవుల్లో మా తండ్రి గతించాడు. ఫలితంగా ఎం. ఏ. చదువలేకపోయ్యాను. మా అమ్మప్రోద్బలంతో మరుసటి సంవత్సరము మా పెదనాన్నగారు కుదుర్చిన సంబంధము చేసుకున్నాను. భార్యపేరు సుశీల."

ఎప్పుడో ఎక్కడో విన్నట్లుగా తోచింది ఆపేరు తనకు.

"నీకూ శుభలేఖ పంపించాను, పాత అడ్రసుకి. నీవద్ద నుంచి జవాబేరాలేదు. సుశీలది నెల్లూరు. దూరపు చుట్టరికమున్నది. మామగారు అనంతపురంలో లెక్చరరుగా పనిచేస్తుండినారు."

తన గుండెల్ని ఏదో కెలికినట్లుగాఉంది. శర్మేమో నిబ్బరంగా చెప్పుకుపోతున్నాడు.

"ఆసంవత్సరమే మామగారిని నెల్లూరికి మార్చారు. ఆ ముందుసంవత్సరమే ఆయన డిమాన్‌స్ట్రేటరునుండి లెక్చరరుగా ప్రమోషను పొందారు. నెల్లూరులోనే వివాహమైంది. మే మిద్దరం అన్యోన్యంగానే ఉంటూ వచ్చాం. పెళ్ళిఅయిన మరుసటి నెలలో అమ్మ, నేను, సుశీల మ్రొక్కుబడి తీర్చుకొనేందుకు భద్రాచలం వెళ్ళాం. ఎండలు విపరీతంగా ఉన్నాయి. దేవాలయానికి నడుస్తూ నడుస్తూ సుశీల మధ్యలో స్పృహతప్పి పడిపోయింది. డాక్టరుదగ్గరికి తీసికెళ్ళాం. గర్భిణి అని తేలింది. నా భార్య సుశీలకాదు. "దుశ్శీల" పెద్దగా, బాధగా అరిచాడు శర్మ—రెండు కొండలమధ్య నలిగేవాడు నిలాగా, నిప్పు ప్రాలతో కదిసారి అలిచినట్లు. ఇంకా నిబ్బరంగా ఉండేందుకు ప్రయత్నిస్తున్నాడు. కానీ, ఆ మాటలు అతని గుండెల్లోంచి దూసుకు వచ్చి తనగుండెల్లో దిగబడుతున్నాయి.

"అప్పటినుంచి మాకు ఆమెమీద అనుమానం పెరిగింది. కారణం—పెండ్లైన నెలకే నాలుగునెల్ల గర్భిణిగా తయారైంది. లోకానికి వెరచాం. సంఘానికి భయపడ్డాం. మాలో ఒకవిధమైన అసంతృప్తి పెరిగిపోయింది. అశాంతికి గురైనాము. రాబోయే అవమానాన్ని గురించి ఆలోచించాము. మా అమ్మ నన్ను పూర్తిగా శంకింపజేసింది. నా భార్య ఇంత అవినీతికి పాల్పడిందని నమ్మలేకపొయ్యాను. మా అమ్మ సూటిపోటి మాటలనేది. ఆ వారంరోజుల్లోనే నా భార్య శవం బావిలో తేలింది"

దట్టమైన నల్లటి మేఘాలు సూర్యుణ్ణి తరుముకుంటున్నాయి. గాలివేగం పెరుగుతూ వచ్చింది.

ఇద్దరి కండ్లలో నీళ్ళు నిండుగా ఉన్నాయి. ఇసుకలో వ్రేళ్ళు దూర్చేందుకుకూడా కష్టమైంది తన పరిస్థితి.

"ఇదిగో ఈ లేఖ చదువు. నా భార్య నా కిచ్చిన కడపటి సందేశము" శర్మ జేబునుండి ఒక లేఖను తీసిచ్చాడు.

"నీవే చదివి వినిపించు" తడబడుతూ అన్నాడు తను.

"లేదు. నీవే చదువు. నేను మళ్ళీ చదువలేను."

తను మనస్సులోనే చదివాడు.

"ప్రియమైన భర్తగారికి,

నన్ను పతితగా భావించారు. అది నిజమే. కండ్లు కనుపించని కామాంధకారములో ఈ దుస్థితికి పాల్పడ్డాను. అది ఎటువంటి పరిస్థితికి దిగజార్చేది ఇప్పుడు కన్పించింది. మీ హృదయాన్ని ఎంతగానో గాయపరిచాను. మిమ్మల్ని క్షమాపణ కోరదలిచాను. కానీ, అది ఏనాటికైనా మీ హృదయంలో మంట చెలరేగదీసి అశాంతికి ఎరచేస్తుంది. నా కీ లోకంలో శాంతి దొరకదు. నే నింతకంటే బ్రతికి అనుభవించాల్సిందేమీలేదు. మీ ప్రతిష్ఠ భంగపడకుండుటకై లోకుల నోళ్ళల్లో నానకముందే మిమ్ముల విడిచిపోతున్నాను. నేను అధఃపతనములో క్రుంగిన దానను. నన్నెంతగానో ప్రేమించారు. అనర్హురాలనైనాను. మీ జీవితాన్ని బలి చేసుకోకండి. పునర్వివాహమాడి సౌఖ్యంగా జీవించాలని ప్రార్థిస్తున్నాను.

తుది నమస్కారములు.


అభాగిని

సుశీల"

కన్నీటిబొట్లు లేఖను తడిపాయి. లోకమంతా గిర్రున తిరుగుతున్నట్లనిపించింది. హృదయం మీద సమ్మెటపోట్లు తగులుతున్నాయి.

ఆకాశంలో మేఘాల ఒత్తిడి ఉధృతమౌతోంది.

ఆ వ్రాత సుపరిచితం—సుశీలది. లెక్చరరు రామనాధం కుమార్తె. తను అనంతపురములో చదివేటప్పుడు తొలి పరిచయము, మధురానందములింతగా తటస్థించాయి. తనఅభిప్రాయాలకు తోడుగా క్షణికసౌఖ్యానికి పాల్పడింది. తను గ్రుడ్డిగ వ్యవహరించాడు. ఆమెకు గర్భంవస్తే? తననే వివాహమాడ తలచుకుంటె? ఆ రెంటికి తను జడుసుకున్నాడు.





పరంపదము

తర్వాత ఆమెను కలుసుకోనేలేదు. రామనాథం నెల్లూరుకు ట్రాన్సఫర్ అయినట్లు విన్నాడు తన హృదయంలో అలజడి తగ్గింది తేలికగా ఊపిరి పీల్చగలిగాడు అవన్నీ తన కళ్ళల్లో గిర్రున తిరిగాయి.

కానీ సుశీల వివాహం, తన ముఖ్య మిత్రుడితో జరిగింది—తనకు తెలియదు అవమానానికి గుర్రై ప్రాణాన్ని తీసుకుంది. శర్మ జీవితాన్ని కూల్చదోసింది. ఎవరు దీనికి కారకులు? తనా? సుశీలా?

తన కోర్కెలు అటువంటివి—గుణాలు అంతే. పూర్తిగా దిగజారినపిమ్మట పతనస్థితి కనిపించింది మనోదౌర్బల్యమే కారణము స్వార్థం పెచ్చు పెరిగింది ఇతరుల జీవితాల్ని నాశనం చేసింది.

వేడి నిట్టూర్పులు విడిచి లేఖను తిరిగి ఇచ్చి వేశాడు తను.

సూర్యుడు తన కర్తవ్యాన్ని ముగించాడు. మబ్బులు చెల్లాచెదురుగా ఆరిచాయి—సూర్యుడు దొరకలేదని.

మళ్ళీ చెప్పను మొదలెట్టాడు శర్మ

"నా భార్యను ఎంతగానో ప్రేమించాను ఆమెను శంకించినపుడు ఆమెపట్ల నా ప్రవర్తన వింతగానే మారింది. ఆ విషయాన్నిగూర్చి నా హృదయం మథనపడింది దానికొక రూపం రాకముందే నా భార్య నన్ను వీడిపోయింది పశ్చాత్తాపంపొందిన భార్యను రక్షించుకోలేకపోయ్యాను. నా కళ్ళముందే ఆత్మహత్య చేసుకున్నట్లుయింది. గుడ్డివాడ్నిగా తయారయ్యాను. దూరపుకొండలు నునుపులాగ నా భార్యమీది ప్రేమ మరింతగా పెరిగింది. మానవు లన్నాక జీవితంలో ఎన్నో తప్పులు చేస్తారు అవి వాటంతటవే జరిగిపోతాయి. సుశీల నన్ను నడి సముద్రంలో ముంచివెళ్ళింది దుర్బలస్థితికి జారి పోయ్యాను మా అమ్మ నా దిగులుతో పూర్తిగా కృంగిపోయింది కుటుంబమే పతనమైనట్లుగా తోచింది నా జీవితానికి ఒక్క అమ్మ మిగిలింది. ఆమెనన్నా సుఖపెట్టాలి పాతవిషయాలను మర్చి పోవాలని గుండె దిటవుచేసుకున్నాను. కాని అది సాధ్యం కాలేదు అందుకే ఊరుమార్చి ఇక్కడికి వచ్చాం. కాల మెక్కువయ్యేసరికి విచారంలోకి జారి పోత్సు. ఉద్యోగంలో చేరాను ఎనిమిది నెలలు పూర్తి కావచ్చింది"

చెప్పుతున్నట్లు ముగించాడు శర్మ

అతనికేంతెల్సు, తన స్నేహితు డిటువంటివాడని! తనకే ఎందుకు చెప్పాడు? ఇది రహస్యంకాదా? తనే అతని భార్యచావుకు కారణం అని తెలుసా? తెలిస్తే తనను క్షమిస్తాడా? తను నిర్భాగ్యుడు. స్వార్థ పరుడు కాలకూటవిషం తనలో నిలువునావుంది. ఆవిషమే అతని కుటుంబాన్ని కాల్చివేసింది

నిజంగా తనలో మానవత్వం మిగిలివుందా? పశువుగ మానవరూపంలో ఉన్నాడా తను తన ఆశయాలకు, అభిరుచులకు, ఆలోచనలకు తృప్తిపడేవాడు. తుచ్ఛ ఆలోచనలు, నీచపు అభిరుచులు, పిచ్చి ఆశయాలు, నీచుడు, తుచ్ఛుడు తను

ఉన్నట్లుండి ఒక ఉరుము 'ఖణేల్'మని మెరుస్తూ పెద్దగా ఉరిమింది

అందులోంచి వచ్చి పిడుగు తన నెత్తిన పడలేదే, గోదావరి చిన్ననీటి అలలు సముద్రపు కెరటాల

ాగు మెరుపు మెరుస్తున్నాయి. ఆకాశం పడమటి భాగం పూర్తిగ మేఘావృతమై నల్లబడింది. చినుకులు దూరాన్నుంచి తరుముకొస్తున్నాయి.

శర్మవైపు చూశాడు తను.

దీర్ఘంగా యోచిస్తున్నాడు, నల్లటి మబ్బుల్లోంచి ఉదయించే చంద్రునికేసిచూస్తూ.

నిజానికి తను అంత నీచుడా? తన రాతిగుండెకు బాధగా తోచలేదు. తన మనస్సుకు పొరబాటుగా జరిగినట్లు కనిపించింది. అందుకే తను అంతగా నిందించుకొన్నాడే! తన కటికగుండె ఒప్పుకోలేదు. తనపరిస్థితికి తాను హేళనగా నవ్వుకున్నారు.

తన ప్రవర్తన, మనస్తత్వం కేవలం స్వార్థానికి దారితీశాయి. అందరి దారులకంటె వింతగ కన్పించింది. శర్మ ఇక ఆవిషయాన్నిగూర్చి బాధపడాల్సిందేనా? ఆబాధతోనె అతని జీవితం గడిచిపోవాల్నా?

ఒక దుస్సంఘటన సంభవించింది. అందులోనే విదురిదితే ఒడ్డును చేరకుండా. అతను జీవితంలో అనుభవించాల్సినవి లేవా? శర్మకు సలహా ఇచ్చేందుకు తనకు ధైర్యం చాలలేదు. హృదయానికి తట్టలేదు. కాని ఆసమార్గంలో తను బ్రతికి సాధించాల్సిందేమిటో?

నిశ్శబ్దంగా వెళ్ళిపోయ్యారు.

అభాగినిగూర్చి స్మృతి కలిగిందంటే తన గుండె కలుక్కుమనేది.

* * *

గత జీవితఘట్టం రఘుపతిగారి మనస్సులో అగ్నిజ్వాలగా దహించింది. శరీరమంతా స్వేదబిందువులు కారసాగాయి.

తను నేటిరక్తంలో, జీవితానుభవంలోక ఆఘోర విషయాన్ని హేళనగా చూడగలిగాడు. అది తన హృదయంలో గట్టిగ ముద్ర వేసుకుంది. కాని ఇప్పటి అనుభవాలు—తను ఎక్కి దిగిన మెట్లవల్లాలు—ఒక పాంతకుడు అని చెప్తున్నాయి. నిస్సహాయస్థితిలో దంటపిల్లాడిలా కన్నీళ్ళు కార్చాడు రఘుపతి.

ఒకస్త్రీ జీవితాన్ని నాశనం చేశాడు తను. ఒక కుటుంబాన్ని అధఃపాతాళలోకానికి త్రొక్కాడు. కాని తనపుత్రుడు నిర్భయంగా, దృఢంగా ప్రేమించిన స్త్రీని రక్షించాలని తనను వేడుకొన్నాడు. ఎదిరించాడు. తను తెలిసీ మళ్ళీ తప్పుచేయబోయ్యాడు. తనలో ఇంత కాఠిన్యం మేదీమందులాంటితను — తనను క్షమాభిక్ష కోరుకున్నాడు, తన పుత్రుడు. తను తండ్రిపొదాని వెలగబెట్టాడు. శేఖరాన్ని అవమానపరిచాడు. అంధకారంలోకూరుకుపోయ్యాడు. తన వజ్రంలాంటి కొడుకుతో తను సరితూగగలడా? అతని శరీరం సిగ్గిలింది.

అతని మస్తిష్కంలో ఒక మెరుపు మెరిసింది. రోమాలు గగుర్పొడిచాయి. దేహమంతా ఒక్కసారిగ పులకించింది.

ఆరిపోయిన చుట్టను విసిరివేశాడు.

రఘుపతి తటాలున లేచి, ప్రక్కగదికెళ్ళి నిద్రపోతున్న శేఖరాన్ని తట్టి లేపి "నీ ఇష్ట ప్రకారమే గిరిజను పెండ్లిచేసుకో" అని తన హృదయారాటాన్ని తీర్చివేశాడు. ★

కొద్ది, గొప్ప రైతుకు దెబ్బతగులక మానదు. పరిశ్రమలు పెంపొందితేగాని, అమ్మకంపన్ను ద్వారామా కాబడిపన్నులో ఎక్కువవాటా రావడంద్వారానూ, ఆదాయం అభివృద్ధిఅయ్యే అవకాశం లేదు. ఇప్పటి మన ప్రభుత్వ ధోరణిబట్టి ఇంతలో పరిశ్రమలు అభివృద్ధిఅయ్యే ఆశ లేదు

ప్రణాళికాద్రవ్యంకోసం కేవలం రైతుపైనే పన్ను వేసి పీడిస్తున్నారన్న వాదం సరియైనదికాదు. ఈ పీడన జనసామాన్యం అందరిపై ఉన్నదేగాని, ఒక్క రైతుపైనే ప్రభుత్వం కక్షకట్టలేదు. ఈ ఐదారేళ్లలో భూమిశిస్తుతోపాటు, ప్రభుత్వం ఇతర పన్నులుకూడా పెంచింది ఉదాహరణకు భూమిశిస్తు 1957—58 లో 10 కోట్లనుంచి 62—63 నాటికి 12 కోట్ల 64 లక్షలుకాగా స్టేట్ ఎక్సైజు సుంకాలు 6 కోట్ల 33 లక్షల నుంచి 9 కోట్లకు, అమ్మకంపన్ను 9 కోట్లనుంచి

మనమూ-మనరాష్ట్రం

7-వ పేజీ తరువాయి

13 కోట్లకు పెరిగాయి ఇలాగే ఇతరపన్నులుకూడా

గత పదేళ్లుగా జరిగిన కృషి ఫలితానికివస్తేగాని ఈ పన్నులభారం తగ్గదు ఈ సమయంలో ప్రణాళిక అమలుకు వెన్నెముకగా ఉండవలసినవారు వెనుకంజవేసి, సత్యాగ్రహాద్యమాలకు సమకట్టితే రాష్ట్రానికి మోక్షం ఉండదు అభివృద్ధికృషికి అంతరాయం కల్పించి, రాష్ట్రంలో కల్లోలం సృష్టించే, తమ సంకల్పం ప్రమాదపరిణామాలను గురించి ప్రతిపక్షాలవారు పునర్విమర్శ చేసుకోవాలి

ఈసందర్భంలో ప్రభుత్వం కూడా ఒక్క విషయం గమనించాలి గత రెండు ప్రణాళికలలో దాదాపు 300 కోట్లు ఖర్చు చేసినా, అభివృద్ధి అగమ్యగోచరమ్మై, నానాటికి పన్నులభారం పెరుగుతున్నదని అసంతృప్తి ఏర్పడింది ఆ అసంతృప్తి పరాకాష్ఠనందుకోడమే ఈనాటి ఈ అలజడికి కారణం. ఉన్న సాధన సంపత్తిని, దుబారా లేకుండా పొదుపుగా వాడుకోగలిగితే, కొత్తపన్నుల ఆవశ్యకత కొంత తగ్గుతుంది సేకరించడమే మావంతు, ఖర్చుపై మా కంట్రోలు లేదనుకుంటే ప్రయోజనం లేదు. ఇంతవరకూ ప్రభుత్వానికి అటువంటి కంట్రోలున్నట్లు కన్పించడంలేదు కనుకనే ప్రణాళికపై ఈ నిశిత విమర్శలు.

ఇప్పుడు అదనపు భూమిశిస్తుబిల్లు సెలెక్టుకమిటీ పరిశీలనలో ఉంది ఇందులో మంత్రులు, ప్రతిపక్షనాయకులుకూడా ఉన్నారు శిస్తు హెచ్చింపువల్లకల్గే తీవ్ర ఆందోళన గమనించి, సామాన్య రైతుకు మరీ భారం లేకుండా కొంత తగ్గించడం సమంజసం

—కౌండిన్య

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press 6 & 7 Thambuchetty Street Madras-1. Chief Editor : S. Sambhu Prasad.


రెమి
స్నో
&
పౌడర్